సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 258
శుక్రవారం 9-12-2022
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'ప్రజాసేవలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా చిరునవ్వుతో ఎదుర్కొంటా'





ఇటీవల 'ఎక్స్‌టెన్షన్' అనే పదం విరివిగా వినిపిస్తోంది. హెయిర్, ఐ లాషెస్‌తో పాటు నెయిల్ ఎక్స్‌టెన్షన్‌కీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. బ్రైడల్ థీమ్‌లో నెయిల్ ఆర్ట్ మెయిన్ పార్ట్‌గా అట్రాక్ట్ చేస్తోంది.

గోరంత వేడుక

చీర డిజైన్‌కు గోరు డిజైన్ మ్యాచ్

కొన్ని రంగుల నెయిల్ పాలిష్‌లు తెచ్చుకొని, డ్రెస్‌కు లేదా చీరకు మ్యాచ్ అయ్యే రంగును గోళ్లకు వేసుకోవడం మనకు తెలిసిందే. అయితే, ఇప్పుడు చీర లేదా డ్రెస్ రంగుతో పాటు ఆ డిజైన్‌కు మ్యాచ్ అయ్యే థీమ్ ఆర్ట్‌ను నెయిల్స్‌పై ఎంచుకుంటున్నారు. అందుకు నెయిల్ ఆర్ట్ స్పాలు ప్రత్యేకంగా సిద్ధం అవుతున్నాయి. బ్రైడల్ నెయిల్ ఆర్ట్‌కు మంచి డిమాండ్ ఉంటోంది.







పెళ్లి వేడుకలో భాగంగా మెహెందీ వేడుకకూ అధిక ప్రాధాన్యత ఇస్తుంటారనే విషయం మనకు తెలిసిందే. దీంట్లో బ్రైడల్ డిజైన్ థీమ్స్ ఎక్కువ ఆకట్టుకుంటుంటాయి. చేతుల గోరింటాకు అందానికి మరింత వన్నె రావడం కోసం నెయిల్స్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తున్నారు.

ఎక్స్‌టెన్షన్

బ్యూటీ కాన్సెప్ట్‌లో ఇటీవల అధికంగా వినిపిస్తున్న మాట ఎక్స్‌టెన్షన్. హెయిర్ ఎక్స్‌టెన్షన్ గురించి మనకు తెలిసిందే. అలాగే, మన నెయిల్స్‌కు సూట్ అయ్యే ఆర్టిఫిషియల్ నెయిల్స్‌ను సెట్ చేసుకొని, నచ్చిన ఆర్ట్ వేయించుకోవచ్చు. ఇందుకు ప్రత్యేకంగా శిక్షణ తీసుకునే వారూ పెరుగుతున్నారు.


గ్లిటర్.. రింగ్...


సంపూర్ణంగా అలంకరించిన, మెరిసే గోళ్లతో ఉండే సొగసైన చేతులు చూడటానికి రెండు కళ్లు సరిపోవు అనిపిస్తాయి. అందుకే, బ్రైడల్ నెయిల్ ఆర్ట్‌కి మంచి డిమాండ్ ఉంది. నెయిల్ పెయింట్‌తో బేసిక్ కలర్‌ని వేశాక, ఆర్టిస్టిక్‌గా తీర్చిదిద్దుతారు. వీటికి గ్లిటర్ మెరుపులు అద్దుతారు. దీనికి, నెయిల్ రింగ్స్, ఫ్యాన్సీ స్టడ్స్ కూడా మంచి లుక్‌ని ఇస్తున్నాయి. స్వరోస్కి, స్టోన్స్ కూడా ఈ డిజైన్‌లో భాగం అవుతాయి.



– తరుణి శ్రీగిరి, ఫ్యాషన్, నెయిల్ ఆర్ట్ డిజైనర్, బంజారాహిల్స్









నెల వరకు...

- సాధారణంగా ఆర్టిఫిషియల్ నెయిల్స్ కొన్ని మోడల్స్‌లో ఉంటాయి. అవి, మన నెయిల్ షేప్‌ను బట్టి, డిజైనర్ సెట్ చేస్తారు. ఈ మోడల్స్‌ను మార్కెట్ నుంచి తెచ్చుకుంటే మనమే జెల్ పెట్టి, నెయిల్స్ అటాచ్ చేసుకోవచ్చు. ఆ తర్వాత డిజైన్ చేసుకోవచ్చు. అలా సరైన విధంగా రాదనుకునేవారు నిపుణులచేత డిజైన్ చేయించుకోవచ్చు.
- చేతులకు పెడిక్యూర్‌లో భాగంగా వేలి కొనల్లో క్యూటికిల్, డెడ్‌స్కిన్ అంతా క్లీన్ చేసి అప్పుడు మన వేళ్లను బట్టి ఏ షేప్‌లో కావాలో ఆ ఆర్టిఫిషియల్ నెయిల్స్ అమర్చుకోవాలి. (నెయిల్స్ పెరిగినప్పుడు, వీటిని మళ్లీ క్లియర్ చేసుకోవచ్చు).
- సరిగా ఉపయోగించుకుంటే నెలవరకు ఈ డిజైన్ ఉంటుంది. రోజువారీ పనులకు ఆటంకం ఏమీ ఉండదు.
- కాళ్ల గోళ్లకూ ఇదే తరహాలో ఆర్ట్ ఉంటుంది.

ఒరిజినల్ లుక్...



- మన ఒరిజినల్ నెయిల్స్‌ని ఓవర్లీ అంటారు. ఎక్స్‌టెన్షన్ నెయిల్స్ వద్దు అనుకున్న వారికి జెల్ కోట్ వేసి, పాలిష్ తర్వాత ఆర్ట్ ఉంటుంది. ఈ పాలిష్ నెల రోజుల వరకు ఉంటుంది.
- డిజైన్ బట్టి ఛార్జ్ ఉంటుంది. థీమ్‌ను బట్టి ఛార్జ్ పెరుగుతుంది.

బ్యూటిప్స్

చుండ్రుకి నువ్వులతో చెక్

- కప్పు నల్లనువ్వులను తీసుకుని మెత్తగా పొడిచేసి పక్కన పెట్టుకోవాలి.
- అరలీటరు కొబ్బరి నూనెను మందపాటి పాత్రలో పోయాలి. దీనిలో నువ్వుల పొడి, నాలుగు మందార పువ్వులు, రెండు కరివేప రెబ్బలూ వేసి సన్నని మంట మీద మరిగించాలి.
- మందారపువ్వులు, కరివేపాకు క్రిస్పీగా మారాక నూనెను దించేసి చల్లారనిచ్చి, ఎయిర్‌టైట్ కంటైనర్‌లో నిల్వ చేసుకోవాలి. రెండురోజులకొకసారి ఈ ఆయిల్‌ను తలకు పట్టించి మర్దన చేసి నాలుగు గంటల తరువాత తలస్నానం చేయాలి.
- క్రమం తప్పకుండా ఇలా చేయడం వల్ల చుండ్రు తగ్గడమేగాక, బాలనెరుపు నియంత్రణలో ఉంటుంది. జుట్టుకూడా ఒత్తుగా పెరుగుతుంది.
- తెల్లనువ్వుల్లో పోషకాలు ఉంటే నల్ల నువ్వుల్లో ఒమేగా 3, 6 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మాడుని తేమగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మాడుని పొడిబారకుండా చేసి, చుండ్రుని తగ్గిస్తాయి.
- యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చుండ్రుని మరింత విస్తరించకుండా నియంత్రిస్తాయి.



కొన్నిసార్లు పరిస్థితులే సామాన్యులని అసామాన్యులుగా మారుస్తాయి. అపారమైన శక్తిని ఇచ్చి ముందుకు నడిపిస్తాయి. బిహార్‌కు చెందిన **నిభాసింగ్** డిజిటల్ వేదికనే రణభూమిగా చేసుకొని ప్రజా సమస్యలపై పోరాడుతూ డిజిటల్ బాహుబలి'గా ప్రశంసలు అందుకుంటోంది...



నిభా సింగ్

భళిరా భళి భళీ... సాహోరే డిజిటల్ బాహుబలి!

డెబ్బై సంవత్సరాల ముఖేష్‌కి రెవెన్యూ ఆఫీసులో పని. నెలరోజులు ఆఫీసు చుట్టూ తిరిగినా ఎక్కడ ఉన్న పని అక్కడే అన్నట్లుగా ఉంది. చిన్న సమస్య కోసం మున్సిపాలిటీ ఆఫీసుకు వెళ్లిన పూనమ్‌కు ప్రతి రోజూ నిరాశే ఎదురవుతుంది... ఈ నేపథ్యంలో వీరికి మాత్రమే కాదు పట్నా(బిహార్) కళాశాల విద్యార్థుల నుంచి కార్మికుల వరకు ఎక్కువమందికి డిజిటల్ 'బాహుబలి ఆర్మీ' పెద్ద దిక్కుగా మారింది.

తమ యూట్యూబ్ చానల్స్ ద్వారా ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న వారిని ప్రజలు ప్రేమగా 'డిజిటల్ బాహుబలి'గా పిలుచుకుంటారు. ఈ సైన్యంలో ఏకైక మహిళ నిషాసింగ్ అలియాస్ నిభాసింగ్.

'డిజిటల్ బాహుబలి'గా గుర్తింపు పొందిన నిభాసింగ్‌కు తనను 'రిపోర్టర్ నిభా' అని పిలిపించుకోవడం అంటేనే ఇష్టం.

'ప్రజల కోసం పనిచేయాల్సిన వ్యవస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. దీంతో చాలా మంది నన్ను ఆశ్రయిస్తున్నారు. వారి తరపున నేను పోరాడుతున్నాను' అంటుంది 25 సంవత్సరాల నిభాసింగ్.

'నిభాను రిపోర్టర్ అనే కాదు సామాజిక కార్యకర్త అని పిలవడం కూడా సబబుగా ఉంటుంది' అంటారు ఆమె అభిమానులు.

నిభాసింగ్ యూట్యూబ్ చానల్‌కు 5 లక్షలమంది సబ్‌స్క్రైబర్‌లు ఉన్నారు. ఇక ఫేస్‌బుక్‌లో 4లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. నిభాసింగ్‌కు ఎన్నోసార్లు బెదిరింపులు వచ్చాయి. అయితే ఎప్పుడూ ఆమె వాటికి భయపడింది లేదు. దీంతో సంఘవిద్రోహ శక్తులు తోక ముడిచాయి.

'నా పేరు ముందు రిపోర్టర్ అనే మాట ఉంది. అది శబ్దం కాదు సైన్యం' అంటుంది నిభాసింగ్

పోలిస్‌స్టేషన్ నుంచి హాస్పిటల్స్ వరకు రకరకాల సమస్యలపై నిభాకు రోజుకూ 20–30 వరకు ఫోన్ కాల్స్ వస్తుంటాయి.

మఖన్‌లాల్ చతుర్వేది నేషనల్ యూనివర్శిటీ నుంచి 'మాస్ కమ్యూనికేషన్'లో పట్టా పుచ్చుకున్న నిభాసింగ్ తన చానల్ ద్వారా పేద విద్యార్థుల సమస్యలను వెలుగులోకి తేవడం ద్వారా బాగా పాపులర్ అయింది. వృత్తిరీత్యా మాట్లాడడం తప్ప ఉన్నతాధికారులు, నాయకులతో పరిచయాలు పెంచుకోవడం తనకు బొత్తిగా ఇష్టం ఉండదు.

'పరిచయం పెరిగి అది స్నేహంగా మారిన తరువాత తప్పులను ఎత్తిచూపలేము' అనేది నిభా అభిప్రాయం.

యూట్యూబ్ రిపోర్టర్‌గా తన కృషి వల్ల ఎన్నో ప్రభుత్వ కార్యాలయాల పనితీరులో మార్పు వచ్చింది అని ఒకింత గర్వంగా చెబుతుంది నిభా.

ఆమె వయసు 78. కాని దేశ సరిహద్దుల్లో సైనికులకు 'దమ్ము' ఇస్తోంది. 'ప్రాణాయామం'తో వారి ఊపిరిలో బలం నింపుతోంది. ధ్యానంతో వారి మానసిక బలం పెంచుతోంది. దాదాపు 60 ఏళ్ల వయసులో యోగా నేర్చుకున్న **పద్మిని జోగ్** యోగా టీచర్‌గా దేశాన్ని, సమాజాన్ని గొప్ప సాధనలోకి నడిపిస్తోంది.



పద్మిని జోగ్

సైనికులకు యోగా టీచర్

'**నా** మటుకు నాకు యోగా అంటే ఒక ప్రార్థన. దేవుని పటం ముందు కూచుని మీరు చేసే ప్రార్థన చేయండి. కాని యోగా కూడా చేయండి. మీరు భోజనానికి, పనికి, నిద్రకు సమయం ఇచ్చినట్టే రోజులో 40 నిమిషాలు యోగాకు ఇవ్వండి. ముప్పై నిమిషాలు ప్రాణాయామం, పది నిమిషాలు ఆసనాలు చేస్తే చాలు మీ జీవితంలో వచ్చే మార్పు అంతా ఇంతా కాదు' అంటారు పద్మిని జోగ్.

ఆమె వయసు 78. కాని ఇటీవలే ఆమె సముద్ర మట్టానికి 12000 అడుగుల ఎత్తున ఉన్న సైనిక శిబిరాలకు వెళ్లి మన సైనికులకు యోగాలో శిక్షణ ఇచ్చారు. 'నా యోగా క్యాంప్‌లో 7 రకాల ప్రాణాయామాలు, 7 రకాల సూక్ష్మ వ్యాయామాలు, 7 రకాల ఆసనాలు ఉంటాయి. వీటితోపాటు యోగ నిద్ర, ధ్యానం కూడా ఉంటాయి. సైనికులు ఎంతో వొత్తిడిలో ఉంటారు. వారు మానసికంగా శారీరకంగా లక్ష్యశుద్ధిలో ఉండాలి. అదే సమయంలో వారి మనసు ప్రశాంతంగా ఉండాలి. అందుకే యోగా అవసరం. దీనిని మన ప్రభుత్వం గుర్తించింది కనుక నా క్యాంప్స్‌ను ప్రోత్సహిస్తోంది. సైనికులు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు' అంటారు పద్మిని జోగ్.

ఆమె క్యాంప్స్ ఆర్మీలో, నేవీలో, ఎయిర్ ఫోర్స్‌లో గత కొన్నేళ్లుగా కొనసాగుతున్నాయి. అందరూ యోగా టీచర్ అంటారామెను.

పాఠాల నుంచి ఆసనాలకు



సైనికులకు శిక్షణనిస్తూ...

బెంగళూరుకు చెందిన పద్మిని జోగ్ నిజానికి ఒక సాధారణ గృహిణి. భర్త ప్రతాప్ జోగ్ ఆర్మీలో ఆఫీసర్ కనుక అతని పోస్టింగ్ ఉన్న చోటుకంతా వెళ్లి ఇద్దరు పిల్లలతో ఉన్న కుటుంబాన్ని చూసుకునేది. పిల్లలు ఎదిగొచ్చాక మాంటిసొరి కోర్సు చేసి టీచరుగా పాఠాలు చెప్తూ సమయాన్ని గడిపేది. భర్త రిటైరయ్యాక ఆమె యాక్టివ్‌లో ఉంది. అతనిది నాగ్‌పూర్ కనుక అక్కడకు వెళ్లాక అనుకోకుండా యోగా మీద దృష్టి పడింది. భార్యాభర్తలు ఇద్దరు అక్కడ యోగ అభ్యాసి శిబిరంలో చేరి యోగా నేర్చుకున్నారు. నిపుణులుగా మారడానికి రాత పరీక్షలు కూడా రాశారు. ఆ తర్వాత తాము నేర్చుకున్న విద్యను నలుగురికీ పంచడానికి క్యాంప్‌లు నిర్వహించసాగారు. కాని ఆ నేర్చుకున్నది చాల్లేదనిపించింది.

రామ్‌దేవ్ శిష్యులుగా

ఆ సమయంలోనే రామ్‌దేవ్ బాబా హరిద్వారాలో యోగా టీచర్ల కోసమే ప్రత్యేకమైన కోర్సు చెబుతున్నట్టు ప్రకటన వచ్చింది. భార్యాభర్తలు ఇద్దరూ దానికి హాజరయ్యారు. నేరుగా రామ్‌దేవ్ బాబానే పాఠాలు చెప్పారు. ఆ కోర్సు వారికి చాలా విలువైనదిగా మారింది. సమాజంలో గౌరవాన్ని ఇచ్చింది. 'యోగా ఎంతో ప్రాణహితమైనది. దీనిని ప్రచారం చేయాలని నిశ్చయించుకున్నాం' అంటారు పద్మిని జోగ్.

940 క్యాంపులు

2014 వరకూ భర్తతో కలిసి పద్మిని 561 క్యాంపులు నిర్వహించింది. 'నా భర్తకు హార్ట్ ఎటాక్ వచ్చింది. ఆయన ఆశ్చర్యపోయాడు. యోగా చేస్తుంటే గుండెపోటు ఎలా వచ్చిందని డాక్టర్‌ని అడిగారు. సమస్య 20 ఏళ్ల క్రితం మొదలై ఉంటుందని యోగాసనాల వల్ల ఫలితం పోస్ట్‌పోన్ అయి ఉంటుందని డాక్టర్ చెప్పారు. ఆ మరుసటి రోజు మావారు చనిపోయారు. నాకు కొంతకాలం ఏం చేయాలో పాలుపోలేదు. కాని పని ఆపకూడదు అనుకున్నాను' అంటారు పద్మిని.

'యోగ, ప్రాణాయామం మిమ్మల్ని శారీరకంగా, మానసికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా పాజిటివ్ ఎనర్జీతో ఉంచుతాయి. ఈ టీచర్ మాట వినండి. ఆచరించండి' అంటున్నారు పద్మిని.

వంటిల్లు

చలి గడ్డకట్టిస్తోంది.
దవడలు బిగుసుకుపోతున్నాయి.
పళ్లు కటకటలాడుతున్నాయి.
ఈ కాలంలో దేహానికి
వెచ్చదనాన్నిచ్చే ఆహారం తినాలి.
ఆ ఆహారం రుచిగానూ ఉండాలి.
గుజరాతీ మేథీ తెప్లా, యూపీ మీఠారోటీ,
తెలుగింటి మునగాకు సూప్,
ఆల్ ఇండియా చికెన్ షోర్బా... ఈ వారం ట్రై చేద్దాం.

చలిని తరిమేసే...

వేడి వేడి విందు

మీఠా రోటీ



కావలసినవి: **గోధుమ పిండి**– ఒకటిన్నర కప్పులు; **బెల్లం తురుము**– 8 టేబుల్ స్పూన్‌లు; **నువ్వులు** – టీ స్పూన్; **నెయ్యి** – 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● మందపాటి పెనంలో బెల్లం తురుము, కొద్దిగా నీరు పోసి సన్న మంట మీద గరిటెతో కలుపుతూ బెల్లం కరిగే వరకు వేడి చేసి దించేయాలి. ● చల్లారిన తరవాత గోధుమ పిండి, నువ్వులు, కొద్దిగా నెయ్యి వేసి తగినంత నీటిని వేస్తూ ముద్దగా చపాతీల పిండిగా కలపాలి. ● పది నిమిషాల తర్వాత పిండిని నాలుగు భాగాలు చేసి ఒక్కో భాగాన్ని చపాతీల పీట మీద వేసి కొంచెం మందంగా వత్తుకోవాలి. ● పెనం మీద నెయ్యి వేడి చేసి మీడియం మంట మీద రొట్టెలను రెండు వైపులా తిరగ వేస్తూ దోరగా కాలనివ్వాలి. కొద్దిగా నెయ్యి రాసి వేడిగా తినాలి.

మేథీ తెప్లా



కావలసినవి: **గోధుమ పిండి**– ఒకటిన్నర కప్పు ; **శనగ పిండి**– ముప్పావు కప్పు; మెంతి ఆకులు – కప్పు (తరగాలి); మిర్చి పొడి– టీ స్పూన్; ఉప్పు – పావు టీ స్పూన్ లేదా రుచికి తగినంత; నూనె – 3 టేబుల్ స్పూన్‌లు.

తయారీ: ● గోధుమ పిండి, శనగపిండిని జల్లించి అందులో మెంతి ఆకు తరుగు, ఉప్పు, మిర్చిపొడి వేసి సమంగా కలిపిన తరవాత నీటిని పోసి గట్టిగా ముద్ద చేయాలి. ● పిండి ముద్దను బాగా మర్దన చేసి పది నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ● పిండిని పెద్ద నిమ్మకాయ సైజులో తీసుకుని చపాతీలు చేసే రోలింగ్ పిన్‌తో పలుచగా వత్తి పెనం మీద వేసి రెండు వైపులా తిరగేస్తూ, మధ్యలో నూనె వేస్తూ కాల్చాలి. ●గుజరాతీ మేథీ తెప్లా రెడీ. ● పై పరిమాణంతో ఎనిమిది తెప్లాలు చేయవచ్చు.


మునగాకు సూప్



కావలసినవి: **మునగాకు** – 2 కప్పులు (కడిగిన తర్వాత తరగాలి); **తెల్ల ఉల్లిపాయ ముక్కలు** – పావు కప్పు; **అల్లం తురుము** – టేబుల్ స్పూన్; **వెల్లుల్లి తరుగు** – టేబుల్ స్పూన్; **టొమాటో ముక్కలు** – పావు కప్పు; **జీలకర్ర** – టీ స్పూన్; **పసుపు** – పావు టీ స్పూన్ ; **మిరియాల పొడి**– టీ స్పూన్; **నీరు** – 4 కప్పులు; **ఉప్పు**– రుచికి తగినంత; **నెయ్యి లేదా నూనె** – అర టీ స్పూన్.

తయారీ: ● పెనంలో నెయ్యి వేడి చేసి జీలకర్ర, వెల్లుల్లి, అల్లం వేసి సన్న మంట మీద వేయించాలి. ● ఉల్లిపాయ ముక్కలు వేసి మగ్గనివ్వాలి. ● ఇప్పుడు వరుసగా టొమాటో ముక్కలు, మునగాకు, పసుపు, ఉప్పు వేసి నీటిని పోసి కలిపి మూత పెట్టి ఉడకనివ్వాలి. ● ఉడికి నీరు సగం అయిన తరవాత స్టవ్ ఆపేసి వడపోయాలి. ● ఈ సూప్‌లో మిరియాల పొడి వేసుకుని తాగాలి.

చికెన్ షోర్బా సూప్



కావలసినవి: **చికెన్ బోన్స్**– 500 గ్రా ; **బోన్‌లెస్ చికెన్**– 100 గ్రా (చిన్నగా అర అంగుళం ముక్కలు చేయాలి); **వెల్లుల్లి రేకలు** – 10 (సన్నగా తరగాలి); **మైదా లేదా మెత్తని వరిపిండి** – టేబుల్ స్పూన్; **వెన్న** – టేబుల్ స్పూన్; **నూనె** – టేబుల్ స్పూన్; **జీలకర్ర** – అర టీ స్పూన్; **మిరియాల పొడి**– 2 టీ స్పూన్‌లు (రుచికి తగినంత); **ఉప్పు** – అర టీ స్పూన్ లేదా రుచికి తగినట్లు.

తయారీ: ● చికెన్ బోన్స్‌ను శుభ్రం చేసి మందపాటి పాత్రలో వేసి నాలుగు లేదా ఐదు కప్పుల నీటిని పోయాలి. ● అందులో వెల్లుల్లి తరుగు వేసి నీరు సగం అయ్యే వరకు మరిగించాలి. ● వేడి తగ్గిన తరవాత వడపోసి ఈ చికెన్ స్టాక్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. ● బాణలిలో వెన్న వేడి చేసి చికెన్ ముక్కలు వేసి సన్న మంట మీద ముక్కలు మెత్తబడే వరకు వేయించాలి. ● మరొక బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయాలి. ● అవి చిటపట వేగిన తరవాత పిండి వేసి కలిబెడుతూ పచ్చిదనం పోయే వరకు వేయించాలి. ● ఇప్పుడు ముందుగా సిద్ధం చేసుకున్న చికెన్ స్టాక్, వెన్నలో వేయించిన చికెన్ ముక్కలు, మిరియాల పొడి, ఉప్పు వేసి కలిపి, సన్నమంట మీద నాలుగు నిమిషాల ఉడికించాలి. ● ఈ చికెన్ షోర్బాను వేడిగా తీసుకోవాలి. ● గర్భిణిగా ఉన్నప్పుడు కొంతమందికి మసాలాతో వండిన కర్రీ సరిగ్గా జీర్ణం కాక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వాళ్లకు ఇది మంచి ఆహారం, త్వరగా జీర్ణమవుతుంది, పోషకాలు సమృద్ధిగా అందుతాయి.

ఇంటిప్స్



- లంచ్‌బాక్స్‌లోకి చేసే చపాతి, రోటీలు మెత్తగా ఉండాలంటే గోధుమ పిండిని పాలతో కలిపితే ఐదారు గంటలు మెత్తగా రుచిగా ఉంటాయి.
- బంగాళ దుంప ముక్కలను పదినిమిషాల పాటు మజ్జిగలో నానబెట్టి, తరువాత ఫ్రై చేస్తే ముక్కలు అతుక్కోకుండా పొడిపొడిగా వస్తాయి.
- డీప్ ఫ్రై చేసేటప్పుడు నూనె పొంగకుండా ఉండాలంటే... కాగిన నూనెలో ముందుగా కొద్ది చింతపండు వేయాలి. తరువాత డీప్ ఫ్రై చేసుకుంటే నూనె పొంగదు.


'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 258

శుక్రవారం 9-12-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


ఎన్నికల ఫలితాలు (ఓట్ల శాతం)	బీజేపీ	కాంగ్రెస్	ఆప్	ఇతరులు
గుజరాత్ మొత్తం 182 సీట్లు	156	17	5	4
	52.5%	27.3%	12.9%	4.34%
హిమాచల్‌ప్రదేశ్ మొత్తం 68 సీట్లు	25	40	0	3
	43%	43.9%	1.1%	10.4%



ఉద్ధవ్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుటుంబసభ్యులు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ముంబై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.

వివరాలు 10లో ▸



మిస్టర్ యూనివర్స్ రేసులో..

ఒడిశాలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచి.. మిస్టర్ యూనివర్స్‌కు సిద్ధమవుతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తనుబుద్ధి సాయిభరద్వాజరెడ్డిపై కథనం..

వివరాలు 12లో ▸

గుజరాత్‌లోనే కమలం గుభాళింపు

మోదీ మేజిక్

మోదీ మేజిక్‌కు హిందూత్వ కార్డు తోడైంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు ఆప్ భారీగా గండి కొట్టడం మరింతగా కలిసొచ్చింది. దాంతో గుజరాత్‌లో బీజేపీ దుమ్మురేపింది. ఆ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 156 స్థానాలను కైవసం చేసుకుని రికార్డు సృష్టించింది. కాంగ్రెస్ అత్యల్పంగా 17 సీట్లకు పరిమితమై ఘోర పరాభవం మూటగట్టుకుంది. ఆప్ కూడా ఐదు సీట్లతో చతికిలపడింది. గుజరాత్‌లో వరుసగా ఏడో విజయం ద్వారా పశ్చిమబెంగాల్లో గతంలో సీపీఎం నెలకొల్పిన రికార్డును బీజేపీ సమం చేసింది. ఇక హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రతి ఐదేళ్లకూ ప్రభుత్వాన్ని మార్చే ఆనవాయితీ ఈసారీ కొనసాగింది. అధికార బీజేపీ 25 సీట్లతో ఓటమి పాలు కాగా కాంగ్రెస్ 40 సీట్లతో స్పష్టమైన మెజారిటీ సాధించి ఊరట పొందింది. గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ, ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికలతో పాటు యూపీలోని మెయిన్‌పురి లోక్‌సభ స్థానం, పలు రాష్ట్రాల్లో ఆరు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు ఒకేసారి జరగగా వీటిలో బీజేపీ గెలిచింది ఒక్క గుజరాత్‌లోనే కావడం గమనార్హం.

182 సీట్లకు **156**
కొల్లగొట్టిన కమలం

వరుసగా ఏడోసారి నెగ్గి 'బెంగాల్' రికార్డు సమం

మోదీ మేనియాలో కొట్టుకుపోయిన కాంగ్రెస్, ఆప్

కాంగ్రెస్‌కు అత్యల్పంగా 17, ఆప్‌కు 5 సీట్లు

హిమాచల్‌లో హస్తం హవా

- 68 స్థానాలకు గాను 40 స్థానాల్లో విజయం.. బీజేపీకి 25 సీట్లు
- ఖాతా తెరవని ఆమ్ ఆద్మీ పార్టీ



థాంక్యూ గుజరాత్: ప్రధాని మోదీ

'బీజేపీ రికార్డు' కారణాలు మూడు

ప్రతి అడుగు పక్కాగా..

- మరిన్ని కథనాలు 6,10లో

తుపాన్‌పై అప్రమత్తంగా ఉండండి: సీఎం జగన్ 2లో



ఇంటింటా మనం

- సంక్షేమాభివృద్ధికి పార్టీ బలం తోడైతే గెలుపు సులువే.. వైఎస్సార్‌సీపీ నాయకులకు సీఎం జగన్ దిశానిర్దేశం
- 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున 15 వేల గ్రామాల్లో 5.20 లక్షల మంది గృహ సారథులు.. ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో ముగ్గురు కన్వీనర్లు.. వీరిలో ఒక మహిళ తప్పనిసరి
- ఈ నెల 20 నాటికి 45 వేల మంది కన్వీనర్లను నియమించాలి
- ఆ తర్వాత గృహ సారథుల నియామకం.. ప్రతి ఇంటికి, పార్టీకీ మధ్య అనుసంధానకర్తలుగా కన్వీనర్లు, గృహ సారథులు

2లో

క్లుప్తంగా...

బీసీ సభతో చంద్రబాబుకు బీపీ పెరిగింది

- బాబు హయాంలో బీసీలను కట్టుబానిసలను చేశారు
- వచ్చే ఎన్నికల్లోనూ సీఎం వైఎస్‌ జగన్‌ వెంటే బీసీలు
- గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ నిర్వహించిన జయహో బీసీ మహాసభను చూసి చంద్రబాబుకు బీపీ పెరుగుతోందని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ ఎద్దేవా చేశారు. ఉవ్వెత్తున తరలివచ్చిన 85 వేల మంది బీసీ ప్రజా ప్రతినిధులను ఒక్కచోట చూసి చంద్రబాబుకు వణుకు మొదలైందన్నారు. గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి జోగి రమేష్‌ మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు ఏనాడైనా వెనుకబడిన వర్గాల నుంచి ఇంత మంది ప్రజాప్రతినిధులను తయారు చేశారా అని ప్రశ్నించారు. పదవులన్నీ సొంత సామాజిక వర్గానికే కట్టబెట్టారని విమర్శించారు. సూట్‌ కేసులు, బ్రీఫ్‌ కేసులకు పదవులు అమ్ముకుని.. బలహీనవర్గాలను కట్టు బానిసలుగా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు దగ్గర అచ్చెన్నాయుడు, యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు బానిసలుగా మారిపోయారన్నారు. చంద్రబాబు బీసీలకు చేసిన మేలుపై చర్చకు రమ్మంటే పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అందించిన సంక్షేమాల జాబితా చదివితే చంద్రబాబు, ఆయన బానిసలు మూర్ఛతో కొట్టుకుంటారన్నారు. బీసీలంతా 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. 'చంద్రబాబుకు 175 స్థానాల్లో పోటీ చేసే దమ్ములేదు. దత్తపుత్రుడికి ఎక్కడ పోటీ చేయాలో స్పష్టత లేదు. వీళ్లా మమ్మల్ని ఓడించేది. టీడీపీకి 86 నియోజకవర్గాల్లో దిక్కేలేదు. ఆయన దుర్మార్గాలకు బీసీలు 2019లోనే బుద్ధి చెప్పారు. 2024లో కట్టకట్టి బంగాళాఖాతంలో విసిరేస్తారు' అని జోగి రమేష్‌ ధ్వజమెత్తారు.

'వారాహి'కి పసుపు రంగు వేసుకో

పవన్‌కు మాజీ మంత్రి పేర్ని నాని సూచన



సాక్షి, అమరావతి: పవన్‌ కళ్యాణ్‌ ప్రచార వాహనం 'వారాహి'కి తెలుపు, నలుపు, మరో ఇతర రంగు కాకుండా పసుపు రంగు వేసుకుంటే సరిపోతుందని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) వ్యంగ్యోక్తులు విసిరారు. ఆయన గురువారం సీఎం క్యాంపు కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ.. వారాహి వాహనానికి మిలటరీ వాహనాలకు మాత్రమే వేసే ఆలీవ్‌ గ్రీన్‌ రంగు వేశారని, ఇది చట్టవిరుద్ధమని చెప్పారు. ఆ వాహనాన్ని రిజిస్ట్రేషన్‌ కూడా చేయరన్నారు. లక్షల పుస్తకాలు చదివానని బీరాలు పలికే పవన్‌ ఇండియన్‌ మోటర్‌ వెహికల్‌ యాక్ట్‌ పుస్తకాన్ని చదివి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. సినిమాల్లో మిలటరీ డ్రస్‌ వేసుకుని, బోర్డర్‌లో పాకిస్థాన్‌ సైనికులను కాల్చి చంపినట్టు నటించవచ్చన్నారు. నిజజీవితంలో అలా ఉండదన్నది గుర్తుంచుకోవాలని హితవు పలికారు. డబ్బున్న ప్రతి ఒక్కరూ వ్యాన్లుకొని యుద్ధం చేస్తామంటే కుదరదన్నారు. పవన్‌ పూర్తిస్థాయి రాజకీయ నాయకుడు అయితే ఇవన్నీ తెలిసేవని, కాల్‌షీట్‌ పొలిటీషియన్‌ కావడంవల్లే చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టు మినహా ఏమీ తెలియవని అన్నారు. విశాఖలో ప్రధాని మోదీ పలకరించకపోతే ఈపాటికే చంద్రబాబుతో పవన్‌ జతకలిసే వాడన్నారు. ఎన్నికలకు ముందు ఎప్పుడైనా బాబుతో పవన్‌ జతకలవడం ఖాయమన్నారు. అందుకే వాహనానికి పసుపు రంగు వేస్తే డబ్బులు మిగులుతాయని చెప్పారు.

ఇంటింటా మనం

- గ్రామాల్లో 92 శాతం, పట్టణాల్లో 84 శాతం మందికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి
- ఈ సంతోషకర సమయంలో 175కు 175 స్థానాలు సాధించడమే మన లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల కన్వీనర్లకు సీఎం వైఎస్‌ జగన్‌ దిశానిర్దేశం



సీఎంతో సమావేశంలో పాల్గొన్న పార్టీ నేతలు

> బూత్‌ కమిటీ నుంచి బలమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలన్నదే మన లక్ష్యం. నెట్‌వర్క్‌ బలంగా ఉండడం వల్ల గెలుపు చాలా సులభం అవుతుంది. ప్రతి ఎమ్మెల్యేను గెలిపించాలన్నదే పరిశీలకుల లక్ష్యం కావాలి. 175కు 175 గెలవాలి. ఈ నెట్‌వర్క్‌ మొత్తాన్ని బలంగా పని చేయించాల్సిన బాధ్యత పార్టీ పరిశీలకులందరి మీదా ఉంటుంది. మనం ఎంత కష్టపడతామో అంత ఫలితం ఉంటుంది. మన ఎమ్మెల్యేలను గెలిపించుకుని వచ్చినప్పుడు కచ్చితంగా పార్టీ నుంచి మీకు తప్పక గుర్తింపు ఉంటుంది. ఇది మీకు అవకాశమే కాదు ఒక బాధ్యత కూడా. దేవుడి దయ వల్ల వాతావరణం చాలా బాగుంది. - సీఎం వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇదివరకెన్నడూ కనీవినీ ఎరుగని విధంగా అమలవుతున్న సంక్షేమాభివృద్ధి పథకాలకు పార్టీ బలం కూడా తోడైతే వచ్చే ఎన్నికల్లో మన గెలుపు మరింత సులువవుతుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతమవ్వడం కోసం ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున 15 వేల గ్రామాల్లో 5.20 లక్షల మందిని పార్టీ తరఫున గృహ సారథులుగా నియమిస్తామని తెలిపారు. వీరు బూత్‌ కమిటీలలో సభ్యులుగా ఉంటారన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి ముగ్గురు చొప్పున కన్వీనర్లను నియమిస్తున్నామని, ఇందులో ఒక అక్క లేదా చెల్లెమ్మ కూడా ఉంటుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గాల పరిశీలకులతో గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. క్షేత్ర స్థాయిలో గడప గడపకు పార్టీని మరింత బలంగా తీసుకెళ్లాల్సిన అంశాలపై చర్చించారు. ఒక స్పష్టమైన కార్యాచరణతో వారికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యేలు కింది స్థాయిలో ఇంటింటికీ.. నెలకు కనీసంగా 4 నుంచి 5 సచివాలయాల్లో తిరుగుతున్నారన్నారు. ఇదే సమయంలో మిగిలిన గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా చురుగ్గా పార్టీ కార్యక్రమాలు కొనసాగాలని సూచించారు. దీనికోసం 10–15 రోజుల్లో 1.66 కోట్ల కుటుంబాలను పార్టీ తరఫున కలుసుకునేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ఈ సమావేశంలో సీఎం వైఎస్‌ జగన్‌ ఇంకా ఏమన్నారంటే..

క్షేత్ర స్థాయిలో మన సైన్యాన్ని వ్యవస్థీకృతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాల్సిన అంశాలపై ఓరియంటేషన్‌ (పునశ్చరణ) కోసం మిమ్మల్ని అందర్నీ పిలిచాం. రీజనల్‌ కో ఆర్డినేటర్లు, జిల్లాల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ పరిశీలకులు సమన్వయంతో ఎలా పనిచేయాలన్నదానిపై ఒక ప్రణాళికను మీకు వివరిస్తా. క్షేత్ర స్థాయిలో మన పార్టీకి ఉన్న సైన్యాన్ని వ్యవస్థీకృతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. దీంతోపాటు రీజనల్‌ కో ఆర్డినేటర్లకు, పార్టీ అధ్యక్షులకు, నియోజకవర్గ పరిశీలకులకు విధివిధానాలు నిర్దేశిస్తున్నాం.
- గ్రామ లేదా వార్డు సచివాలయాల పరిధిలో పార్టీ తరఫున ముగ్గురు కన్వీనర్లు ఉంటారు. వీరిలో కనీసం ఒక మహిళ ఉంటారు. వీరందరూ స్థానికులై ఉండాలి. వీరు సంబంధిత గ్రామ లేదా వార్డు సచివాలయాల పరిధిలో పార్టీ కార్యక్రమాలను చూస్తారు. ఎమ్మెల్యేలు లేదా అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు.. రాజకీయ అవగాహన కలిగిన, చురుగ్గా ఉన్న వారిని ఈ నెల 20వ తేదీ నాటికి కన్వీనర్లుగా ఎంపిక చేయాలి. ఈ ప్రక్రియ అంతా సక్రమంగా జరిగేలా నియోజకవర్గాల పరిశీలకులు చూస్తారు.

ప్రతి 50 ఇళ్ల వారీగా మ్యాపింగ్‌

- కన్వీనర్ల ఎంపిక తర్వాత ప్రతి 50 ఇళ్ల క్లస్టర్‌కు ఒక పురుషుడు, ఒక మహిళ చొప్పున ఇద్దరు గృహ సారథుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం అవుతుంది. గృహ సారథులు కూడా అదే క్లస్టర్‌కు చెందిన వారై ఉండాలి. వీరు పార్టీ సందేశాన్ని చేర వేయడం, పార్టీ తయారు చేసిన పబ్లిసిటీ మెటీరియల్‌ను అందించడం తదితర కార్యక్రమాలు చూస్తారు. ఇందుకోసం ప్రతి 50 కుటుంబాల వారీగా మ్యాపింగ్‌ చేస్తున్నాం.
- మొత్తంగా 50 ఇళ్లకు ఇద్దరు చొప్పున 15 వేల గ్రామాల్లో 5.2 లక్షల మంది గృహ సారథులు.. గ్రామ, వార్డు సచివాలయాల్లో 45 వేల మంది కన్వీనర్లు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి పార్టీ సందేశాన్ని, పబ్లిసిటీ మెటీరియల్‌ని అందిస్తారు. 15 రోజుల వ్యవధిలో అన్ని కుటుంబాలను కలుసుకుంటారు. మొదటిసారి ఇలా తిరగడం వల్ల ఆ సచివాలయం పరిధిలో ఒక అవగాహన వస్తుంది. అన్ని సచివాలయాల పరిధిలో కూడా పార్టీ కార్యక్రమాలు చురుగ్గా కొనసాగడానికి ఇది ఉపయోగపడుతుంది.
- సచివాలయాల పరిధిలో పార్టీ కన్వీనర్లు, గృహ సారథుల పని తీరుపై నిరంతరం మదింపు ఉంటుంది. వీరందరికీ ఉచిత జీవిత బీమా ఉంటుంది. పార్టీ విస్తృత స్థాయి సమావేశాలకు వీరు ఆహ్వానితులుగా ఉంటారు.

మీ కష్టానికి తగిన గుర్తింపు ఖాయం

- మన ప్రభుత్వం వచ్చిన మూడున్నరేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో 92 శాతం కుటుంబాలకు, పట్టణ ప్రాంతాల్లో 84% కుటుంబాలకు మేలు జరిగింది. కార్పొరేషన్లలో 78 శాతం నుంచి 80%కుటుంబాలకు మేలు జరిగింది. ఇలాంటి మంచి వాతావరణంలో మనం అడుగులు ముందుకేస్తున్నాం.
- సాధారణంగా రాజకీయ నాయకులు ఊళ్లలో తిరగడానికి భయపడతారు. కానీ మొదటి సారి.. నాన్న (వైఎస్సార్‌) హయాంలో శాచ్యురేషన్‌ పద్ధతిలో పథకాలు ఇచ్చారు. మళ్లీ ఇప్పుడు అర్హత ఉన్నవారికి ఎవ్వరికీ నిరాకరించకుండా పథకాలు అమలుచేశాం. మూడున్నరేళ్లుగా ప్రతి కుటుంబానికీ మేలు జరిగింది. మన పార్టీ వల్ల మేలు జరిగిందన్న సంతోషం ఎమ్మెల్యేలకూ ఉంది. అందువల్లే ధైర్యంగా ఊళ్లలోకి వెళుతున్నారు. పార్టీలో ఎక్కడైనా చిన్నచిన్న బేధాలుంటే సరిదిద్దాల్సిన బాధ్యత రీజనల్‌ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల పరిశీలకులపై ఉంది.
- బటన్‌ నొక్కడమే కాదు (సంక్షేమ పథకాల లబ్ధిదారులకు డబ్బులు జమ చేయడం).. ఈ నెట్‌వర్క్‌ మొత్తం చాలా బలంగా పని చేయాలి. ఈనెల 20వ తేదీలోగా సచివాలయాల పరిధిలో కన్వీనర్ల నియామకం పూర్తయ్యేలా చూడటం ద్వారా ఈ కొత్త బాధ్యతలో తొలి అడుగు బలంగా వేయాలి. మీ కష్టానికి తగిన ఫలితం తప్పక ఉంటుంది.

ప్రభుత్వంపై బురదజల్లడమే పచ్చపత్రికల పని

- కళ్లు మూసుకుని అసత్య కథనాలు రాస్తున్నారు
- రైతులకు మద్దతు ధర దక్కుతుంటే ఓర్వలేక పచ్చ పత్రికల పిచ్చిరాతలు
- మీడియాతో మంత్రి కాకాణి, అగ్రిమిషన్‌ వైస్‌ చైర్మన్‌ నాగిరెడ్డి



నెల్లూరు (సెంట్రల్‌)/సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని రైతులకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే పచ్చపత్రికలు మాత్రం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అగ్రిమిషన్‌ వైస్‌ చైర్మన్‌ నాగిరెడ్డి మండిపడ్డారు. నెల్లూరులో గురువారం మంత్రి కాకాణి, తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నాగిరెడ్డి మీడియాతో మాట్లాడారు. వారేమన్నారంటే..

ధాన్యం సగటు ఉత్పత్తి గతంలో కంటే 13 లక్షల నుంచి 14 లక్షల మెట్రిక్‌ టన్నుల వరకు పెరిగిందని మంత్రి కాకాణి గుర్తుచేశారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుంటున్నారని.. ఎప్పుడైతే బయట మార్కెట్‌లో మద్దతు ధర లభించదో అప్పుడు రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కొనుగోలుకు ఎలాంటి లక్ష్యాలంటూ లేవని, రైతుల నుంచి ఎంత వచ్చినా కొనుగోలు చేస్తామన్నారు. కానీ, కొందరు ధాన్యం కొనడం లేదని అసత్య కథనాలు రాయడం సిగ్గుచేటన్నారు. ఇక నాబార్డు నుంచి రుణాలు పొంది సివిల్‌ సప్లైస్‌ కార్పొరేషన్‌ను పీకల్లోతు నష్టాల్లోకి నెట్టింది చంద్రబాబు కాదా?.. రైతులకు చెల్లించాల్సిన నాబార్డు రుణాలను చెల్లించకుండా పసుపు–కుంకుమ పేరుతో నిధులను దారిమళ్లించిన ఘనత చంద్రబాబుది కాదా? అని మంత్రి ప్రశ్నించారు. అప్పటికీ రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత రైతులకు చెల్లించారని గుర్తుచేశారు. కానీ, పచ్చపత్రికలు ఇవేమీ తెలుసుకోకుండా అడ్డగోలు వార్తలు రాస్తూ ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయని కాకాణి మండిపడ్డారు.

ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగింది : నాగిరెడ్డి



ఇక రాష్ట్రంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని అగ్రిమిషన్‌ వైస్‌ చైర్మన్‌ నాగిరెడ్డి అన్నారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో సరాసరి 153.95 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తయితే.. గత మూడేళ్లలోనే (ప్రస్తుత ఖరీఫ్‌ మినహా) 167.24 లక్షల టన్నుల దిగుబడి వచ్చిందన్నారు. పచ్చ పత్రికలకు అభివృద్ధి కనిపించట్లేదని ఆయన మండిపడ్డారు. అలాగే, సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కపైసా కూడా రైతు నష్టపోకూడదని రవాణా, హమాలీ, గోనె సంచుల ఖర్చులు సైతం అందిస్తుంటే ఎల్లో మీడియా ఓర్వలేకపోతోందన్నారు. ఈ తరుణంలో వాతావరణ పరిస్థితులను సాకుగా చూపించి రైతులను భయభ్రాంతులకు గురిచేసి దళారులకు ధాన్యం విక్రయించేలా పిచ్చిరాతలు రాస్తున్నారని నాగిరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇకపోతే.. సన్న బియ్యానికి మంచి రేటు ఉండటంతో రైతులు వాటిని బయట మార్కెట్‌లో విక్రయించుకుంటున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పీలేరు టీడీపీ మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి



శ్రీనాథ్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పుతున్న సీఎం వైఎస్‌ జగన్‌

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్‌రెడ్డి సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో గురువారం వైస్సార్‌సీపీలో చేరారు. శ్రీనాథ్‌రెడ్డితో పాటు పీలేరు నియోజకవర్గ టీడీపీ నేతలు జీవీ రాకేష్‌రెడ్డి, ఎం.వెంకటకృష్ణారెడ్డి, వి.ఉమాకాంత్‌రెడ్డి, బి.నరేందర్‌రెడ్డి, జి.నరేష్‌కుమార్‌రెడ్డి సీఎం క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మైనారిటీస్‌ కమిషన్‌ చైర్మన్‌ ఇక్బాల్‌ అహ్మద్‌ ఖాన్‌ పాల్గొన్నారు.

పెండింగ్‌ చిట్‌ఫండ్‌ కేసులను సమీక్షిస్తాం

- రిజిస్ట్రేషన్‌ శాఖ అధికారులకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్‌ భార్గవ ఆదేశం



సాక్షి, అమరావతి: చిట్‌ఫండ్‌ మోసాలు పెరుగుతున్నందున ఆయా సంస్థలకు అనుమతులు మంజూరు చేసే ముందు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్వోలను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి రజత్‌ భార్గవ ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న చిట్‌ఫండ్‌ కేసులను సమీక్షిస్తామని ఆయన చెప్పారు. రిజిస్ట్రేషన్స్‌ అండ్‌ స్టాంప్స్‌ విభాగంపై గురువారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్స్‌ శాఖ ఐజీ అండ్‌ కమిషనర్‌ వి.రామకృష్ణతోపాటు ఐజీలు, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు. రజత్‌ భార్గవ మాట్లాడుతూ చిట్‌ఫండ్‌ కంపెనీలకు అనుమతులు మంజూరు చేయడంలో మరింత జాగ్రత్త వహించాలని, ఈ వ్యాపారంలో మోసాలు పెరగడంతోపాటు నివేదికల్లోనూ అనేక లోపాలు వెలుగు చూస్తున్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను సమీక్షించాలని డీఆర్వోలను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, ఇందుకోసం రిజిస్ట్రార్లు ఇటీవల రీ సర్వే పూర్తయిన రెండు వేల గ్రామాల్లో పర్యటించి గ్రామసభలు నిర్వహించాలని చెప్పారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా అన్ని ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకువెళ్లాలన్న సంకల్పాన్ని రిజిస్ట్రేషన్‌ శాఖలోనూ అమలు చేయాలన్నారు. ఈ నెలాఖరులోపు కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, కర్నూలు, శ్రీకాకుళం వంటి ప్రాంతాల్లో అవినీతి రహిత సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని రిజిస్ట్రేషన్‌ కార్యాలయాలు నిర్దేశించిన నూరు శాతం లక్ష్యం మేరకు ఆదాయం సాధించాలని చెప్పారు.

రాష్ట్రానికి రెండు వందేభారత్‌ రైళ్లు

సాక్షి, అమరావతి: రైల్వే శాఖ రాష్ట్రానికి రెండు వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను కేటాయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వేకు కేంద్ర రైల్వే శాఖ నుంచి వర్తమానం అందింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో తొలి వందేభారత్‌ ఎక్స్‌ప్రెస్‌ను 2023 జనవరిలో సికింద్రాబాద్‌–విజయవాడ మధ్య నడపాలని నిర్ణయించారు. త్వరలోనే అధికారికంగా తేదీని ఖరారు చేస్తారు. గంటకు 165 కి.మీ. వేగంతో ప్రయాణించడంతోపాటు 1,129 సీటింగ్‌ సామర్థ్యం కలిగిన ఈ రైలును మొదట సికింద్రాబాద్‌ నుంచి కాజీపేట మీదుగా విజయవాడ వరకు నడుపుతారు. తరువాత విశాఖపట్నం వరకు పొడిగిస్తారు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రెండో వందే భారత్‌ ఎక్స్‌ప్రెస్‌ను సికింద్రాబాద్‌–తిరుపతి మధ్య నడపనున్నారు. ఈ రైలును సికింద్రాబాద్‌ నుంచి విజయవాడ మీదుగా తిరుపతి వరకు నడపాలని దక్షిణ మధ్య రైల్వేవర్గాలు భావిస్తున్నాయి. ఈ రైలు రూట్‌పై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

తుపానుపై అప్రమత్తంగా ఉండండి

- తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి – రైతులకు అవగాహన కల్పించండి
- కలెక్టర్లకు ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌ ఆదేశాలు
- సీఎం ఆదేశాలతో కలెక్టర్లతో సీఎస్‌ వీడియో కాన్ఫరెన్స్‌
- ముందు జాగ్రత్తగా రాష్ట్రానికి ఎన్డీఆర్‌ఎఫ్‌ బృందాలు
- జిల్లాల్లో కంట్రోల్‌ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో తుపాను దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వివిధ జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. తుపాను ప్రభావంపై ఎప్పటికప్పుడు సమీక్ష చేసుకుంటూ తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గురువారం ఉదయం ముఖ్యమంత్రి కార్యాలయం అధికారుల సమావేశంలో తుపాను పరిస్థితులపై సీఎం వైఎస్‌ జగన్‌ సమీక్షించారు. తుపాను ప్రభావంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి, చిత్తూరు తదితర జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు. దీంతో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కలిగించాలని, వారికి సహాయమందించాలని సీఎం ఆదేశించారు.

దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలు అప్రమత్తంగా ఉండాలి..

బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్‌ తుపాను పట్ల ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్‌ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి ముందు జాగ్రత్త చర్యలపై తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్‌ జిల్లాల కలెక్టర్లతో సీఎస్‌ వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం.. మాండూస్‌ తుపాను ఈ నెల 9 అర్ధరాత్రి పుదుచ్చేరి, మహాబలిపురం, శ్రీహరికోటల మధ్య తీరాన్ని తాకే అవకాశం ఉందని తెలిపారు. దీని ప్రభావంతో ఈనెల 10 వరకు రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చన్నారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రకాశం జిల్లాలో ఒకటి, నెల్లూరు జిల్లాలో 2, తిరుపతి జిల్లాలో 1, చిత్తూరు జిల్లాలో 1 చొప్పున మొత్తం 5 జాతీయ విపత్తు దళం (ఎన్డీఆర్‌ఎఫ్‌) బృందాలతోపాటు 4 ఎస్డీఆర్‌ఎఫ్‌ దళాలను కూడా మోహరించామన్నారు. భారీ వర్షాలతో ఎక్కడైనా రహదారులకు, సమాచార వ్యవస్థకు ఇబ్బందులు తలెత్తితే సత్వర చర్యలు తీసుకునేలా సర్వసన్నద్ధమై ఉండాలని ఆదేశించారు. ఆయా జిల్లాల్లో కంట్రోల్‌ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జాతీయ, రాష్ట్ర రహదార్లకు భూసేకరణపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రానికి కొత్తగా మంజూరైన విజయవాడ–కడప–బెంగళూరు, అనంతపురం–గుంటూరు, విశాఖపట్నం–భోగాపురం–రాయపూర్‌ ఆరు వరుసల జాతీయ రహదార్లు సహా ఇతర జాతీయ, రాష్ట్ర రహదారులకు భూసేకరణపై సీఎస్‌ జవహర్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా సమీక్షించారు. కొత్తగా మంజూరైన వివిధ జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణానికి త్వరితగతిన భూసేకరణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సంచాలకులు డా.బీఆర్‌ అంబేడ్కర్‌ పాల్గొన్నారు.

85వేల గళాల నినాదం... 'జయహో బీసీ'

- వార్డు స్థాయి నుంచి మంత్రుల వరకూ తరలి వచ్చిన బీసీ ప్రతినిధులు
- పదవులిచ్చిన సాధికారతతో సభలో నినదించిన నాయకులు
- రాజ్యాధికారం నుంచి బడ్జెట్‌ వరకూ సింహభాగం బీసీలకిస్తున్న సీఎం జగన్‌
- జగన్‌ చిత్తశుద్ధిని ప్రశంసిస్తూ... గత పాలకుల అహంపై మండిపడ్డ బీసీ నేతలు
- ఇదే ఊపులో తదుపరి ఎన్నికల్లోనూ 175 సీట్ల టార్గెట్‌ను సాధిస్తామంటూ నినాదాలు
- సభ గ్రాండ్‌ సక్సెస్‌ కావటంతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



సాక్షి, అమరావతి: రకరకాల పదవులు చేపట్టి రాజకీయ సాధికారతతో బీసీ ప్రతినిధులు భారీ ఎత్తున 'జయహో బీసీ' సభకు తరలి రావటం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. మహాసభ జరుగుతున్నంత సేపూ వారంతా "జయహో బీసీ... జయహో జగన్‌" అంటూ ఉరిమే ఉత్సాహంతో నినదించటంతో అంచనాలకు మించి మహాసభ సక్సెస్‌ అయినట్లు పార్టీ భావిస్తోంది. రాష్ట్ర మంత్రులు మొదలు.. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నామినేటెడ్‌ పదవుల్లో ఉన్న వారితో పాటు వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మండల వైస్‌ ప్రెసిడెంట్‌లు, ప్రెసిడెంట్‌లు, జడ్పీ చైర్మన్లు, వైస్‌ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, డీసీసీబీ, డీసీఎంఎస్‌ చైర్‌పర్సన్లు, వాటి డైరెక్టర్లు, మార్కెట్‌ కమిటీ చైర్మన్లు, వాటి డైరెక్టర్లు, పీఏసీఎస్‌ చైర్మన్లు వాటి మెంబర్లు, ఆలయ బోర్డు చైర్మన్లు... ఇలా దాదాపు 85 వేలకు పైగా బీసీ ప్రతినిధులు రాష్ట్రం నలుమూలల నుంచీ కదలిరావటమనేది గతంలో ఎన్నడూ జరగలేదని, ఒక్క వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వానికే ఇది సాధ్యమైందని విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిర్దేశిస్తున్నట్లు 175కు 175 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించడానికి ఈ సభను ఓ కొత్త ఆరంభంగా చూడాలనేది వారి భావన. గత ఎన్నికలకు ముందు... అంటే 2019, ఫిబ్రవరి 17న ఏలూరులో నిర్వహించిన బీసీ గర్జనలో తాము అధికారంలోకి వస్తే.. బీసీలకు చేసే మేలుపై బీసీ డిక్లరేషన్‌ను వైఎస్‌ జగన్‌ అప్పట్లో ప్రకటించారు. ఆ డిక్లరేషన్‌ను ఇపుడు తుచ తప్పకుండా అమలు చేస్తున్నారు. తొలి మంత్రివర్గంలో ఏడుగురు బీసీలకు స్థానం కల్పించి... పునర్‌వ్యవస్థీకరణ ద్వారా ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో ఏకంగా 11 మంది బీసీలకు అవకాశమిచ్చారు. కేబినెట్‌ నుంచి నామినేటెడ్‌ పదవుల వరకూ అన్నింటా బీసీలకే సింహభాగం పదవులిచ్చారు. టీడీపీ సర్కార్‌ ఐదేళ్లలో ఒక్క బీసీని రాజ్యసభకు పంపకపోతే.. మూడున్నరేళ్లుగా రాష్ట్ర కోటాలో 8 స్థానాలు ఖాళీ అయితే... అందులో వాటిలో నాలుగింటిని బీసీలకే ఇచ్చి... నలుగురిని రాజ్యసభకు పంపారు సీఎం వైఎస్‌ జగన్‌. సంక్షేమ పథకాల ద్వారా రూ.1.63 లక్షల కోట్లను బీసీలకు అందిస్తే.. అందులో కేవలం డీబీటీ రూపంలోనే రూ.86 వేల కోట్లను ఆ వర్గాల ఖాతాల్లో జమ చేశారు. వీటన్నిటి ఫలితం ఈ జయహో బీసీ సభలో కనిపించిందనేది పార్టీ వర్గాల మాట.

వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలా నిలిచిన బీసీలు..

తమను ఓట్లు వేసే యంత్రాలుగా వాడుకుని, అధికారంలోకి వచ్చాక తోకలు కత్తిరిస్తా, అంతుచూస్తానంటూ బెదిరించి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన హయాంనూ... రాజ్యాధికారంలో, బడ్జెట్‌లో తమకు సింహభాగం వాటా ఇచ్చి సమున్నత గౌరవం ఇస్తున్న సీఎం జగన్‌ పాలనను బీసీలు పోల్చి చూసుకుంటున్నారు. బుధవారంనాటి బీసీ నేతల ప్రసంగాలన్నిటా ఇది స్పష్టంగా కనిపించింది కూడా. దేశ చరిత్రలో బీసీ సీఎం కూడా ఇవ్వని రీతిలో.. తమకు సమున్నత గౌరవం ఇస్తూ, కాలరెగరేసుకుని సగర్వంగా తిరిగేలా పాలిస్తున్న సీఎం వైఎస్‌ జగన్‌కు వెన్నెముకలా నిలబడాలని వారంతా సభాముఖంగా నినదించారంటే ఈ పాలన ఫలితమేనని వేరే చెప్పాల్సినపనిలేదు కూడా. మళ్లీ వైఎస్‌ జగన్‌ను సీఎంగా చేసుకుంటేనే.. తాము మరింత పురోభివృద్ధి సాధించగలుగుతామని బీసీలు భావిస్తున్నారనేది రాజకీయ పరిశీలకుల విశ్లేషణ.

కదంతొక్కుతున్న శ్రేణులు:

అధికారంలోకి వచ్చాక తొలిసారి జులైలో నిర్వహించిన ప్లీనరీ గ్రాండ్‌సక్సెస్‌ అయ్యింది. మూడున్నరేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలను వివరిస్తూ గడపగడపకూ వెళ్తోన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలతో సుపరిపాలన అందిస్తున్న సీఎం జగన్‌కు జేజేలు పలుకుతుండటంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈక్రమంలో నిర్వహించిన జయహో బీసీ మహాసభ గ్రాండ్‌ సక్సెస్‌ కావడమనేది తదుపరి ఎన్నికలకు కావాల్సిన కదనోత్సాహాన్ని శ్రేణుల్లో నింపిందనే చెప్పాలి.

తీవ్ర తుపానుగా మాండూస్‌

సాక్షి, అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన మాండూస్‌ తుపాను మరింత బలపడి తీవ్ర తుపానుగా మారింది. ఇది ప్రస్తుతం తమిళనాడులోని కారైక్కాల్‌కు తూర్పు ఆగ్నేయంగా 350 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకి తూర్పు ఆగ్నేయంగా 440 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. పశ్చిమ వాయవ్య దిశగా పయనించి.. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి మధ్య మహాబలిపురం వద్ద శుక్రవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉంది. దీని వల్ల పుదుచ్చేరి, శ్రీహరికోట, దక్షిణ ఆంధ్రప్రదేశ్‌ తీరం వెంట 65 కిలోమీటర్ల నుంచి 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. తుపాను ప్రభావంతో శుక్ర, శనివారాల్లో ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణ కోస్తా, రాయలసీమ, పుదుచ్చేరి, తమిళనాడుల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం గురువారం తెలిపింది. నెల్లూరు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు పడతాయి. రాయలసీమలోని చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, వైఎస్సార్‌ జిల్లాల్లోనూ ఒకటి రెండు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి. మత్స్యకారులు ఈ నెల 10 వరకు సముద్రంలో వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్‌ సూచించారు. రాష్ట్రంలో తుపాను ప్రభావం చూపే ఆరు జిల్లాల్లోని 210 మండలాల్లో అధికారులను అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఏపీ అలర్ట్‌ ద్వారా ఇప్పటికే ఆరు జిల్లాల్లో హెచ్చరిక సందేశాలు పంపామన్నారు.

ఆ అమ్మాయి ఇక లేదు..

- రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కున్న విద్యార్థిని మృతి
- మెరుగైన చికిత్స కోసం సీఎం కార్యాలయం ఆదేశాలు
- ఇంతలోనే మృత్యు ఒడికి చేరిన శశికళ



అగనంపూడి/అక్కిరెడ్డిపాలెం (గాజువాక): విశాఖ నగరం దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైలు, ప్లాట్‌ఫామ్ మధ్య ఇరుక్కుని నరకయాతన అనుభవించిన విద్యార్థిని మెరపల శశికళ (22) మృత్యువుతో పోరాడి ఓడిపోయింది. రెస్క్యూ టీమ్ ఆమెను గటన్నరపాటు శ్రమించి సురక్షితంగా బయటకు తీసినా.. అంతర్గత గాయాల వల్ల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలోని గోపాలపట్నం గ్రామానికి చెందిన శశికళ దువ్వాడలోని విజ్ఞాన్ ఇజనీరింగ్ కళాశాలలో ఎంసీఏ ఫస్టియర్ చదువుతోంది. గ్రామం నుంచి శశికళతోపాటు మరో నలుగురు విద్యార్థులు రోజూ రైలులో కళాశాలకు వెళ్లి వస్తుండేవారు. బుధవారం కూడా శశికళతోపాటు ఆమె స్నేహితులు రాయగడ ఎక్స్‌ప్రెస్‌లో దువ్వాడ చేరుకున్నారు. స్టేషన్‌లో రైలు దిగే సమయంలో కాలు జారి ప్లాట్‌ఫామ్, రైలు బోగీ మధ్యలో శశికళ ఇరుక్కుపోయింది.

తీవ్ర రక్తస్రావం కావడంతో ఇన్ఫెక్షన్

శశికళకు నడుము భాగంలో రక్త ప్రసరణ పూర్తిగా నిలిచిపోగా.. శరీర అంతర్భాగాల్లో విపరీత రక్తస్రావం జరిగింది. నడుము ఎముక ముక్కలుగా విరిగిపోవడం, ఆ ఎముక ముక్కలు మూత్ర నాళానికి గుచ్చుకోవడంతో మూత్రం, రక్తం కలిసిపోయి ఇన్ఫెక్షన్ అయ్యి శశికళ మరణించిందని ఆమెకు వైద్యం చేసిన డాక్టర్ వేగు అవినాష్ చెప్పారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాధితురాలికి తక్షణ సహాయం అందించి ఆదుకోవాలని ఆదేశించారు. గురువారం ఉదయమే సీఎం కార్యాలయ సిబ్బంది ఆమె కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించడంతోపాటు తక్షణ సహాయం అందించేందుకు ముందుకు వచ్చింది. అయినా ఫలితం దక్కలేదు. మృత్యువుతో పోరాడిన శశికళ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తుది శ్వాస విడిచింది.

శోకసంద్రంలో తల్లిదండ్రులు..

శశికళ మరణవార్త కుటుంబ సభ్యుల్ని, తోటి విద్యార్థులను శోక సముద్రంలోకి నెట్టేసింది. ఆమె ఇక లేదన్న వార్త విని తండ్రి బాబూరావు, తల్లి రోదనలతో ఆస్పత్రి ప్రాంగణంలో విషాదం నెలకొంది. ఒక్కగానొక్క కూతురు కావడంతో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. విగత జీవిగా మారిన శశికళను చూసిన స్నేహితులు, విద్యార్థులు తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. దువ్వాడ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఆస్పత్రి వైద్యులతో సంప్రదింపుల అనంతరం శశికళ మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఆమె స్వగ్రామం కాకినాడ జిల్లా అన్నవరం సమీపంలో గోపాలపట్నం గ్రామానికి తరలించారు.

ఉన్నత చదువులు చదవాలని..

గతంలో టైలర్‌గా పనిచేసిన శశికళ తండ్రి బాబూరావు ప్రస్తుతం రేషన్ డిపో నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. శశికళ ఉన్నత చదువులు చదివి, మంచి ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాలని తపన పడేదని బంధువులు కన్నీటిపర్యంతమయ్యారు. కళాశాలలో చదువుతోపాటు ఏ కార్యక్రమం నిర్వహించినా చురుకైన పాత్ర పోషించేదని విద్యార్థులు, అధ్యాపకులు చెప్పారు.

సీఎస్‌ను కలిసిన అలీ



సీఎస్ డా.కెఎస్.జవహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు, సినీ నటుడు మహ్మద్ అలీ గురువారం సచివాలయం మొదటి బ్లాకులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారుగా అలీని నియమించిన విషయం విదితమే.

సీఎస్‌ను కలిసిన ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి

సాక్షి, అమరావతి: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన డా.కె.ఎస్.జవహర్ రెడ్డిని గురువారం సచివాలయంలో వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.తోలేటి జానకిరామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎస్ జవహర్ రెడ్డి వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఉపకులపతిని అడిగి తెలుసుకున్నారు.

మత్స్య వర్సిటీ కౌన్సెలింగ్ ఫలితాలు వెల్లడి

- తొలి కౌన్సిలింగ్‌లో 32 సీట్ల కేటాయింపు
- వచ్చే ఏడాది నర్సాపురంలో మత్స్య డిగ్రీ కళాశాల
- డిప్లొమా, పీజీ కోర్సులతో పాటు ఆర్ అండ్ డీ, ఇంక్యుబేషన్ సెంటర్లు ఏర్పాటు
- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీ మత్స్య విశ్వవిద్యాలయం తొలి కౌన్సెలింగ్ ఫలితాలను మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విడుదల చేశారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని మత్స్య కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ కోర్సులో 2022–23లో ప్రవేశానికి ఎంపికైన అభ్యర్థుల జాబితాను గురువారం సచివాలయంలో ఆయన మీడియాకు వెల్లడించారు. బీఎఫ్ఎస్సీ కోర్సులో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 40 సీట్లు ఉండగా.. ఏపీకి 29, తెలంగాణకు 11 సీట్లు చొప్పున భారత వ్యవసాయ పరిశోధన మండలి కేటాయించిందని చెప్పారు. ఏపీకి కేటాయించిన 29 సీట్లతో పాటు ఐసీఏఆర్(న్యూఢిల్లీ) కోటాలో 6 సీట్లు, ఈడబ్ల్యూఎస్ కోటాలో 3 సీట్లు అదనంగా లభించాయన్నారు. ఐసీఏఆర్ కోటాలో కేటాయించిన ఆరు సీట్లను ఆ సంస్థే భర్తీ చేస్తుందన్నారు. మిగిలిన 32 సీట్ల భర్తీ కోసం 535 మంది దరఖాస్తు చేశారన్నారు. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన 32 సీట్లను కేటాయించామని పేర్కొన్నారు. https://apfu&ugadmissions.-



ఫలితాలు విడుదల చేస్తున్న మంత్రి అప్పలరాజు.. చిత్రంలో అధికారులు

aptonline.in/APFU/ వెబ్‌సైట్ నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్స్ డౌన్‌లోడ్ చేసుకుని.. ఈనెల 13లోగా ఫీజులు చెల్లించి ప్రవేశం పొందాలని సూచించారు. మెరిట్ ఆధారంగా వీరిలో కొందరు ఇతర కోర్సులకు వెళ్లే అవకాశమున్నందున.. ఆ మేరకు ఖాళీ అయ్యే సీట్ల భర్తీ కోసం ఈ నెల 17 నుంచి రెండో విడత కౌన్సెలింగ్ జాబితా విడుదల చేస్తామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు ముత్తుకూరు కాలేజీలో వేర్వేరుగా హాస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు. ఎగుమతుల్లో దేశంలోనే మూడో స్థానంలో ఉన్న ఏపీ మత్స్య రంగానికి నైపుణ్యం కలిగిన వారి అవసరం ఉందన్నారు. ఇందుకోసం రూ.332 కోట్లతో దేశంలోనే మూడో మత్స్య వర్సిటీని నర్సాపురంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది నుంచి ఇదే ప్రాంగణంలో కొత్తగా డిగ్రీ కళాశాల ఏర్పాటవుతుందన్నారు. ఆ తర్వాత దశల వారీగా డిప్లొమా, పీజీ కోర్సులను.. ఇంక్యుబేషన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ వై.మధుసూదనరెడ్డి, వర్సిటీ అధికారులు డాక్టర్ ఓగిరాల సుధాకర్, డాక్టర్ టీవీ రమణ పాల్గొన్నారు.

ధనవంతులు, తమ దగ్గర డబ్బులు ఉన్నప్పటికీ, పనివాళ్లకు ఇవ్వాల్సిన చెల్లింపులను ఆలస్యం చేయడం తగదు. అది నేరం.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, డిసెంబర్, 9

గుజరాత్‌లో 'నరేంద్ర'జాలం

ఢిల్లీ స్థానిక ఎన్నికల ఫలితాలతో నిర్ఘాంతపోయిన బీజేపీకి గుజరాత్ ఓటర్లు గురువారం ఊహాతీతమైన విజయాన్ని అందించి సాంత్వనపరిచారు. అక్కడ వరసగా ఏడోసారి అధికారం అప్పగించటం మాత్రమే కాదు... ఆ పార్టీకి ఎన్నడూలేని స్థాయిలో సీట్లు కట్టబెట్టారు. 182 స్థానాలున్న అసెంబ్లీలో బీజేపీకి ఏకంగా 156, కాంగ్రెస్‌కు కేవలం 17, ఆప్‌కు 5 స్థానాలు లభించటం గమనించదగ్గది. ప్రధాని నరేంద్ర మోదీ సమ్మోహనశక్తి పనిచేయటంతోపాటు అధికార పక్షానికి గట్టి ప్రత్యామ్నాయం అందించగల శక్తి సామర్థ్యాలు విపక్షానికి కొరవడటం బీజేపీ అసాధారణ విజయానికి ఊతమిచ్చింది. మోదీ సీఎంగా ఉన్నప్పుడు సైతం అత్యధికంగా 127 స్థానాలు మాత్రమే గెలుచుకున్న చరిత్రగల బీజేపీ ఇప్పుడు భారీ మెజారిటీ సాధించటం మాటలు కాదు. హిమాచల్ ప్రదేశ్‌లో మాత్రం బీజేపీ బోర్లాపడక తప్పలేదు. ప్రతి అయిదేళ్లకూ అధికార పక్షాన్ని సాగనంపే సంప్రదాయాన్ని ఓటర్లు ఈసారి కూడా కొనసాగించటంతోపాటు అక్కడి సమస్యలపై పోరాడిన తీరు కాంగ్రెస్‌కు లాభించింది. అయితే రెండు పార్టీల ఓట్ల శాతం వ్యత్యాసం ఒక్క శాతంకన్నా తక్కువే. అక్కడి 68 స్థానాల్లో కాంగ్రెస్‌కు 40, అధికారం మెట్లు దిగుతున్న బీజేపీకి 25 రాబోతున్నాయి. ఢిల్లీలో దక్కిన విజయంతో సంతోషసంరంభాల్లో మునిగితేలుతున్న ఆమ్ ఆద్మీ పార్టీకి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలూ షాక్ అనే చెప్పాలి. ఆ పార్టీకి కొత్తగా జాతీయ పార్టీ హోదా రావటం మినహా సీట్లపరంగా పెద్దగా దక్కిందేమీ లేదు. హిమాచల్‌లో గట్టి సవాల్ ఇస్తుందనుకుంటే కనీసం ఖాతా కూడా ప్రారంభించలేకపోయింది. గుజరాత్ గురించి సాక్షాత్తూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ గొప్పలకు పోయినా ఎవరూ దాన్ని విశ్వసించలేదు. కానీ పొరుగునున్న పంజాబ్ మాదిరే హిమాచల్‌లో సైతం ఏదో ఇంద్రజాలం చేస్తుందని నమ్మినవారికి నిరాశే ఎదురైంది. ఆ పార్టీ చేసిన హడావుడికీ, వచ్చిన సీట్లకూ ఎక్కడా పొంతన లేకపోవటం గమనించదగ్గది.

అధికార పక్షం పనితీరుకన్నా ఇతరేతర అంశాలు ప్రాధాన్యం సంతరించుకోవటం ఈమధ్య కాలంలో దేశంలో అక్కడక్కడ కనబడుతోంది. ఇప్పుడు గుజరాత్‌లోనూ జరిగింది అదే. ఇది విపక్షాల వైఫల్యం తప్ప మరొకటి కాదు. కరోనా మహమ్మారి కాటేయడంతో ఆ రాష్ట్రంలో దాదాపు అన్నివర్గాల జనం ఆర్థిక ఒడిదుడుకులతో సతమతమవుతున్నారు. సంపన్నవంతులైన సూరత్‌లోని జౌళి మిల్లుల యజమానులు మొదలుకొని అంతంతమాత్రంగా నెట్టుకొచ్చే పొగాకు రైతుల వరకూ అందరికీ సమస్యలున్నాయి. రాష్ట్రంలో వృద్ధి రేటు అరకొరగా ఉండగా ద్రవ్యోల్బణం పట్టిపీడిస్తోంది. నిరుద్యోగ సమస్య సరేసరి. సాధారణ పరిస్థితుల్లో ఇవన్నీ అధికార పక్షానికి చుక్కలు చూపాలి. కానీ రాష్ట్ర ఓటర్లలో 52 శాతంమంది మళ్లీ బీజేపీనే కొనసాగించాలనుకున్నారంటే విపక్షమైన కాంగ్రెస్‌పై వారికున్న అవిశ్వాసం ఎంతటిదో అర్థమవుతుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 41 శాతం ఓట్లు తెచ్చుకున్న కాంగ్రెస్ ఈసారి 27 శాతానికి పడిపోయిందంటే అది ఆ పార్టీ పతనావస్థను పట్టి చూపుతుంది. క్రితంసారి ఎన్నికల్లో సౌరాష్ట్ర ప్రాంతాన్ని బీజేపీనుంచి చేజిక్కించుకున్న కాంగ్రెస్ తాజా ఎన్నికల్లో ఆప్ ఆగమనం వల్ల కావొచ్చు... ఓట్లు చీలి దాన్ని తిరిగి బీజేపీకే అప్పగించింది. ఆప్ కేవలం కాంగ్రెస్ ఓట్లను మాత్రమే కాదు... అంతో ఇంతో బీజేపీ ఓట్లను కూడా రాబట్టుకోగలిగింది. 2017 ఎన్నికల నాటికి పటీదార్ల ఉద్యమం గుజరాత్‌ను హోరెత్తించింది. అప్పట్లో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. తమకు రాయితీలు దక్కటం లేదని రైతాంగం ఆగ్రహంతో ఉంది. అలాంటి సమయంలోనే లాగలేకపోయిన కాంగ్రెస్ ఇప్పుడు ఏదో చేస్తుందని ఎవరూ అనుకోలేదు. జనం ఎదుర్కొంటున్న సమస్యలపై తానే ఉద్యమించి అందరినీ కూడగట్టి ఉంటే ఆ పార్టీకి అంతో ఇంతో లాభించేది. అలాంటి చొరవ తీసుకున్న నేతలే లేకపోవటం కాంగ్రెస్‌కు పెద్ద శాపం. అటు ప్రధాని నరేంద్ర మోదీ 31 ఎన్నికల ప్రచారసభల్లో పాల్గొంటే కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మినహా మిగిలిన బడానేతల జాడ అంతంతమాత్రం.

గడప దాటకుండా, సమస్యలపై ఉద్యమించకుండా విజయం తనంతతాను దరి చేరాలని ఏ విపక్షం భావించినా తెలివితక్కువతనం. ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఫలితాలు చూసినా, హిమాచల్‌లో కాంగ్రెస్ విజయం గమనించినా ఇదే రుజువవుతుంది. హిమాచల్‌లో బీజేపీ ప్రచారహోరు తక్కువేమీ లేదు. అది ప్రధాని మోదీ ఆకర్షణనూ, ప్రతిసారీ ఏకరువుపెట్టే 'డబుల్ ఇంజన్' ప్రభుత్వ వాదాన్నీ, ఉమ్మడి సివిల్ కోడ్‌నూ, జాతీయ భద్రతనూ ఎజెండాలోకి తెచ్చింది. అటు చూస్తే నిరుడు వీరభద్రసింగ్ మరణం తర్వాత కాంగ్రెస్‌కు చెప్పుకోదగ్గ నాయకుడు లేకుండాపోయారు. అయినా రాష్ట్రంలో నిరుద్యోగంపై, యాపిల్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ఎన్నో ఉద్యమాలు చేసింది. జనం సతమతమవుతున్న సమస్యల్ని తీసుకుని ఉద్యమాలు నిర్మిస్తే విజయం పెద్ద కష్టం కాదని నిరూపించింది. ఆ రకంగా చూస్తే హిమాచల్ ఎన్నికల ఫలితాలు విపక్షాలకు మాత్రమే కాదు, బీజేపీకి సైతం హెచ్చరిక లాంటివే. ఎన్నికల్లో గెలుపోటములు సహజమే. కానీ గెలిచిన పక్షం జనం ఎందుకు గెలిపించారో, వాగ్దానాల అమలుకు తాను చేయాల్సిందేమిటో గుర్తెరగాలి. ఓటమి పాలైన వారు తమవైపు ఎలాంటి లోపాలున్నాయో ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఓటమిని హుందాగా స్వీకరించటం నేర్చుకోవాలి. జనం అధికారం కట్టబెట్టనిచోట దాన్ని నయానో భయానో కొల్లగొట్టి పబ్బం గడుపుకుందామనే ఆలోచనలకు దూరంగా ఉండాలి. లేకుంటే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదు.

డేటా రక్షణకు ధోకా లేనట్లేనా?!

విశ్లేషణ



రాహుల్ మత్తన్

వ్యక్తిగత డిజిటల్ సమాచార పరిరక్షణ బిల్లు తాజా ముసాయిదాతో మళ్లీ ముందుకొచ్చింది. 2019లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ బిల్లుపై అనేక అభ్యంతరాలు వ్యక్తం అవడంతో అది ఆమోదానికి నోచుకోలేదు. ఈ క్రమంలో ఎనభైకి పైగా సవరణలు, పదికిపైగా కీలకమైన సూచనలలో కేంద్రం మరోసారి 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు–2022'ను సిద్ధం చేసి, ప్రజాభిప్రాయ సేకరణ కోసం విడుదల చేసింది. ఈ శీతాకాల సమావేశాలలోనే ప్రవేశపెట్ట దలచిన ఈ బిల్లుపై న్యాయ నిపుణులు అనుకూలంగా ఉన్నప్పటికీ, కొన్నింటిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశ సార్వభౌమాధికారం, శాంతిభద్రతలను పరిరక్షించేందుకు అవసరమైతే పౌరుల సమ్మతి లేకుండానే వ్యక్తిగత సమాచారాన్ని తీసుకోవచ్చన్న క్లాజుపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు' తాజా ముసాయిదాలో అనేక సానుకూల అంశాలు ఉన్నాయి. సరళమైన భాషను ఉపయోగించారు. మౌలిక సూత్రాలను దృష్టిలో ఉంచుకుని, చట్ట నియంత్రణలో ఉండే విధానాలకు రూపకల్పన చేశారు. అయితే, వ్యక్తిగత సమాచార పరిరక్షణ కోసం ఈ తాజా ముసాయిదాలో పేర్కొన్న కొన్ని అంశాలు లోపభూయిష్టంగా ఉండటం ఆందోళన కలిగించే విషయమే. మొత్తంగా చూస్తే ఈ ముసాయిదా బిల్లు దేశ ప్రజల సాంకేతిక భద్రతా చట్టాలను బలపరిచేదిగా నిలిచిపోతుంది.

గత నవంబర్ 18న కేంద్ర ప్రభుత్వం ఈ డిజిటల్ డేటా పరిరక్షణ బిల్లు ముసాయిదాను ప్రజాక్షేత్రంలోకి విడుదల చేసి, అందులోని బాగోగులను చర్చకు పెట్టింది. గత నాలుగేళ్లుగా ఏకాభిప్రాయానికి నోచుకోక, ఇక ఇది ఎప్పటికైనా బిల్లు రూపంలోకి వస్తుందా అనే సందేహాల నడుమ తాజా విడతగా బయటికి వచ్చిన ముసాయిదాను ప్రభుత్వం ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. డేటా ప్రొటెక్షన్ చట్టంపై దశాబ్దకాలంగా చక్రబంధంలో పరుగులు తీస్తున్న చిట్టెలుకలా పని చేస్తున్న నా వంటి వ్యక్తికి తొలిసారిగా ఈ తాజా ముసాయిదా సొరంగం చివర కనిపిస్తున్న కాంతి వంటి భావనను కలిగించింది.

తాజా ముసాయిదా ఎంతో సులభగ్రాహ్యంగా ఉంది. సాధ్యమైనంతగా విస్తృత స్థాయిలో ప్రతి ఒక్కరికీ బిల్లును అర్థం చేయించేందుకు ప్రయత్నం జరిగినట్లు అర్థమౌతోంది. ఇందులో పేర్కొన్న చట్ట నిబంధనలు ఎలా అన్వయమవుతాయో వివరించే ఉదాహరణలను తగినన్నిగా ఇవ్వడం భలే నచ్చింది. నిజానికి శాసన ముసాయిదాల రూపకల్పనలో ఇలా ఇవ్వడం అనేది ఒక మెళకువ. దురదృష్టవశాత్తూ ఆధునిక బిల్లు తయారీ సాధకులకు ఇది కొరుకుడు పడని విద్య. పౌరులతో ముడివడి ఉండే నియంత్రణలకు అధికారాన్నిచ్చే కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకురావడం కోసం ఉద్దేశించిన చట్టంలోని సరళత కచ్చితంగా తన స్థానాన్ని నిలబెట్టుకుంటుంది.

అయినప్పటికీ, ముసాయిదాలోని ఈ సరళతను నేను ఇష్టపడటం న్యాయవాదులలోని నా సోదరులు కొందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. న్యాయవాదులు ఎప్పుడూ కూడా తమ చట్టాలు సరళత్వాన్ని కలిగి ఉండటం కంటే కూడా, సవివరమైనవిగా ఉండటాన్నే ఎక్కువగా ఇష్టపడతారు. గతంలో నేను అనేకసార్లు చెప్పినట్లుగా... సాంకేతిక పరిజ్ఞానాన్ని నియంత్రించే బిల్లు తయారీ జరగడం ఇలాక్కాదు. చట్టంలో మనం ఎంత ఎక్కువగా వివరాలను కూరుతామో, సాంకేతిక పరిజ్ఞాన పురోగతిలోని కొత్త పరిణామాల వల్ల అది అంత ఎక్కువగా పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. అందుకు బదులుగా, సాంకేతికత నిర్దేశించే నిరంతర లక్ష్యాలకు అత్యంత ప్రభావవంతంగా ప్రతిస్పందించడానికి వీలు కల్పించే చురుకైన నియంత్రణ చట్టాలను



మాత్రం రూపొందిస్తే సరిపోతుంది.

ఇక ఈ ముసాయిదా చట్టంలోని ఇతర అంశాలలో కొన్నింటిపైన ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. చట్టంలోని అనేక ముఖ్యమైన నిబంధనల వర్తింపు నుంచి ప్రభుత్వం తనను తాను మినహాయించుకోవడం వాటిల్లో ఒకటి. అయితే ప్రపంచంలోని ప్రతి డేటా ప్రొటెక్షన్ చట్టంలోనూ ఈ రకమైన మినహాయింపు కనిపిస్తుంది. ఉదా: ఐరోపాలో అమలులో ఉన్న 'జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్' (జి.డి.పి.ఆర్.) చట్టం తన మేలిమి ప్రమాణాల రీత్యా తలమానికమైనదిగా గుర్తింపు పొందుతోంది. వారి చట్టంలో జాతీయ భద్రత, దేశ రక్షణ, పౌరుల సంక్షేమం రీత్యా క్రిమినల్ నేర విచారణ, రహస్య ఛేదన వంటి హక్కు దావాల నుంచి ప్రభుత్వానికి కొన్ని స్పష్టమైన మినహాయింపులను ఇస్తున్నాయి. సరిగ్గా మన తాజా ముసాయిదాలోని సెక్షన్ 18 (1) ప్రసాదిస్తున్న మినహాయింపులు కూడా అటువంటివే.

అయితే డేటా పరిరక్షణ చట్టంలోని కొన్ని నిబంధనల వర్తింపు నుండి ప్రభుత్వం మినహాయింపు తీసుకున్నంత మాత్రాన 2017 పుట్టస్వామి తీర్పును అనుసరించి తన రాజ్యాంగ బద్ధతలకు లేదా బాధ్యతలకు ప్రభుత్వం లోబడి ఉండబోదని అర్థం కాదు. బిల్లులోని నిర్దిష్ట మూలాంశం ఏమి చెప్పినప్పటికీ, ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యపై ఆ బద్ధతలు, బాధ్యతలు శిరస్సుపై ఖడ్గంలా వేలాడుతూనే ఉంటాయి. ప్రస్తుత బిల్లుకు జరుగుతూ వస్తున్న సవరణలతో పోల్చి చూసినప్పుడు తాజా ముసాయిదాలో పేర్కొన్న మినహాయింపులు నిరపాయకరమైనవేనని చెప్పాలి. చట్టానికి జరిగిన గత రెండు సవరణలు చట్టంలోని కొన్ని సెక్షన్‌ల వర్తింపు నుంచి ప్రభుత్వ యంత్రాంగాలకు మొత్తంగా మినహాయింపును ఇవ్వాలన్న ప్రతిపాదనలు కలిగి ఉన్నాయి. తాజా ముసాయిదా కొంత తులనాత్మకంగా జరిగింది.

దీనర్థం తాజా ముసాయిదాలో లోపాలు లేవని చెప్పడం కాదు. ఇందులో డేటా ప్రొటెక్షన్‌కు సంబంధించి ప్రభుత్వం తీసుకోవలసిన కొన్ని ప్రధానమైన పరిగణనలు లోపించాయి. నా ఉద్దేశంలో అవి ఏమిటంటే... మొదటిగా, డేటా పోర్టబిలిటీ హక్కు. దేశ జనాభాలోని వ్యక్తులకు సంబంధించిన సమస్త సమాచారాన్నీ ఒకచోట నిల్వ ఉంచుతున్న ఈ యుగంలో, అలా నిల్వ ఉంచిన సమాచారం నుంచి వివరాలను సంగ్రహించి, బట్వాడా చేసుకునే హక్కును వ్యక్తులకు ఈ బిల్లులో కల్పించలేదు. డేటా పోర్టబిలిటీ హక్కు ఉంటే కనుక వ్యక్తులకు తమకు అవసరమైన వివరాలపై ఆధీనతను ఇవ్వడమే కాకుండా, కొద్దిమంది చేతుల్లోనే డేటా పోగుపడే ఏకీకరణను నిరోధించే సమర్థమైన చర్యగా కూడా పోర్టబిలిటీ ఉపయోగపడుతుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న డేటా నియంత్రకులు పోర్టబిలిటీ హక్కును మరింత ప్రభావవంతంగా, అర్థవంతంగా చేయడానికి శ్రమిస్తున్నారు. భారతదేశమైతే తన శక్తిమంతమైన 'టెక్నో–లీగల్' డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలతో, డేటా పోర్టబిలిటీ ఎలా చేయాలో ప్రపంచానికి చూపించగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ముందైతే అటువంటి హక్కుకు చట్టంలో స్పష్టమైన నిర్వచనం ఉండాలి. నాకు కనుక మరొక సూచనకు అవకాశం ఉంటే దానిని నేను బిల్లులో వాడిన కొన్ని పదాలను అంతర్జాతీయ అనుసరణీయతలకు మరింత చేరువగా ఉండేలా నిబంధలను మార్పు చేయమని అడిగేందుకు ఉపయోగించుకుంటాను.

జస్టిస్ బి.ఎన్. శ్రీకృష్ణ డేటా సబ్జెక్టులను (గుర్తింపు వివరాలు కలిగి ఉన్న వ్యక్తులు) డేటా ప్రిన్సిపల్స్‌గా, డేటా కంట్రోలర్స్‌ని (వివరాలను నియంత్రించేవారు) డేటా విశ్వసనీయులుగా పునఃనామకరణ చేసినప్పటి నుంచీ... ఆ తర్వాతి వరస ముసాయిదాలు ప్రామాణికం కాని ప్రమాణాలను చట్టంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నించాయి. అందుకు ప్రస్తుత ముసాయిదా కూడా మినహాయింపేమీ కాదు. ప్రపంచంలోని మిగతా దేశాలు 'డేటా ప్రొటెక్షన్ అథారిటీ'గా పిలిచే శాఖను మన దగ్గర 'డేటా ప్రొటెక్షన్ బోర్డు'గా వ్యవహరిస్తున్నారు. ఇక గోప్యత చట్టాల్లో సమాచారాన్ని రాబట్టేందుకు ప్రభుత్వానికి వెసులుబాటు కల్పించే చట్టబద్ధమైన అవసరం, సహేతుకమైన ప్రయోజనం వంటి మాటలు తాజా చట్టంలోనూ ఉన్నాయి. దీనివల్ల వ్యక్తుల సమ్మతి లేకుండానే (డీమ్డ్ కన్సెంట్) వారికి సంబంధించిన వివరాలను ప్రభుత్వం, ప్రభుత్వ ఆమోదం పొందిన సంస్థలు పొందే వీలుంది. ఇది వ్యక్తిగత స్వయం ప్రతిపత్తిని మరింతగా దెబ్బతీస్తుందనే ఆందోళన ఉన్నందువల్ల దీనిపై పూర్తి స్థాయి చర్చ జరగవలసిన అవసరం ఉంది. డీమ్డ్ కన్సెంట్ అనే పేరులో ఏముంది అని మీరడగవచ్చు. ఏమీ లేదు. ఆశించిన ప్రయోజనాలను ఆ నిబంధన నెరవేర్చుతున్నంత కాలం పేరులో ఏమీ లేదనే చెబుతాను. కానీ పైపై మాటలతో కూడిన నిబంధనలు... ఇప్పుడు మనం చూస్తున్న విధంగా నిరసనల నిప్పు తుపానును రాజేస్తాయి. అయితే అది మనం నివారించగలిన తుపానే!

వ్యాసకర్త 'ట్రైలీగల్' సంస్థ భాగస్వామి

('ద హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నమో షో!



గుజరాత్‌లోని 86 శాతం సీట్లు ఇప్పుడు బీజేపీవి. అందులో 25 శాతానికి పైగా సీట్లలో 25 వేల కంటే అధికంగా మెజారిటీ వచ్చింది. మీరు నరేంద్ర మోదీకి ఎంత గట్టి విమర్శకులైనా కావొచ్చు. కానీ భారత రాజకీయ చిత్రంలో ఆయన సర్వాధిక్యతను ఎవరూ కాదనలేరు.

– భూపేంద్ర చౌబే, జర్నలిస్ట్

చీకటి పాలన



అఫ్గానిస్తాన్‌లోని ఫరాహ్ ప్రావిన్స్‌లో తొలి బహిరంగ మరణ దండనను తాలిబన్లు అమలుచేశారని తెలిసింది. ఇద్దరు పురుషులకు ఉరిశిక్ష, ఒక మహిళను రాళ్లతో కొట్టిచంపడాన్ని వీక్షించడానికి జనాన్ని ఆహ్వానించారు. 15 నెలల క్రితం తాలిబన్లు ఆక్రమించుకున్నప్పటి నుంచీ అఫ్గానిస్తాన్ చీకటి యుగంలోకి మళ్లింది.

– షబ్నమ్ నసీమీ, అఫ్గాన్ మాజీ అధికారి

అన్నింటికీ సంబరం



గుజరాత్‌ను బీజేపీ గెలుచు కుంది. హిమాచల్ ప్రదేశ్‌ను కాంగ్రెస్ గెలుచుకుంది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌ను ఆప్ గెలుచుకుంది. భారతీయ ఓటర్లు ప్రతి పార్టీకీ ఉత్సవం చేసుకోవడానికి ఒక కారణం ఇచ్చారు.

– రిషి బాగ్రీ, వ్యాఖ్యాత

నిజంగానా?



మోర్బీ బీజేపీకి ఓటు వేసింది. ఎందుకంటే ఆ విషాద ఘటనలో ఒక బీజేపీ నాయకుడు నదిలోకి దూకి బాధితులను కాపాడారట. ఇలా అని సృష్టించారు. దీంతో మొత్తం అర్థం చేసుకోవచ్చు.

– అమిత్ పాండీలియా, వ్యాఖ్యాత

తెలిసిన ఫలితమే



గుజరాత్‌లో ఈ ఫలితం వస్తుందని నాకుముందే తెలుసు. ఈవీఎంలను తొలగించి, బ్యాలట్ పేపర్లను తిరిగితేనంత వరకూ ఈ దేశ ప్రజలకు ఆశ లేదు.

– సుజాత ఆనందన్, జర్నలిస్ట్

భారత, చైనా మైత్రికి స్ఫూర్తి

భారత – చైనా దేశాల మధ్య స్నేహానికి స్ఫూర్తి డాక్టర్ ద్వారకానాథ్ శాంతారాం కోట్నిస్. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న ఈ కాలంలో ఆయన జీవితం నుండి స్ఫూర్తిని పొందాల్సిన అవసరం ఉంది. డాక్టర్ కోట్నిస్ 1910 అక్టోబరు 10న మహారాష్ట్రలోని షోలాపూర్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. భారతదేశంలో స్వాతంత్ర్య పోరాటం ఉధృతం అవుతుండగా, జపాన్ ఫాసిస్టుల దురాక్రమణకు చైనా గురైనకాలం అది. ఈ సమయంలో చైనాకు చెందిన జనరల్ ఛూటే తమ సైనికులకు వైద్యసహాయం అందించటానికి డాక్టర్లను పంపమని జవహర్‌లాల్ నెహ్రూను కోరారు. ఆ మేరకు 1938లో చైనాకు పంపబడిన 5 మంది డాక్టర్ల బృందంలో 27 ఏళ్ల డాక్టర్ కోట్నిస్ ఒకరు.

డా॥ కోట్నిస్, ఆయన బృందం గాయపడిన చైనా సైనికులకు రోజుకు 800 మందికి వైద్యసహాయం అందించేవారు. బృందంలోని డాక్టర్లు తిరిగి ఇండియాకు వచ్చినా కోట్నిస్ అక్కడే ఉండిపోయారు. 1941లో చైనాలోని నార్మన్ బెతూన్ అంతర్జాతీయ శాంతి హాస్పిటల్‌కు ఆయన డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1941 డిసెంబరులో ఆయన అక్కడే యుద్ధ రంగంలో పనిచేస్తున్న ఒక చైనా నర్సును వివాహమాడారు. వారికి కల్గిన కుమారునికి 'ఇన్ హువా' అని పేరు పెట్టారు. ఇన్ అంటే ఇండియా, హువా అంటే చైనా అని అర్థం. 1942లో ఆయన చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం కూడా తీసుకున్నారు. అవిశ్రాంతంగా పనిచేసిన కోట్నిస్‌కు అక్కడి అతిశీతల వాతావరణం వల్ల ఆరోగ్యం దెబ్బతింది. అందుకే తన కుమారుడు జన్మించిన కొద్ది నెలలకే 1942 డిసెంబరు 9న మూర్ఛవ్యాధితో మరణించారు. అప్పటికి ఆయన వయస్సు 32 సంవత్సరాలు మాత్రమే.



డాక్టర్ కోట్నిస్

ఆయన చనిపోయినపుడు "చైనా సైన్యం ఒక ఆపన్నహస్తాన్ని పోగొట్టుకుంది. చైనాదేశం ఒక స్నేహితుణ్ణి కోల్పోయింది. డా॥ కోట్నిస్ అంతర్జాతీయ స్ఫూర్తిని మనం ఎల్లప్పుడూ మన మనస్సులలో పదిలపరచుకోవాలి" అని చైనా విప్లవ నాయకుడు కామ్రేడ్ మావో యువ డాక్టరుకు ఘనంగా నివాళులర్పించారు.

చైనా కోట్నిస్ స్మృతికి గుర్తుగా చైనాలోని కొన్ని నగరాలలో వైద్యశాలలు, విగ్రహాలు, స్థూపాలు నిర్మించింది. చైనా నాయకులు ఇండియా పర్యటనకు వచ్చినప్పుడల్లా డా॥ కోట్నిస్ కుటుంబసభ్యులను తప్పనిసరిగా కలవటం ఒక ఆనవాయితీ.

ప్రస్తుతం ఇరుదేశాల మధ్యగల సరిహద్దు తగాదాను సామరస్యంగాను, ఇచ్చిపుచ్చుకునే ధోరణితోను పరిష్కరించుకోవాలి. భారత, చైనా దేశాల మైత్రికి సంకేతంగానూ, అంతర్జాతీయ సౌభ్రాతృత్వానికి ప్రతీకగానూ నిలిచిన డా॥ కోట్నిస్ ఉద్వేగభరిత జీవితం నుండి స్ఫూర్తిని పొంది భారత, చైనా మైత్రీ ఉద్యమాన్ని నిర్మించటం నేటి తక్షణ కర్తవ్యం.

– సి. భాస్కర్, యూసీసీఆర్ఐ (ఎమ్ఎల్)

(డాక్టర్ కోట్నిస్ 80వ వర్ధంతి సందర్భంగా)

రష్యా చమురు ధరపై పరిమితితో సంక్షోభం!

సందర్భం




బుడ్డిగ జమిందార్

ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాను నయానో, భయానో తమ దారిలోకి తెచ్చుకునేందుకు అమెరికా, దాని మిత్రదేశాలూ శత విధాలా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అందులో భాగంగానే కొత్తగా జీ7, ఆస్ట్రేలియా, యూరోపియన్ యూనియన్ దేశాలు... రష్యా ఎగుమతి చేసే ముడి చమురు ధరపై బ్యారెల్‌కు 60 డాలర్ల కనీస పరిమితి విధిస్తూ క్రితం వారం నిర్ణయం తీసుకున్నాయి. అయితే ఒపెక్ ప్లస్ (రష్యా) దేశాలు మాత్రం రానున్న నెలల్లో ముడిచమురు ఉత్పత్తిని రోజుకు 20 లక్షల బ్యారెల్స్ తగ్గిస్తామని వెల్లడించాయి. ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు మందకొండిగా ఉండటమే ఇందుకు కారణమంటున్నాయి. కాగా చమురు ఉత్పత్తిని పెంచమని అమెరికా అధ్యక్షుడు సౌదీ అరేబియాపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రపంచ చమురు ఎగుమతి చేసే దేశాల్లో 2వ స్థానంలో రష్యా ఉంది. చమురు ధరపై కనీస పరిమితి విధించి చమురు ఎగుమతి ద్వారా వచ్చే ఆదాయాలను నీరుగార్చి రష్యా ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి తీసుకెళ్లాలనేది ఈయూ దేశాల తపన. ఇది సఫలీకృతమైతే అమెరికా తన ఆధిపత్యం కొనసాగనీయ వచ్చనేది వ్యూహం.

రష్యా ముడిచమురు ధరపై పరిమితి విధించడాన్ని క్రెమ్లిన్ తీవ్రస్థాయిలో ఖండించింది. రష్యాపై ఆంక్షలు విధించినప్పుడల్లా ప్రపంచ దేశాలపై ముఖ్యంగా ఐరోపా దేశాలపై అవి తీవ్ర ప్రతికూల ప్రభావాల్ని కలుగ జేస్తున్నాయని రష్యా గుర్తుచేసింది. రష్యాపై ఆంక్షల నేపథ్యంలో ముడిచమురు ధరలు 2022 ఫిబ్రవరి నుండి పెరుగుతూ వస్తున్నాయి. దీనితో ఈ సంవత్సరం రష్యా అదనంగా 41 శాతం లాభాలను పెంచుకొని ఆంక్షలు విధించిన దేశాలకు, అమెరికాకు షాక్ ఇచ్చింది. రష్యాతో స్నేహంగా లేని దేశాలకు మొత్తం ముడిచమురు ఎగుమతులను ఆపేసి, ప్రత్యామ్నాయ మార్కెట్లుగా వేరే దేశాలను (భారత్, చైనాలు) ప్రోత్సహిస్తామని రష్యా అంటోంది.

మన విదేశాంగమంత్రి జైశంకర్ కూడా రష్యాపై ఆంక్షలకూ భారత్‌కూ సంబంధంలేదని స్పష్టం చేశారు. ఈ వారంలో జర్మనీ విదేశాంగమంత్రి అన్నాలేనా బేర్‌బాక్ న్యూఢిల్లీలో జైశంకర్‌ను కలిసి ఈయూ విధించిన పరిమితి ధరకు మద్దతునివ్వాలని అభ్యర్థించగా జైశంకర్ తోసిపుచ్చారు. యూరప్ ఇంధన అవసరాలకు అనుగుణంగా భారత్ ప్రాధాన్యతలను ఎంపిక చేసుకోజాలదని అన్నారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభం కాక ముందునుండే భారత్, రష్యాల మధ్య ముడిచమురు వాణిజ్యం ఉందని జైశంకర్ అన్నారు.

బ్యారెల్ ముడి చమురు ధర 60 డాలర్లకూ, అంతకన్నా తక్కువ బిల్లు చేస్తే... ప్రపంచ ఇన్సూరెన్స్ కంపెనీలు బీమా చేయడానికి ముందుకురావు. దీనితో రష్యా ముడిచమురు రవాణా స్తంభించి పోతుందని ఈయూ ఆలోచన.



ముడి చమురుపై పరిమితి విధించిన రెండురోజుల్లో బ్యారెల్ చమురు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 2 శాతం పెరిగింది. పరిశ్రమలకు అత్యంత అవసరమైన ఇంధన రవాణాను నిలిపివేస్తే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు చిన్నాభిన్నమైపోతాయి. ఇదివరలో యూరప్ దేశాలకు రష్యా ముడి చమురు చాలా ఎగుమతి జరిగేది. తాత్కాలికంగా కొంతమేర దిగుమతులు ఆపినప్పటికీ రష్యా ఇంధనాన్ని ఈయూ దేశాలు వేరే మూడవ దేశం ద్వారా దిగుమతి చేసుకొంటున్నాయి. లిథువేనియా 83 శాతం, ఫిన్లాండ్ 80 శాతం, స్లొవేకియా 74 శాతం, పోలాండ్ 58 శాతం, హంగేరి 43 శాతం, ఎస్తోనియా 34 శాతం, జర్మనీ 30 శాతం, గ్రీస్ 29 శాతం రష్యా నుండి దిగుమతి చేసుకుంటున్నాయి. మిగతా దేశాల దిగుమతి కూడా ఇంచుమించు 15 శాతం తగ్గకుండా ఉంది. ఇప్పుడు అకస్మాత్తుగా ధరల పరిమితి విధింపుతో రష్యాతోపాటుగా ఈయూ దేశాల ఆర్థిక వ్యవస్థలూ చాలా నష్టపోనున్నాయి. రానున్న వారాల్లో ముడి చమురు ధర అంతర్జాతీయంగా 100 డాలర్లు దాటుతుందని నిపుణుల అభిప్రాయం.

ఇదివరకటి 'విన్–విన్' వాణిజ్య పరిస్థితులు ఇప్పుడు 'లాస్–లాస్' పరిస్థితులుగా పరిణమించాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ధరలు తగ్గినప్పుడల్లా లాభాలను కార్పొరేట్లు అనుభవిస్తున్నారు. ధరలు పెరుగుతునప్పుడు నష్టాల భారాన్ని ప్రజలపై మోపటంతో ఆర్థిక వృద్ధిరేటు తగ్గుతూ వస్తోంది. ఫలితంగా ప్రతి దేశంలోనూ ద్రవ్యోల్బణం పెరుగుదలతోపాటు నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి. ఇందువల్ల జీవన ప్రమాణాలు తగ్గిపోతూ ఆర్థిక మాంద్యం వైపు దేశాలు కుంటుతున్నాయి. ఉక్రెయిన్–రష్యాల మధ్య జరుగుతున్న యుద్ధంలో మరణించిన సైనికుల కంటే... ఈ చలికాలం యూరప్‌లో ప్రజలు ఇంధన కొరతతో ఎన్నో రెట్లు చలిబారిన పడి చనిపోతారని అంచనా వేస్తున్నారు.

యుద్ధాన్ని నివారించక, శాంతి చర్చలు జరగనీయకుండా ఆయుధాలతో, ఆంక్షలతో యుద్ధం పరిసమాప్తమవుతుందని అనుకోవటం అవివేకం. ఇప్పటికే రష్యాపై ఆంక్షలతో యూరప్ ప్రజలు, పరోక్షంగా అభివృద్ధి చెందుతున్న దేశాలూ తీవ్రంగా నష్టపోతున్నాయి. అమెరికా మాత్రం లబ్ధిపొందుతోంది. 3 సంవత్సరాల క్రితం ఒపెక్ దేశాలు, రష్యా ఆర్థిక వ్యవస్థలను నష్ట పరచే విధంగా అమెరికా షేల్ చమురును ప్రవేశపెట్టడంతో బ్యారెల్ చమురు 28 డాలర్లకు పడిపోయిన సంగతి తెలిసిందే.

తాజాగా విధించిన ఈ కనీస 60 డాలర్ల పరిమితి వల్ల నష్టపోయేదీ ఈయూ దేశాలే. ప్రపంచ సాకర్ వేళ ఇది ఈయూ 'సెల్ఫ్ గోల్' కానుందా!


వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, కె. ఎల్. వర్సిటీ

మొబైల్ : 98494 91969

ఉడత భక్తి

శ్రీరాముడు లంకకు చేరేందుకు సముద్రం మీద వారధి నిర్మిస్తున్న సమయంలో ఓ ఉడత అక్కడికి వచ్చింది. 'గొబ్బున సేతువు కొనసాగ వలయు, – ఈ బల్లిదులకు తో(డు) ఏను కావింతు' అను కొంటూ, శ్రీరాముడి పాదపద్మాలను మనసులో నిలుపుకొని, నేరుగా సముద్రంలో మునిగి వచ్చింది. ఆ తడి శరీరంతో ఒడ్డున ఇసుకలో పొర్లింది. అప్పుడు తన శరీరానికి అంటిన ఇసుకను, కపులు నిర్మిస్తున్న కట్ట మీద రాళ్ళ సందులలో విదిల్చింది. పవిత్రమైన భక్తి భావంతో ఇలా చాలాసార్లు చేసింది. రాముడు ముచ్చటపడ్డాడు. ఆ ఉడత 'తానెంత అని మది తలపక ప్రేమ/పూని సహాయమై పొదలు చున్నది' అన్న విశేషం ఆయన్ని ఆకట్టుకొంది.

భక్తుడు స్వామికి సేవలందించేటప్పుడు, తన సేవ వల్ల స్వామికి ఏమి లాభం, ఎంత లాభం, స్వామి శక్తి ముందు తన శక్తి ఎంత అని లెక్కలు కట్టడు. (ఆ లెక్కలు స్వామి కూడా కట్టడు.) తన కున్న యావచ్ఛక్తితో – అది ఎంత అత్యల్పమైనా సరే – స్వామికి సేవ చేయాలని ఉడత ఆరాటం. తనకెంత ప్రతిఫలం వస్తుందన్న తాపత్రయం లేదు. భక్తి భరితమైన అంతఃకరణంతో, తనకు తట్టిన సేవ తన శక్తి మేరకు చేసి అది రాముడిని మెప్పించింది. ఉడతది నిష్కల్మషమైన, నిశ్చలమైన, శుద్ధమైన, ముగ్ధ భక్తి. భక్తిలో దానిని మించింది ఉంటుందా?



అందుకే రాముడు ఆ ఉడతను చేతిలోకి తీసుకొని, కృతజ్ఞతతో ఆప్యాయంగా నిమిరాడు. ఉడత వీపు మీద అమరిన రాముడి మూడు వేళ్ళ ముద్రలు చిరస్థాయిగా నిలిచిపోయాయి. భక్తులకు భక్తిని గురించిన ఒక ముఖ్య విశేషాన్ని అవి నేటికీ గుర్తుచేస్తుంటాయి. ఉడత భక్తి కథ తెలుగు గ్రామీణ మహిళలకు ప్రియమైన జానపద గీతాలలో వినిపిస్తుంది. రంగనాథ రామాయణంలో కనిపిస్తుంది. ఒక బృహత్కార్యానికి యథాశక్తి సహాయం చేసే సందర్భాలను సంస్కృతంలో 'చిక్రోడ సేతుబంధన న్యాయం'గా ప్రస్తావించటం కద్దు. చిక్రోడం అంటే ఉడత.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.పాడ్యమి ఉ.9.34 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: మృగశిర ప.1.54 వరకు, తదుపరి ఆరుద్ర, వర్జ్యం: రా.11.04 నుండి 12.51 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.34 నుండి 9.16 వరకు, తదుపరి ప.12.14 నుండి 12.56 వరకు, అమృతఘడియలు: తె.5.13 నుండి 6.57 వరకు (తెల్లవారితే శనివారం); రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు; సూర్యోదయం 6.22 : సూర్యాస్తమయం 5.22.

అల్లూరి జిల్లా లిట్టిగూడలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ





విజయనగరం జిల్లా ఎస్.కోట మండలం వెంకటరమణపేటలో వృద్ధురాలికి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



పశ్చిమగోదావరి జిల్లా తణుకులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు



అనంతపురం జిల్లా రాయదుర్గంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న విప్ కాపు రామచంద్రారెడ్డి




శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గాదెలదిన్నెలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

66 డిప్యూటీ కలెక్టర్ పోస్టులపై కీలక భేటీ

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన 66 డిప్యూటీ కలెక్టర్ పోస్టులపై భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. 198 మంది తహసీల్దారుల జాబితా నుంచి 66 మందిని ఎంపిక చేసే డీపీసీ సమావేశాన్ని సీసీఎల్ఏ సాయిప్రసాద్ నిర్వహించారు. జాబితా కొలిక్కి రాగా, శుక్రవారం వెల్లడించే అవకాశముంది.

విశాఖ వేదికగా జీ-20 సదస్సు

- ఫిబ్రవరి 3, 4 తేదీలతో పాటు ఏప్రిల్ 24న నిర్వహణకు ఏర్పాట్లు
- ఆర్థిక రంగం, వ్యవసాయం, పర్యావరణం, విద్య, వైద్యం అంశాలపై చర్చ
- 15 కమిటీల ద్వారా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు



సాక్షి, విశాఖపట్నం: ప్రతిష్టాత్మక జీ–20 సదస్సుకు విశాఖపట్నం వేదిక కానుంది. జీ–20 అధ్యక్ష దేశంగా భారత్ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో.. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది నవంబర్ వరకు సదస్సులు, వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశంలోని 56 నగరాలు, పట్టణాల్లో వివిధ అంశాలకు సంబంధించి 200 సదస్సులు నిర్వహించబోతోంది. ఏపీ నుంచి విశాఖపట్నాన్ని కేంద్రం ఎంపిక చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 3, 4 తేదీల్లో, ఏప్రిల్ 24న విశాఖ వేదికగా వివిధ అంశాలపై సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇప్పటికే రాష్ట్రంలో నిర్వహించే జీ–20 సదస్సుకు నోడల్ అధికారిగా ప్రొటోకాల్ డైరెక్టర్ ఎం.బాలసుబ్రహ్మణ్యంరెడ్డిని, సెక్యూరిటీ నోడల్ అధికారిగా డీజీపీని నియమించారు. విశాఖలో సదస్సు జరిగే మూడు రోజుల్లో ఆర్థిక రంగం, వ్యవసాయం, పర్యావరణం, విద్య, వైద్యం తదితర అంశాలపై 37 సమావేశాలు జరుగుతాయని జిల్లా అధికారులు చెప్పారు. వేలాది మంది ప్రతినిధులు హాజరవుతారని.. వివిధ దేశాల ఆర్థిక మంత్రులు, విదేశాంగ మంత్రులు, సెంట్రల్ బ్యాంక్ గవర్నర్లు పాల్గొంటారని పేర్కొన్నారు. తదనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసేందుకు ఇప్పటికే కలెక్టర్ డా.మల్లికార్జున, జేసీ విశ్వనాథన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి.. జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేస్తున్నారు. సదస్సు నిర్వహణకు మొత్తం 15 కమిటీలను ఏర్పాటు చేసి.. జేసీ విశ్వనాథన్‌ను నోడల్ అధికారిగా నియమించారు. అతిథుల కోసం నగరంలోని స్టార్ హోటళ్లలో 703 గదులను రిజర్వ్ చేసేందుకు చర్యలు చేపట్టారు. అతిథులు పర్యాటక ప్రాంతాలను కూడా సందర్శించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎయిమ్స్‌లోనూ ఇక ఆరోగ్యశ్రీ సేవలు

- పేదలకు ఉచితంగా మరింత నాణ్యమైన వైద్యం
- 24 గంటలూ ఆరోగ్యశ్రీ సేవలు అందేలా చర్యలు
- అవగాహన ఒప్పందం చేసుకున్న ప్రభుత్వం
- అతి త్వరలో పెట్ సిటీ స్కాన్ ప్రారంభం
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రజిని వెల్లడి



ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠికి ఒప్పంద పత్రం అందిస్తున్న మంత్రి రజిని

సాక్షి, అమరావతి: పేదలందరికీ ఇకపై ఎయిమ్స్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలందనున్నాయి. ఈ మేరకు గురువారం మంగళగిరిలోని ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఎయిమ్స్‌తో ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ.. పేదలకు ఉచితంగా మరింత నాణ్యమైన వైద్యం అందించాలనే సీఎం జగన్ ఆలోచనల మేరకు ఎయిమ్స్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు చెప్పారు. కొన్ని రోజులుగా ఎయిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 100 మందికి పైగా రోగులకు ఎయిమ్స్‌లో ఉచితంగా ఆరోగ్యశ్రీ సేవలు అందించామన్నారు. 30 మందికి పైగా రోగులకు చికిత్సలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ట్రయల్ రన్ పూర్తవ్వడంతో అధికారికంగా అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నారు. 24 గంటలూ ఆరోగ్యశ్రీ సేవలందేలా చర్యలు తీసుకున్నామన్నారు.

క్యాన్సర్‌కు నాణ్యమైన వైద్యం

అతి త్వరలో ఎయిమ్స్‌లో పెట్ సిటీ స్కాన్ అందుబాటులోకి రానుందని మంత్రి విడదల రజిని చెప్పారు. శరీరంలో ఎక్కడ క్యాన్సర్ అవశేషాలున్నా సరే.. ఈ స్కాన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. క్యాన్సర్‌కు అంతర్జాతీయ స్థాయి వైద్యం ఏపీలోనే అందించాలనే సీఎం జగన్ ఆలోచనకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎయిమ్స్‌కు ప్రస్తుతం రోజుకు ఆరు లక్షల లీటర్ల నీటిని అందిస్తున్నామన్నారు. వచ్చే జూన్ కల్లా పైపులైను పనులు పూర్తవుతాయని చెప్పారు. ఎయిమ్స్ నుంచి రోగులను మంగళగిరికి చేర్చేందుకు ఉచిత వాహన సౌకర్యం కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ త్రిపాఠి, ఎయిమ్స్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ వంశీకృష్ణ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, కార్యదర్శి నవీన్‌కుమార్, కమిషనర్ నివాస్, ఆరోగ్యశ్రీ సీఈవో హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా సాధ్యం కాదు

- బీజేపీ నేత దగ్గుబాటి పురందేశ్వరి



ఒంగోలు/ఒంగోలు టౌన్: ప్రత్యేక హోదా సాధ్యం కాదని నీతి ఆయోగ్ ఇప్పటికే స్పష్టం చేసిందని బీజేపీ కేంద్ర మహిళా మోర్చా నేత దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. గురువారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధ్యంకాదని తెలిసినందునే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆనాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వద్ద ప్రత్యేక ప్యాకేజీకి అంగీకరించారని, నేడు మళ్లీ ప్రత్యేక హోదా అనడం ఎంతవరకు సమంజసమో ప్రజలే ఆలోచించాలన్నారు. పవన్ కళ్యాణ్‌తో పాటు కలిసి యాత్ర చేపట్టాలా లేక విడిగా చేపట్టాలా అనే అంశంపై ఇంకా చర్చించలేదని, త్వరలోనే చర్చించి తుది నిర్ణయాన్ని ప్రకటిస్తామని పురందేశ్వరి తెలిపారు.

టీడీపీపై ప్రజలకు నమ్మకం లేదు

రాష్ట్ర ప్రజలకు టీడీపీ నాయకత్వం మీద, లోకేశ్‌పైన నమ్మకం లేదని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రకాశం జిల్లా బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఆమె.. జనం కోసం బీజేపీ కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. మండల, బూత్ కమిటీల నిర్మాణం పట్ల నాయకులు, కార్యకర్తలు శ్రద్ధ చూపాలన్నారు. ప్రతి ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు.

జగన్ ఒక అమూల్ బేబీ

- ప్రతిపక్ష నేత చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: జగన్ ఒక అమూల్ బేబీ అని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఎద్దేవా చేశారు. రైతులు పెట్టుకున్న సంగం డెయిరీని వద్దని.. గుజరాత్‌కి చెందిన అమూల్ కావాలంటున్న అమూల్ బేబీ జగన్‌ను బంగాళాఖాతంలో కలిపేస్తామన్నారు. 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమంలో భాగంగా ఆయన గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో గురువారం పర్యటించారు. సైకో పాలన వద్దు.. సైకిల్ పాలన కావాలి అనే నినాదంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. జగన్ పాలనలో ఏ కుటుంబం సంతోషంగా లేదన్నారు. నారాకోడూరు, చేబ్రోలు, పొన్నూరుల్లో జరిగిన సభల్లో చంద్రబాబు మాట్లాడారు. ఎ–2 విజయసాయిరెడ్డి, సకల శాఖల మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి, బాబాయ్ వైవీ సుబ్బారెడ్డి, పెద్దిరెడ్డిలకు రాష్ట్రాన్ని రాసిచ్చి పెత్తందారీ వ్యవస్థకు జగన్ శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. 1,650 బస్సులు పెట్టి బీసీ సభకు జనాన్ని బలవంతంగా తరలిస్తారా? రాకపోతే పెన్షన్ కట్, రేషన్ కట్, సంక్షేమ పథకాలు కట్ అని బెదిరిస్తారా? వైఎస్సార్‌సీపీకి పవర్ కట్ కావడం తథ్యం అని విమర్శించారు. సభకు వచ్చిన జనాన్ని చూసి జగన్‌కు రాత్రికి నిద్ర పట్టదన్నారు.

న్యాయం చేస్తాం..

వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు అన్యాయం జరిగిందని చంద్రబాబు విమర్శించారు. తన ప్రభుత్వం వచ్చాక వారికి వడ్డీతో సహా న్యాయం చేస్తామన్నారు. 'ఏ పథకాలు రాకపోయినా మీకు కోపం రాదు.. మీరు అడగరు.. ఎమ్మెల్యేలను నిలదీయరు' అంటూ సభకు వచ్చిన వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఏ2ను రాజ్యసభలో వైస్ చైర్మన్ ప్యానల్‌లోకి తీసుకొని లిక్కర్ స్కాం బయటపడటంతో తొలగించారన్నారు. అక్కడ లిక్కర్ స్కామ్ బయట పడితే ఇక్కడ ఆయన ఫోన్ పోయిందని ఎద్దేవా చేశారు. 'నీ చెల్లికి అన్యాయం జరిగితే ప్రధానమంత్రి ఫోన్ చేసి పరామర్శించినా నీవు స్పందించలేదు. నీకు చెల్లి లేదు, తల్లి లేదు, బాబాయి లేడు, నీకు ఈ జనాలు ఒక లెక్కా' అని నిలదీశారు. కాగా చంద్రబాబు సమక్షంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చింపేశారు. పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ నాయకులపై తెలుగుదేశం పార్టీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడ్డారు.

స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేసుల్లో రికార్డు ఉత్పత్తి



ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు చెందిన రెండు బ్లాస్ట్‌ఫర్నేసులు బుధవారం రికార్డు ఉత్పత్తిని సాధించాయి. ఉద్యోగుల సమష్టి కృషి వల్ల మూడు షిఫ్ట్‌ల్లో గోదావరి, కృష్ణా బ్లాస్ట్‌ఫర్నేస్‌లు 15,700 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తిని సాధించడం ద్వారా మరో రికార్డు సాధించాయి. రెండు బ్లాస్ట్‌ఫర్నేసులు ప్రారంభించిన నాటి నుంచి ఇదే అత్యధిక ఉత్పత్తి కావడం విశేషం. ఇంతకు ముందు రెండు ఫర్నేస్‌లు కలిపి అత్యధికంగా ఈ ఏడాది ఫిబ్రవరి 20న 15,440 టన్నులు ఉత్పత్తి సాధించాయి. ఈ సందర్భంగా బ్లాస్ట్‌ఫర్నేస్ ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

'క్యూఆర్ కోడ్' మార్చేసి వ్యాపారికి టోకరా



గుర్తు తెలియని వ్యక్తి అంటించిన క్యూ ఆర్ కోడ్ పేపర్

కొమరోలు: క్యూఆర్ కోడ్ పేపర్‌ను మార్చేసి చికెన్ వ్యాపారికి టోకరా వేసిన ఘటన ప్రకాశం జిల్లా కొమరోలులో చోటు చేసుకుంది. కొమరోలులోని పోస్టాఫీసు ఎదురుగా రమణయ్య అనే వ్యక్తి మహాలక్ష్మి చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం షాపు వద్ద ఫోన్‌పే క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేశాడు. చికెన్ కొనుగోలు చేసినవారు.. ఆ క్యూఆర్ కోడ్ ద్వారా నగదు చెల్లించేవారు. అయితే కొన్నిరోజులుగా బ్యాంక్ ఖాతాకు నగదు జమ కాకపోతుండటంతో క్యూఆర్ కోడ్‌ను పరిశీలించిన రమణయ్య ఖంగుతిన్నాడు. గుర్తు తెలియని వ్యక్తి క్యూఆర్ కోడ్ పేపర్‌ను మార్చేసి తనను మోసం చేస్తున్నట్లు గుర్తించాడు. రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని.. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని రమణయ్య చెప్పాడు.

వైభవంగా పెద్ద దర్గా ఉరుసు

- రాష్ట్ర ప్రభుత్వం తరపున దర్గాలో చాదర్ సమర్పణ




ప్రభుత్వం తరఫున చాదర్ తీసుకెళుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, కలెక్టర్ విజయరామరాజు

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ పుణ్యక్షేత్రం కడప అమీన్‌పీర్ దర్గాలో ఉరుసు ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు గురువారం కార్యక్రమాల్లో భాగంగా ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కలెక్టర్ విజయరామరాజు, జేసీలు, ఇతర అధికారులు రాష్ట్ర ప్రభుత్వం తరపున జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చాదర్ సమర్పించారు. తొలుత దర్గా ప్రతినిధులు అతిథులకు సంప్రదాయబద్ధంగా పేటా చుట్టి దర్గాకు ఆహ్వానించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్ సమర్పించారు.

అన్నవరంలో అన్నప్రసాదం విస్తరాకుల్లోనే వడ్డించాలి

- శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సూచన



సింహాచలం : కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో భక్తులకు అన్నప్రసాద వితరణ ప్లేట్లలో వద్దని, విస్తరాకుల్లోనే కొనసాగించాలని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి సూచించారు. దేవస్థానంలో గురువారం నుంచి అన్నప్రసాద వితరణకు విస్తరాకులకు బదులు ప్లేట్లను వినియోగిస్తుండటంపై స్వరూపానందేంద్ర సరస్వతి స్పందించారు. అన్నప్రసాదాన్ని ప్లేట్లలో అందించడం క్షేత్ర సంప్రదాయం కాదని ఒక ప్రకటనలో తెలిపారు. అన్నప్రసాద వితరణకు విస్తరాకులు లేదా అరిటాకులు వినియోగించడం సంప్రదాయమని గుర్తుచేశారు.

విచ్చలవిడిగా యాంటీబయోటిక్స్ వాడకాన్ని అరికడదాం

వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు



సాక్షి, అమరావతి: యాంటీ బయోటిక్స్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్, యాంటీ పేరసైటిక్స్ మందులను విచక్షణారహితంగా వాడడం వల్ల మనుషులు, జంతువుల్లో యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) పెరుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టీ కృష్ణబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎంఆర్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు విజయవాడ డిక్లరేషన్ ప్రతిజ్ఞ దోహదపడుతుందని పేర్కొన్నారు. విచ్చలవిడిగా యాంటీ బయోటిక్స్ వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ నేను సైతం నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగంలో విచ్చలవిడిగా క్రిమిసంహారక మందుల వాడకంతో ఆహారోత్పత్తులు కలుషితం అవుతున్నాయన్నారు. ఈ ఆహారాన్ని తింటున్న మనుషులు, జంతువులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. విజయవాడ డిక్లరేషన్ ద్వారా సమగ్ర ఆరోగ్య ప్రణాళిక (వన్ హెల్త్)కు రూపకల్పన చేసినట్లు వివరించారు. అవసరానికి మించి యాంటీబయోటిక్స్ వాడకాన్ని నిరోధించడమే మనముందున్న సవాల్ అని తెలిపారు.

మోదీ మోత

బీజేపీ స్కోరు 156



అహ్మదాబాద్: మోదీ మేజిక్ మరోసారి అద్భుతం చేసింది. గుజరాత్‌లో కమలం పార్టీ కొత్త చరిత్ర సృష్టించింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌ను, తానే ప్రత్యామ్నాయమంటూ బరిలో దిగిన ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీ బుల్‌డోజర్ అక్షరాలా మట్టికరిపించింది. ఏకంగా 53 శాతం ఓట్లు ఒడిసిపడుతూ 182 అసెంబ్లీ స్థానాలకు గాను 156 సీట్లను సొంతం చేసుకుంది. నాలుగింట మూడొంతులకు పైగా మెజారిటీ సాధించింది. తద్వారా 1985లో మాధవ్‌సింగ్ సోలంకీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సాధించిన 149 సీట్ల రికార్డును బద్దలు కొట్టింది. 2002లో సీఎంగా మోదీ నేతృత్వంలో సాధించిన 127 సీట్ల స్వీయ రికార్డునూ మెరుగు పరుచుకుంది. రాష్ట్ర చరిత్రలో అత్యధిక అసెంబ్లీ స్థానాలు నెగ్గిన పార్టీగానూ రికార్డు సృష్టించింది. 1995 నుంచి అధికారంలో ఉన్న బీజేపీకి ఇది వరుసగా ఏడో విజయం! తద్వారా పశ్చిమబెంగాల్లో సీపీఎం కూటమి సాధించిన ఏడు వరుస విజయాల రికార్డును బీజేపీ సమం చేసింది. కాంగ్రెస్ కేవలం 17 సీట్లతో రాష్ట్ర ఎన్నికల చరిత్రలో అత్యంత ఘోరమైన పరాజయం చవిచూసింది. ఒక్క చాన్సంటూ కేజ్రీవాల్ రాష్ట్రమంతా కాలికి బలపం కట్టుకుని తిరిగినా ఆప్‌కు దక్కింది ఐదు స్థానాలే!

ఆద్యంతమూ జైత్రయాత్రే...

గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల బరిలో బీజేపీతో పాటు కాంగ్రెస్, ఆప్ పోటాపోటీగా తలపడటం తెలిసిందే. డిసెంబర్ 1, 5 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరిగింది. గురువారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా కౌంటింగ్ మొదలైంది. మొదటినుంచీ బీజేపీ స్పష్టమైన ఆధిక్యంతో దూసుకెళ్లింది. పార్టీకి అన్ని వర్గాల నుంచీ సంపూర్ణ మద్దతు లభించింది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి గట్టి పోటీ ఇస్తూ 77 సీట్లు నెగ్గిన కాంగ్రెస్ ఈసారి పూర్తిగా చేతులెత్తేసింది. అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సుడిగాలి ప్రచారం చేసిన రాహుల్‌గాంధీ ఈసారి జోడో యాత్ర కారణంగా దూరంగా ఉండటం, ప్రియాంక కూడా హిమాచల్‌తో పోలిస్తే గుజరాత్‌ను పెద్దగా పట్టించుకోకపోవడం ఆ పార్టీ అవకాశాలను మరింతగా దెబ్బ తీశాయి. పులిమీద పుట్రలా ఆప్ కూడా హస్తం పార్టీని బాగా దెబ్బ తీసింది. ఆప్, మజ్లిస్ కలిసి మైనారిటీ ఓట్లను కూడా చీల్చడం బీజేపీకి మరింత కలిసొచ్చింది. ఆప్‌కు కూడా ఘోర పరాజయమే మూటగట్టుకుంది. పార్టీ సీఎం అభ్యర్థి ఇసుదన్ గాఢ్వీతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు తదితరులంతా ఓటమి పాలయ్యారు. 2017లో దెబ్బ తీసిన పాటిదార్ల ఉద్యమం, జీఎస్టీపై వ్యాపారుల కన్నెర్ర వంటి సమస్యలేవీ లేకపోవడంతో ఈసారి బీజేపీ జైత్రయాత్ర నిర్నిరోధంగా కొనసాగింది. ఘనవిజయం ఖాయం కావడంతో పార్టీ కార్యకర్తలు సంబరాలకు తెర తీశారు.



థాంక్యూ గుజరాత్

''గుజరాత్ ఎన్నికల ఫలితాలను చూశాక ఎన్నోరకాల భావోద్వేగాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. అభివృద్ధి రాజకీయాలను ప్రజలు దీవించారు. థాంక్యూ గుజరాత్. అభివృద్ధి ఇదే వేగంతో కొనసాగాలని వారు కోరుకున్నారు. గుజరాత్ జనశక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. బీజేపీ కార్యకర్తల రెక్కల కష్టం లేకుంటే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు. ప్రతి కార్యకర్త ఒక ఛాంపియన్. మా పార్టీకి అసలైన బలం కార్యకర్తలే. హిమాచల్ ప్రదేశ్ ప్రజలు సైతం బీజేపీపై ఆప్యాయత కనబర్చారు. మద్దతుగా నిలిచారు. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి శ్రమిస్తూనే ఉంటాం. సమయం వచ్చినప్పుడల్లా వారి సమస్యలను లేవనెత్తుతాం''

- ప్రధాని నరేంద్ర మోదీ

మళ్లీ భూపేంద్రే సీఎం

ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ (60) అహ్మదాబాద్‌లోని ఘాట్‌లోడియా స్థానం నుంచి 1.92 లక్షల ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. సీఎంగా ఆయనే కొనసాగనున్నారు. డిసెంబర్ 12న ప్రమాణస్వీకారం చేయనున్నారు.

ఉచితాలను వ్యతిరేకించారు



''గుజరాత్ రాష్ట్రం బీజేపీకి అద్భుత విజయం కట్టబెట్టింది. ఉచిత పథకాలు, బుజ్జగింపు రాజకీయాలు, డొల్ల హామీలను రాష్ట్ర ప్రజలు వ్యతిరేకించారు. నరేంద్ర మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి మోడల్‌ను సంపూర్ణంగా విశ్వసించారు. ఈ చరిత్రాత్మక విజయానికి కారణమైన ప్రజలకు సెల్యూట్ చేస్తున్నా. గుజరాత్‌లో మోదీ నాయకత్వంలో బీజేపీ గత రెండు దశాబ్దాల్లో అభివృద్ధి విషయంలో అన్ని రికార్డులను బద్దలు కొట్టింది. బీజేపీని జనం ఆశీర్వదించారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వెంటే ఉన్నట్లు మరోసారి నిర్ధారణ అయ్యింది''

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

గెలుపోటములు సహజం

''ఎన్నికల్లో గెలుపోటములు సహజం. గుజరాత్ ప్రజల తీర్పును అంగీకరిస్తున్నాం''

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ప్రజా తీర్పును శిరసావహిస్తాం

''గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పును శిరసావహిస్తాం. ఇకపై మరింత కష్టపడి పనిచేస్తాం. రాష్ట్రంలో ప్రజా ప్రయోజనాల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం. హిమాచల్ ప్రదేశ్‌లో మాకు నిర్ణయాత్మక విజయాన్ని అందించిన ఓటర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సాధ్యమైనంత త్వరగా నెరవేరుస్తాం. పార్టీ నేతలు, కార్యకర్తల అంకితభావం, కృషి వల్ల ఈ విజయం లభించింది. వారందరికీ అభినందనలు తెలియజేస్తున్నా''

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

వచ్చే ఎన్నికల్లో మాదే విజయం

గుజరాత్‌లో బీజేపీ కోట బీటలుబారడం మొదలైంది. అందులో ఆప్‌దే కీలక పాత్ర. మా అభ్యర్థులకు ఓట్లేసిన ప్రజలకు కృతజ్ఞతలు. మాకు ఎక్కువ ఓట్లు రాకున్నా పార్టీకి జాతీయ పార్టీ హోదా దక్కడానికి అవి దోహదపడ్డాయి. కేవలం పదేళ్ల వయసున్న పార్టీకి ఈ హోదా లభించడం గొప్ప విషయం. రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మేము కచ్చితంగా విజయం సాధిస్తామన్న నమ్మకం ఉంది.

- ఆప్ నేత అరవింద్ కేజ్రీవాల్

గెలిచిన ప్రముఖులు

- గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ గాట్‌లోడియా స్థానం నుంచి 1.92 లక్షల మెజారిటీతో గెలిచారు.
- క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, బీజేపీ అభ్యర్థి రివాబా జామ్‌నగర్ నార్త్‌లో 50 వేల ఓట్ల మెజారిటీతో గెల్చారు.
- పటీదార్ ఉద్యమ నేత, బీజేపీ అభ్యర్థి హార్దిక్ పటేల్ అర్బన్ వీరమ్‌గ్రామ్ స్థానం నుంచి ఆప్ అభ్యర్థిపై గెలిచారు.
- వదగామ్ (ఎస్సీ) స్థానంలో గతంలో కాంగ్రెస్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన దళిత నేత జిగ్నేశ్ మేవానీ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచారు.
- హార్దిక్ మాజీ సన్నిహితుడు, పటీదార్ నేత అల్పేశ్ కథిరియా వరఛా రోడ్ (సూరత్) స్థానంలో విజయఢంకా మోగించారు.
- కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి వచ్చిన గాంధీనగర్ (సౌత్) నియోజకవర్గ అభ్యర్థి అల్పేశ్ ఠాకూర్ సైతం గెలిచారు.

ఓడిన ప్రముఖులు

- గుజరాత్ ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్ ఇటాలియా కటర్‌గామ్‌లో ఓడారు.
- ఆప్ సీఎం అభ్యర్థి ఎసుదాన్ గాఢ్వీ ఖంభలియా నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు.
- ప్రాథమిక, యువజన విద్యాశాఖ సహాయ మంత్రి కీర్తిసిన్హా వాఘేలా, ఏడుగురు బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఓటమి పాలయ్యారు.
- ఇక హిమాచల్‌లో కాంగ్రెస్ తరఫున సీఎం అభ్యర్థులుగా ప్రచారం జరిగిన ఆశాకుమారి, రామ్‌లాల్ ఠాకూర్, కౌల్‌సింగ్ ముగ్గురూ ఓటమి చవిచూశారు!

బీజేపీ రికార్డు విజయం వెనక... ముచ్చటగా మూడు కారణాలు

దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాల మాదిరిగానే గుజరాత్‌లో కూడా సామాన్యుల్లో చాలా అంశాలపై తీవ్ర అసంతృప్తి నెలకొని ఉంది. ధరల పెరుగుదల మొదలుకుని నానా రకాల సమస్యలతో వాళ్లు కూడా సతమతమవుతూనే ఉన్నారు. ముఖ్యంగా రాష్ట్రానికి వెన్నెముకగా భావించే పాడి పరిశ్రమపై ఆధారపడ్డ అసంఖ్యాకులు ద్రవ్యోల్బణం దెబ్బకు లాభాలు సన్నగిల్లి అల్లాడుతున్నారు. వారంతా దీన్ని రాష్ట్ర బీజేపీ ప్రభుత్వ వైఫల్యంగానే చూశారు. సంపన్న సూరత్ వస్త్ర వ్యాపారుల నుంచి మధ్య గుజరాత్‌లోని నిరుపేద పొగాకు రైతుల దాకా అందరిదీ ఇదే వ్యథ, ఇదే అభిప్రాయం. అయినా సరే, బీజేపీకి ఓటేయడం మినహా మరో మార్గం లేదన్న భావన వారిలో ప్రబలంగా వ్యక్తమవడం విశేషం! 27 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ వ్యతిరేకత కన్పించకపోవడం మరో విశేషం. ఇందుకు మూడు కారణాలు ప్రధానంగా కన్పిస్తున్నాయి. హిందూత్వ నినాదం, ప్రధాని మోదీ మేజిక్, విపక్ష ఓటులో చీలిక. ఈ మూడూ కలగలిసి బీజేపీకి కళ్లుచెదిరే విజయం కట్టబెట్టాయి.

హిందూత్వ నినాదం



హిందూత్వ రాజకీయాలు గుజరాత్‌లో చిరకాలంగా లోలోతులకు పాతుకుపోయాయి. నిజానికి ఎన్నికల ప్రచార సమయంలో కూడా రాష్ట్రంలో సన్నకారు పాడి రైతు మొదలుకుని పాటిదార్ పత్తి రైతు దాకా ఎవరిని కదిలించినా ద్రవ్యోల్బణం దెబ్బకు రెండు మూడేళ్లలో ఆర్థికంగా అక్షరాలా చితికిపోయామంటూ వాపోయినవాళ్లే. కానీ ఓటు మాత్రం బీజేపీకి వేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదన్నది వారంతా ఏకగ్రీవంగా చెప్పిన మాట! ముస్లింల ప్రాబల్యాన్ని అడ్డుకోవాలంటే మరో మార్గం లేదన్నది వారు వెలిబుచ్చిన అభిప్రాయం. ''గతంలో అహ్మదాబాద్ వెళ్లాలంటే 'గొడవ'లేమన్నా అవుతున్నాయా అని ముందుగా వాకబు చేయాల్సొచ్చేది. కానీ సాహెబ్ (మోదీ) వచ్చాక అల్లర్లూ లేవు, సమస్యలూ లేవు'' అని సగటు హిందూ ఓటర్లంతా చెప్పుకొచ్చారు. ఈ ముస్లిం వ్యతిరేక భావజాలం వారిలో ఇప్పటికీ ప్రబలంగా ఉంది. మతపరమైన విభజన ఆర్థిక కష్టాలను కూడా వెనక్కు నెట్టేసింది. ఇదే బీజేపీకి శ్రీరామరక్షగా మారింది.

మోదీ మేనియా



సీఎంగా 13 ఏళ్లు గుజరాత్‌లోనూ, పీఎంగా ఎనిమిదేళ్లుగా కేంద్రంలోనూ తిరుగులేని నాయకునిగా మోదీ సాధించిన పేరు ప్రఖ్యాతులు కూడా ఈసారి ఫలితాలను బాగా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా తటస్థ, ఎటూ నిర్ణయించుకోలేని ఓటర్లు మోదీ కరిష్మా కారణంగా బీజేపీవైపే మొగ్గినట్టు ఫలితాల సరళి స్పష్టంగా చెబుతోంది. నిజానికి అధికార బీజేపీ ఎమ్మెల్యేల అసమర్థత, అధికారుల్లో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని రాష్ట్రంలో జనం అసహ్యించుకునే పరిస్థితి ఉంది! కానీ మోదీ మేనియా వీటన్నింటినీ చాలావరకు అధిగమించేసింది.

విపక్ష ఓటులో చీలిక



గుజరాత్‌లో ఎప్పుడు బీజేపీ, కాంగ్రెస్ మధ్య సాగుతూ వచ్చిన పోరు కాస్తా ఆప్ అన్ని అస్త్రశస్త్రాలతో రంగంలోకి దిగడంతో ముక్కోణ పోరుగా మారిపోయింది. కేజ్రీవాల్ పార్టీ ప్రధానంగా చీల్చింది బీజేపీ వ్యతిరేక ఓటునే! అంటే కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకునే!! అంతిమంగా ఇది ప్రధాన ప్రతిపక్షానికి కోలుకోలేని దెబ్బగా, బీజేపీకి అనుకోని వరంగా పరిణమించింది. ఈ కారణంగానే కమలం పార్టీ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా రికార్డు స్థాయిలో 150 సీట్ల మార్కును దాటగలిగింది. ఏకంగా 53 శాతం ఓట్లు కొల్లగొట్టింది. మరోవైపు కాంగ్రెస్ ఓటు బ్యాంకు 41 శాతం నుంచి 27 శాతానికి పడిపోయింది. ఆప్ సాధించిన 13 శాతం ఓట్లు చాలావరకు కాంగ్రెస్‌వని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. 2017లో కాంగ్రెస్ దుమ్ము రేపిన సౌరాష్ట్ర ప్రాంతాన్ని కూడా బీజేపీ ఈసారి పూర్తిగా తనవైపు తిప్పుకుంది. కానీ ఇక్కడ ఏకంగా 18 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్, ఆప్ రెండింటి ఓట్ల శాతం కలిపితే బీజేపీ కంటే ఎక్కువగా ఉండటం విశేషం! పైగా 2017లో బీజేపీకి చెమటలు పట్టించి కాంగ్రెస్‌కు చాలావరకు ఉపయోగపడ్డ పాటిదార్ ఉద్యమం వంటివేవీ ఈసారి లేకపోవడం కమలనాథులకు మరింతగా కలిసొచ్చింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ప్రతీ అడుగూ పక్కాగా...

మోదీ మంత్రం, షా తంత్రం ● అన్ని వర్గాలను కలుపుకుపోయిన కమలనాథులు ● దశ దిశ లేకుండా చతికిలపడ్డ కాంగ్రెస్

పోయిన చోటే వెతుక్కోవాలంటారు. గత ఎన్నికల్లో త్రుటిలో కోల్పోయిన స్థానాలపై బాగా దృష్టి పెట్టడంలో, దూరమైన వర్గాలను కలుపుకొని పోవడంలో పక్కా ప్రణాళికతో వ్యవహరించిన బీజేపీ గుజరాత్‌లో తిరుగులేని విజయాన్ని సాధించింది. ఎన్నికలకు సరిగ్గా ఏడాది ముందు సీఎంతో పాటు కేబినెట్ మొత్తాన్నీ మార్చేసి ప్రభుత్వ వ్యతిరేకత బారి నుంచి తప్పించుకుంది. అభ్యర్థుల ఎంపిక నుంచి ప్రచారం దాకా దశా దిశా లేకుండా సాగిన కాంగ్రెస్ చివరికి చతికిలపడింది.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సొంత గడ్డ అయిన గుజరాత్‌లో 27 ఏళ్ల అధికార వ్యతిరేకతను అధిగమించడానికి బీజేపీ ఏడాది ముందు నుంచి సన్నాహాలు చేసుకుంది. పార్టీని సంస్థాగతంగా ప్రక్షాళన చేయడంతోపాటు ప్రభుత్వానికి కొత్త రూపు రేఖ కల్పించింది. సీఎంగా విజయ్ రూపానిని సీఎం పీఠం నుంచి తొలగించి రాష్ట్రంలో అత్యంత కీలకమైన పటేల్ సామాజిక వర్గానికి చెందిన భూపేంద్ర పటేల్‌కు సీఎం పగ్గాలు అప్పగించింది. ఎన్నికలకు రెండేళ్ల ముందు నుంచి పార్టీని గాడిన పెట్టడానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా షాకిచ్చే నిర్ణయాలు తీసుకున్నారు. స్థానిక సంస్థలకు కాస్త ముందు 2020 జులైలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పటేల్ సామాజిక వర్గానికి చెందిన జితు విఘానిని తొలగించి ఆయన స్థానంలో సీ.ఆర్.పాటిల్‌కు అవకాశం కల్పించారు. టిక్కెట్ల పంపిణీలో కూడా ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా కఠినంగానే వ్యవహరించారు. ఏకంగా 41 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించి కొత్త ముఖాలను ప్రోత్సహించారు. చివరికి ఎన్నికలకి ముందు 140 మంది ప్రాణాలు కోల్పోయిన కేబుల్ బ్రిడ్జి కుప్పకూలిపోయిన మోర్బీలో కూడా బీజేపీ రికార్డు స్థాయి విజయం సాధించిందంటే ఆ పార్టీ రచించిన పకడ్బందీ వ్యూహాలే కారణం. మోదీకి దేశ విదేశాల్లో ఉన్న జనాదరణ కూడా ఈ ఎన్నికల ఫలితాలను బాగా ప్రభావితం చేసింది. ఆయన 34 ర్యాలీలు, రెండు భారీ రోడ్ షోలతో దాదాపుగా కోటి మంది ఓటర్లను నేరుగా కలిశారు. 'గుజరాత్‌ను నేనే నిర్మించాను, నన్ను చూసి ఓటు వెయ్యండ'న్న మోదీ విజ్ఞప్తికి ఓటర్లు సానుకూలంగా స్పందించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



అహ్మదాబాద్‌లో బీజేపీ శ్రేణుల సంబరాలు

కాంగ్రెస్ సెల్ఫ్ గోల్

గుజరాత్‌లో ఎన్ని కలు జరుగుతున్నాయన్న విషయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోకుండా సెల్ఫ్ గోల్ వేసుకోవడం బీజేపీ ఆకాశమే హద్దుగా సాగిపోయింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో నేతలందరూ బిజీగా ఉండి గుజరాత్‌ను పూర్తిగా వదిలేశారు. గతంలో కాంగ్రెస్‌కు బాగా కలిసొచ్చిన క్షత్రియులు, ఎస్సీ, ఎస్టీ, ఆదివాసీల వ్యూహాన్ని తెరపైకి తెచ్చి దళిత ఉద్యమకారుడు జిగ్నేశ్ మేవానీ, ముస్లిం వర్గంలో పట్టున్న ఖాదిర్ పిర్జాదాలకు అక్కున చేర్చుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కాంగ్రెస్ ఓటు బ్యాంకునే కొల్లగొట్టి కొన్ని సీట్లు సొంతం చేసుకోవడం బీజేపీకి లాభించింది.

సామాజిక సమీకరణలు

సామాజికంగా అన్ని వర్గాలను కలుపుకుని పోయే వ్యూహాలనే బీజేపీ రచించింది. గత ఎన్నికల్లో పటేళ్ల ఉద్యమంతో బీజేపీకి దూరమైన వారిని అక్కున చేర్చుకోవడానికి ఉద్యమ సారథి హార్దిక్ పటేల్‌ను పార్టీలో చేర్చుకుంది. 37శాతం ఉన్న ఓబీసీ ఓటర్లపై దృష్టి పెట్టి కాంగ్రెస్ నుంచి అల్పేష్ ఠాకూర్‌ని చేర్చుకుంది. ఫలితంగా 90 నియోజకవర్గాల్లో పై చేయి సాధించింది.

రికార్డులు

- నరేంద్ర రికార్డులను భూపేంద్ర బ్రేక్ చేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన నినాదం ప్రజల్లోకి బలంగా వెళ్లింది. కమళనాథులకు మోదీ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 127 సీట్లు రావడమే బీజేపీ ఖాతాలోకి అత్యధిక రికార్డు. ఇప్పుడు బీజేపీ దాన్ని తిరగరాసింది. ఏకంగా 156 సీట్లను చేజిక్కించుకుంది.
- మాధవ్‌సిన్హ్ సోలంకి నేతృత్వంలో కాంగ్రెస్ నెగ్గిన 149 సీట్ల రికార్డునూ బీజేపీ ప్రస్తుతం తిరగరాయడం విశేషం.
- విపక్షాల మధ్య ఓట్ల చీలిక వచ్చినా... బీజేపీ ఏకంగా 53 (ఎన్నికల కమిషన్ తాజా సమాచారం ప్రకారం) శాతం ఓట్లు సాధించడం కూడా రికార్డే. కమలనాథులకు ఈ స్థాయిలో ఓట్లు గతంలో ఎప్పుడూ రాలేదు.
- పశ్చిమ బెంగాల్‌లో వామపక్షాలు 1977 నుంచి 2011 వరుసగా ఏడు పర్యాయాలు అధికారాన్ని చేపట్టాయి (34 ఏళ్ల పాటు బెంగాల్‌ను పాలించాయి). గుజరాత్‌లో 1998 నుంచి నిరంతరాయంగా అధికార పీఠంపై ఉన్న బీజేపీ వరుసగా ఏడోసారి నెగ్గి ఈ రికార్డును సమయం చేసింది.

కాంగ్రెస్...కిం కర్తవ్యం?!

గుజరాత్ పరాభవంతో కాంగ్రెస్‌లో అంతర్మథనం ● పలు రాష్ట్రాల్లో పక్కలో బల్లెంలా మారుతున్న ఆప్



న్యూఢిల్లీ: గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు భరించలేని చేదును, కాస్త తీపిని రుచి చూపాయి. గుజరాత్‌లో బీజేపీ దెబ్బకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంతటి ఘోర పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. హిమాచల్‌ప్రదేశ్‌లో గెలిచినా దాన్ని కాంగ్రెస్ ఘనత అనేకంటే బీజేపీ స్వయంకృతమనే చెప్పాలి. ఆ లెక్కన తాజా ఫలితాలు రెండూ కాంగ్రెస్‌కు ప్రమాద ఘంటికలే. దీనికి తోడు ఆమ్ ఆద్మీ పార్టీ క్రమంగా ఒక్కో రాష్ట్రానికీ విస్తరిస్తూ పక్కలో బల్లెంలా మారుతున్న వైనం హస్తం పార్టీని మరింతగా కలవరపెట్టేదే. కాంగ్రెస్ ఇంతకాలం ప్రధానంగా బీజేపీతోనే తలపడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు సీన్ మారుతోంది. పలు రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్ష హోదాను కాపాడుకోవడానికి ముందుగా ఆప్‌తోనే కాంగ్రెస్ తలపడాల్సిన పరిస్థితి తలెత్తే సూచనలు ప్రస్ఫుటంగా కన్పిస్తున్నాయి. ఇది మూలిగే నక్కపై తాటిపండు చందమేనని రాజకీయ విశ్లేషకులంటున్నారు. గుజరాత్‌లోనూ అదే జరిగింది. ఆప్ గెలిచింది ఐదు స్థానాలే అయినా ప్రధానంగా కాంగ్రెస్‌నే దెబ్బ తీసింది. ఆప్ సాధించిన 13 శాతం ఓట్లు కాంగ్రెస్ ఓటుబ్యాంకుకు గండి పెడుతూ సాధించినవే. ''రానున్న రాజస్తాన్, మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కూడా ఆప్ ముప్పు కాంగ్రెస్‌ను వెంటాడటం ఖాయం. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి అది మరింత పెరుగుతుంది'' అని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

హిమాచల్‌లో హస్తం హవా


68 స్థానాలకు గాను 40 స్థానాల్లో విజయం

- కమలం పార్టీకి 25 సీట్లు
- ఖాతా తెరవని ఆమ్ ఆద్మీ పార్టీ
- నేడు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశం

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లో పాత సంప్రదాయమే పునరావృతమైంది. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడం 1985 నుంచి ఒక ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా అదే జరిగింది. అధికార బీజేపీ పరాజయం పాలయ్యింది. ప్రతిపక్ష కాంగ్రెస్ అధికార పీఠం దక్కించుకుంది. రాష్ట్రంలో మొత్తం 68 అసెంబ్లీ స్థానాలుండగా, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 40, బీజేపీ 25 సీట్లు కైవసం చేసుకున్నాయి. ముగ్గురు స్వతంత్ర సభ్యులు నెగ్గారు. 67 స్థానాల్లో పోటీ చేసిన ఆమ్ ఆద్మీ పార్టీ కనీసం ఖాతా తెరవలేక చతికిలపడింది. బీజేపీకి చెందిన 8 మంది మంత్రులు ఓడిపోయారు. కాంగ్రెస్ స్పష్టమైన మెజార్టీ సాధించింది. గుజరాత్‌లో ఘోర పరాభవం నేపథ్యంలో హిమాచల్‌లో ఈ విజయం హస్తం పార్టీకి భారీ ఊరటనిచ్చింది.

ఆమ్ ఆద్మీకి 1.10 శాతం ఓట్లు

హిమాచల్‌లో బీజేపీ ఇచ్చిన 'రాజ్ నహీ.. రివాజ్ బద్లేగా' నినాదం పెద్దగా పనిచేయలేదు. ప్రభుత్వాన్ని కాదు, సంప్రదాయాన్ని మార్చాలని బీజేపీ చెప్పిన మాటలను జనం పట్టించుకోలేదని ఫలితాలను బట్టి స్పష్టమవుతోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 43.9 శాతం ఓట్లు సాధించగా, బీజేపీ 43 శాతం ఓట్లు సాధించింది. రెండు పార్టీల నడుమ ఓట్ల తేడా ఒక శాతం కంటే తక్కువే కావడం గమనార్హం. ఇదే విషయాన్ని ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ప్రత్యేకంగా ప్రస్తావించారు. దాదాపు 12 సీట్లలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓట్లలో తేడా 1,000 లోపే కావడం గమనార్హం. ముఖ్యమంత్రి, బీజేపీ అభ్యర్థి జైరామ్ ఠాకూర్ సెరాజ్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి చేత్‌రామ్‌పై 38,183 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కేవలం 1.10 శాతం ఓట్లు లభించాయి. 11 సీట్లలో పోటీకి దిగిన సీపీఎంకు 0.66 శాతం ఓట్లు దక్కాయి. ఆ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఓడిపోయారు. స్వతంత్ర అభ్యర్థులు 10.39 శాతం ఓట్లు సాధించారు.



సీఎం రేసులో ప్రతిభా సింగ్

సీఎం అభ్యర్థులుగా కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగిన ముగ్గురు నాయకులు ఓడిపోయారు. దీంతో నూతన ముఖ్యమంత్రి రేసులో మాజీ ముఖ్యమంత్రి వీరభద్ర సింగ్ భార్య ప్రతిభా సింగ్ ముందంజలో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మాజీ పీసీసీ అధ్యక్షుడు సుఖ్వీందర్ సింగ్ సుఖూ, మాజీ సీఎల్పీ నేత ముకేశ్ అగ్నిహోత్రి కూడా సీఎం పదవి ఆశిస్తున్నారు.

మహిళా అభ్యర్థులకు పరాభవం

కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థులుగా పేరు గాంచిన ఆశా కుమారి, రామ్‌లాల్ ఠాకూర్, కౌల్‌సింగ్ ఓడిపోవడం ఆ పార్టీకి షాక్ ఇచ్చింది. కేంద్ర మాజీ మంత్రి సుఖ్‌రామ్ కుమారుడు అనిల్ శర్మ మండీసదర్ స్థానంలో మరోసారి గెలిచారు. హిమాచల్ మాజీ ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ తనయుడు, కాంగ్రెస్ అభ్యర్థి విక్రమాదిత్య సింగ్ సిమ్లా(రూరల్) సీటులో మళ్లీ విజయం సాధించారు. ఎన్నికల్లో 24 మంది మహిళలు పోటీ చేయగా, బీజేపీ అభ్యర్థి రీనా కాశ్యప్ ఒక్కరే గెలిచారు. కాంగ్రెస్ నూతన ఎమ్మెల్యేలు శుక్రవారం సిమ్లాలో భేటీ కానున్నారు.

స్థానికాంశాలే కొంపముంచాయ్

హిమాచల్‌లో బీజేపీని దెబ్బ కొట్టిన రెబెల్స్, అంతర్గత పోరు



సిమ్లాలో కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సాహం

అభ్యర్థుల్ని కాదు. నన్ను చూసి ఓటెయ్యండి అంటూ ప్రధాని మోదీ చేసిన ప్రచారం, బీజేపీ జపించిన అభివృద్ధి మంత్రం, డబుల్ ఇంజిన్ సర్కార్ వ్యూహం, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్‌కున్న వ్యక్తిగత ఇమేజ్ ఇవేవీ హిమాచల్ ప్రదేశ్‌లో కమలదళాన్ని కాపాడలేకపోయాయి. స్థానికంగా ఉన్న సమస్యల్ని పరిష్కరించడంలో అధికార బీజేపీ చూపిన అలసత్వమే ఆ పార్టీ కొంపముంచింది. సరిగ్గా వాటినే కాంగ్రెస్ ప్రచారాస్త్రాలుగా మలుచుకుంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించి ఎక్కడికక్కడ మోదీకి కౌంటర్లు ఇవ్వడం కాంగ్రెస్‌కి కలిసొచ్చింది. కాంగ్రెస్ తన ప్రచారంలో పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం, యాపిల్ రైతు సమస్యలు వంటివి లేవనెత్తుతూ వాటికి పరిష్కారాలను కూడా చూపించింది. రాష్ట్రంలో 2 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు కీలక ఓటు బ్యాంకుగా ఉన్నారు. వారంతా పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని ఆందోళనలు చేస్తూ ఉంటే బీజేపీ చూసీ చూడనట్టు వ్యవహరించడం ఆ పార్టీని గట్టి దెబ్బ తీసింది. మరోవైపు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాత పెన్షన్ పునరుద్ధరణపైనే తొలి సంతకం పెడతానని హామీ ఇవ్వడంతో ఉద్యోగులంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపించారు. ఎగువ హిమాచల్ ప్రదేశ్‌లో అత్యంత కీలకమైన యాపిల్ లాబీ బీజేపీపై అసంతృప్తిగా ఉంది. యాపిల్ పళ్లను నిల్వ చేసే కార్టన్లపై జీఎస్టీ పెంపు, అదానీ గ్రూప్‌కి తక్కువ ధరకే యాపిల్స్‌ను అమ్ముకోవాల్సి రావడం వంటివి ప్రభుత్వ వ్యతిరేకతని పెంచాయి. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన అగ్నిపథ్ పథకం కూడా మంచుకొండల్లో మంటల్ని రాజేయడం బీజేపీకి మైనస్‌గా మారింది. ఇండియన్ ఆర్మీలో హిమాచల్‌కు చెందిన 1.15 లక్షల మంది సేవలు అందిస్తూ ఉంటే మరో 1.30 లక్షల మంది రిటైర్డ్ అధికారులున్నారు. కాంట్రాక్ట్ పద్ధతుల్లో సైన్యంలో నియామకాలను తీవ్రంగా వ్యతిరేకించిన వీరంతా, ఈ పథకం రద్దుకు ప్రయత్నిస్తామన్న కాంగ్రెస్ వైపు తిరిగిపోయారు. నిరుద్యోగం, అధిక ధరలు కూడా ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలను దెబ్బ తీశాయి.

బీజేపీకి రెబెల్స్ గండి

బీజేపీ పరాజయానికి రెబెల్ అభ్యర్థులు, పార్టీలోని అంతర్గత పోరు కూడా కారణమే. దాదాపుగా 12 స్థానాల్లో బీజేపీ అసమ్మతి నేతలు పోటీలోకి దిగి బీజేపీ ఓటు బ్యాంకును కొల్లగొట్టారు. విజయం సాధించిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు బీజేపీ రెబెల్సే. ఇక పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మాజీ ముఖ్యమంత్రి ప్రేమ్ కుమార్ ధుమాల్ మధ్య వర్గపోరు కూడా ఎన్నికల్లో ప్రభావం చూపించింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

శుక్రవారం । 9 । డిసెంబర్ । 2022



కమనీయం వేణుగోపాలుడి కల్యాణం

నెమలి(గంపలగూడెం): గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి మాన కల్యాణం గురువారం కనుల పండువగా జరిగింది. పలువురు దంపతులు పీటలపై కూర్చొని సత్యభామ, రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం జరిపించారు.



స్టార్ జోష్!

సినీ హీరో రామ్, హీరోయిన్ మెహరీన్ విజయవాడ నగరంలో గురువారం సందడి చేశారు. మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన వారు అభిమానులకు అభివాదం చేసి, సెల్ఫీలు దిగి అలరించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

న్యూస్‌రీల్

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం రూ.లక్ష విరాళం సమర్పించారు. విజయవాడ లబ్బీపేటకు చెందిన యర్రి కొండలరావు, ధనలక్ష్మి దంపతులు ఆలయ ఈఓ భ్రమరాంబను కలిసి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఓ భ్రమరాంబ ప్రసాదాలను అందజేశారు.

రాష్ట్రస్థాయికి ఏడు ప్రాజెక్టులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరుజిల్లా గూడూరులో గురువారం నుంచి జరగనున్న జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్–2022 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా విద్యార్థులు ఏడు ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లాలో నిర్వహించిన పోటీల్లో ఎంపికైన అత్యుత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించనున్నారు. జిల్లా స్థాయిలో 318 ప్రాజెక్టులు నమోదవగా, వాటి నుంచి మండల స్థాయికి 60 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సి.వి. రేణుక తెలిపారు. వాటిలో ఏడు అత్యుత్తమ ప్రాజెక్టులను గుర్తించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామని వివరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ జిల్లా విద్యార్థు ప్రతిభచాటాలని డీఈఓ రేణుక, జిల్లా కో ఆర్డినేటర్ మైనం హుస్సేన్ ఆకాంక్షించారు.

రేపటి నుంచి ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్



విజయవాడ కల్చరల్: నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి ఏడో ఇండియన్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ అండ్ చైర్మన్ బత్తిన విక్రమ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. 10,11 తేదీల్లో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ అకాడమీ ప్రాంగణంలో నిర్వహించే నృత్యోత్సవంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి కళాకారులు భారతీయ నృత్యరీతులను ప్రదర్శిస్తారని తెలిపారు. తొలి రోజు అమెరికాకు చెందిన షారోన్ లోమెన్ ఒడిస్సీ, గీతా నారాయణన్ కూచిపూడి, కర్నాటకకు చెందిన రేఖారాజు బృందం మోహినీ అట్టం, సంబల్‌పూర్ జానపద నృత్య బృందం జానపద నృత్యాలు, 11వ తేదీన కిరణ్మయి బోనాల బృందం కూచిపూడి నృత్యం, వెస్ట్ బెంగాల్‌కు చెందిన డీబ్‌జన్ బృందం భరతనాట్యం, కేరళకు చెందిన అనుపమ మోహన్ కూచిపూడి, కర్నాటకకు చెందిన సాయి ఆర్ట్స్ బృందం కథక్ నృత్యాంశాలు ప్రదర్శిస్తారని వివరించారు. నృత్య కళాకారులను అమరావతి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తామని తెలిపారు.

భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భూ హక్కు పత్రాల పంపిణీ ప్రారంభించామని సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. రీ సర్వే ప్రక్రియపై సీసీఎల్ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, అడిషనల్ సెక్రటరీ ఏఎండీ ఇంతియాజ్, జాయింట్ సెక్రటరీ గణేష్ గురువారం ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. విజయవాడ కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. జిల్లాలోని 14 గ్రామాల్లో భూముల రీసర్వే ఇప్పటికే పూర్తయిందన్నారు. ఆయా గ్రామాలవారికి భూ హక్కు పత్రాలు ముద్రించి పంపిణీ ప్రారంభించామని పేర్కొన్నారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల్లోని సమాచారంతో క్షేత్రస్థాయి సర్వే వివరాలను సరిచూసి భవిష్యత్‌లో భూయజమానులకు ఎటువంటి ఇబ్బందులూ వివాదాలకు తావు లేకుండా శాశ్వత ప్రతిపాదికన భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. తిరువూరు మండలంలోని ఆంజనేయపురం, ఎ.కొండూరు మండలంలోని మారేపల్లి గ్రామాల్లో భూ హక్కు పత్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూ హక్కు పత్రాలను పంపిణీకి సిద్ధం చేస్తున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ కె.సూర్యారావు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



షూటింగ్ బాల్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ఎంపికైన క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్స్: జాతీయ షూటింగ్ బాల్ అండర్–19 జూనియర్ బాలబాలికల పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్లను ఎంపిక చేసినట్లు ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోసఫ్ గురువారం తెలిపారు. గత నెల 22 నుంచి 24వ తేదీ వరకు అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. ఈ జట్లు అదిలాబాద్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటాయని వివరించారు. ఈ జట్లకు కోచ్‌లుగా సురేంద్ర, కిషోర్, మేనేజర్లుగా ముత్యం, హరీష్ వ్యవహరిస్తారని తెలిపారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారులను ఏపీ షూటింగ్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఆర్.డి. ప్రసాద్, వైస్ చైర్మన్ పాలవలస శ్రీనివాసరావు, అధ్యక్షుడు సి.హెచ్.శ్రీనివాసరావు అభినందించారు.

బాలికల జట్టు: టి.రాధిక, ఎం.శిరీష, ఉషా సాయిశ్రీ, బి.భారతి, డి.అశ్విత, సి.హెచ్. శైలజ, స్వర్ణ, కె.లావణ్య, ఆషా, కె.గీతాంజలి, వై.మీనా, ఆశీర్వాదంపాల్.

బాలుర జట్టు: కనకరాజు, టి.దిలీప్, బి.నిఖిల్, బాషా, పి.దిలీప్, కె.కిరణ్, కె.సంపత్, షేక్ అబ్దుల్, సీహెచ్.చక్రి, యు.రవితేజ, ఎం.మహేష్, ధీరజ్, ప్రవీణ్ కుమార్, వినోద్, డెలిష్.

పార్కు.. ఆరోగ్యం మార్కు

- విజయవాడ నగరంలో 170 ఉద్యాన వనాలు
- పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు
- అందుబాటులో వ్యాయామ పరికరాలు



పచ్చదనంతో ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్న రాజీవ్‌గాంధీ పార్కు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పచ్చదనంతో కళకళలాడుతున్న ఉద్యాన వనాలు విజయవాడ ప్రజలకు ఆహ్లాదం పంచుతున్నాయి. మానసిక ప్రశాంతత, చక్కటి ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి. నగరపాలక సంస్థ పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా అవకాశం ఉన్న ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచడమే కాకుండా పార్కులుగా మలిచి ప్రజలకు అందుబాటులోకి తెస్తోంది. ఈ పార్కులను స్థానికులు సద్వినియోగం చేసుకుంటున్నారు. సకుటుంబ సమేతంగా పార్కులకు వెళ్లి సరదాగా గడిపి, ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. అక్కడి వ్యాయామ పరికరాలను వినియోగించుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం పార్కులకు వస్తున్న వారి వారి సంఖ్య పెరిగిందని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

పార్కుల్లో పచ్చందాలు

విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 170 పార్కులు ఉన్నాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా పార్కులు అన్నింటినీ కార్పొరేషన్ అధికారులు పచ్చని మొక్కలు, ఆకట్టుకునే బొమ్మలతో ప్రజల అభిరుచులకు అనుగుణంగా అధికారులు తీర్చిదిద్దుతున్నారు. ప్రధానంగా రాజీవ్‌గాంధీ పార్క్, కేఎల్‌రావు పార్క్, రాఘవయ్య పార్క్ వంటి పెద్ద పార్కులను అభివృద్ధి చేయడంతోపాటు ఆయా డివిజన్లలో ఉన్న ఖాళీస్థలాలనూ పార్కులుగా తీర్చిదిద్దారు. భవానీపురం బైపాస్, కుమ్మరిపాలెం తదితర ప్రాంతాల్లో డివైడర్లు, ఫుట్‌పాత్‌గా ఉన్న ప్రాంతాలను పార్కులుగా తీర్చిదిద్దారు. అక్కడ అనేక వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేశారు. ఈ పార్కులు సందర్శకులతో కళకళలాడుతున్నాయి.

రూ.కోట్లతో అభివృద్ధి పనులు

నగరానికి తలమానికంగా ఉన్న రాజీవ్‌గాంధీ పార్క్‌ను సుమారు రూ.2.5 కోట్లతో తీర్చిదిద్దారు. ప్రస్తుతం పార్కులోకి సందర్శకులను అనుమతిస్తున్నారు. నగర పాలకసంస్థ సర్కిల్–1 పరిధిలో ఉన్న కేఎల్ రావు పార్క్‌ను రూ.2 కోట్లతో ఆధునికీకరిస్తున్నారు. ఈ పార్కు ఆధునికీకరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. పోలీస్ కంట్రోల్ రూమ్ సమీపంలోని పార్కును సైతం చూడముచ్చటగా తీర్చిదిద్దనున్నారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో త్వరలో టెండర్లు పిలుస్తామని అధికారులు తెలిపారు. గతంలో కొంతమేర పనులు నిర్వహించామని, మిగిలిన పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లను పూర్తి చేసి ప్రారంభిస్తామని వివరించారు. పాతబస్తీలోని పురాతన గాంధీ పార్క్‌ను సైతం రూ.15 లక్షలతో ముస్తాబుచేస్తున్నారు. ఈ పార్కు ప్రాంగణంలో ఉన్న జిమ్‌ను సైతం మరింతగా అభివృద్ధి చేస్తున్నారు. సర్కిల్–2, సర్కిల్–3 పరిధిలోని పటమట, సత్యనారాయణపురం, కృష్ణలంక, సింగ్‌నగర్ తదితర ప్రాంతాల్లోని పార్కుల్లోనూ అనేక పనులు చేపట్టారు.

అందంగా పార్కులు

నగర పాలకసంస్థ పరిధిలో సుమారు 170 పార్కులు ఉన్నాయి. మునిసిపల్ కమిషనర్ ఆదేశాలతో వాటిని ఎప్పటికప్పుడు అందంగా తీర్చిదిద్దుతున్నాం. ఇందు కోసం నిరంతరం అభివృద్ధి పనులు చేపడుతున్నాం. స్థానిక ప్రజల డిమాండ్లను అనుసరించి వసతులు కల్పించి పార్కులను అందంగా తీర్చిదిద్దుతున్నాం. నిధుల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనులు చేపడుతున్నాం.

- ఎ.ఎస్.ఎం.ప్రసాద్, ఈఈ, పార్క్స్, వీఎంసీ



రాఘవయ్య పార్కులో సందర్శకుల సందడి

పెరుగుతున్న సందర్శకులు


ఇటీవల ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతున్నారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం బయటకు వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగింది. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లతో పాటుగా చిన్నపాటి జిమ్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. వ్యాయామ వసతులు ఉన్న పార్కులకు సందర్శకుల సంఖ్య భారీగా పెరిగింది. రాజీవ్‌గాంధీ పార్కును నగర ప్రజలే కాకుండా నగరానికి వస్తున్న యాత్రికులు సందర్శించి సేదతీరుతున్నారు. శని, ఆదివారం రోజుల్లో రాజీవ్‌గాంధీ పార్కు సందర్శకులతో కిటకిటలాడుతోంది. మిగిలిన పార్కుల్లోనూ గతంతో పోలిస్తే సందర్శకుల సంఖ్య గణనీయంగా పెరిగింది. నగర ప్రజల అభిరుచులకు అనుగుణంగా పార్కులను తీర్చిదిద్దడం వల్లే సందర్శకుల సంఖ్య పెరిగిందని నగరపాలక సంస్థ అధికారులు పేర్కొంటున్నారు.

ఒత్తిడితో రుగ్మతలు

విజయవాడ లబ్బీపేటకు చెందిన వెంకటేష్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల తీవ్రమైన మానసిక ఒత్తిళ్లకు గురయ్యాడు. తల్లిదండ్రులు అతడిని మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అతనికి కౌన్సెలింగ్ ఇవ్వగా, సోషల్ మీడియా ప్రభావంతో డిప్రెషన్‌కు గురయినట్లు వైద్యుడు గుర్తించారు. తన సెల్ఫీలకు లైక్‌లు రాకపోవడం, తనతో ఎవరూ చాటింగ్ చేయకపోవడం వంటివి ఒత్తిడికి కారణంగా తెలిసింది.

విజయవాడ విద్యాధరపురానికి చెందిన నరేష్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. ఇటీవల చదువుపై దృష్టి పెట్టకపోవడం, ఆహారం సరిగా తీసుకోకపోవడంతో తల్లిదండ్రులు మానసిక వైద్యుడిని ఆశ్రయించారు. అక్కడ కౌన్సెలింగ్ చేయగా, ఎంత చదివినా మార్కులు రాకపోవడం, స్నేహితులకు ఎక్కువ మార్కులు రావడమే అతని డిప్రెషన్‌కు కారణమని తేలింది.

- 29 ఏళ్లలోపు వారిలోనూ మానసిక సమస్యలు
- సోషల్ మీడియాకు బానిసలుగా విద్యార్థులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న వైద్య నిపుణులు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మన ఆలోచనలు, ఆచరణలు అన్నీ మెదడుపైనే ఆధారపడి ఉంటాయి. మన కర్తవ్యాలను నెరవేర్చుకుంటూ లక్ష్యాలను చేరి ఆనందంగా జీవించేందుకు శారీరక, మానసిక ఆరోగ్యం బాగుండాలి. అయితే నేటి యువత నిస్పృహ (డిప్రెషన్)తో తీవ్ర మానసిక ఒత్తిళ్లు ఎదుర్కొంటోందని, ఫలితంగా ఆరోగ్యం దెబ్బతింటోందని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విజయవాడ నగరంలోని మానసిక నిపుణులను సంప్రదిస్తున్న వారిలో యువతే ఎక్కువగా ఉంటోంది. ఒక్కొక్క మానసిక వైద్యుడి వద్దకు నెలకు 15 నుంచి 20 మంది వరకూ డిప్రెషన్‌తో వస్తున్నట్లు అంచనా.

మానసిక ఒత్తిళ్లకు కారణాలివే..

- తనకంటే, పక్కవారికి ఎక్కువ మార్కులు వచ్చాయి. నేను ఎందుకు సాధించలేకపోయానని మానసిక ఆందోళనకు గురవుతున్న వారు ఎక్కువగా ఉంటున్నారు.
- తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి పిల్లలపై ప్రభావం చూపుతోంది. తన ఫ్రెండ్ మంచి బైక్, ఖరీదైన సెల్‌ఫోన్ వాడుతున్నాడు. తాను వాడలేకపోతున్నానని ఆందోళన చెందుతున్న వారు ఉంటున్నారు.
- సోషల్ మీడియా యువతపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తాను పెట్టిన పోస్టింగ్‌కు ఎక్కువ లైక్స్, కామెంట్స్ రాలేదు. ఎవరూ షేర్ చేయలేదని డిప్రెషన్‌కు గురయ్యే వారూ ఉన్నారు. తనతో యువతులు ఎవరూ చాటింగ్ చేయడం లేదు. తనలో ఎక్కడ లోపం ఉంది అని ఆలోచిస్తూ డిప్రెషన్‌కు గురవుతున్నట్లు వైద్య నిపుణులు చెపుతున్నారు.



సెల్‌ఫోన్, ఇంటర్‌నెట్, వీడియో గేమ్స్, సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు, బెట్టింగ్స్ వంటి వాటికి పిల్లలు విపరీతంగా బానిసలై చాలా దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఈ వ్యసనాలకు కూడా మానసిక రుగ్మతలుగా గుర్తించి సకాలంలో మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలి.

- సెల్ఫీ పోస్టు చేసిన తర్వాత అంచనాలకు తగ్గట్టు లైక్స్ రాలేదని తీవ్ర అసహనానికి గురయ్యే వారు కూడా ఉన్నారు.

యువతలో పెరుగుతున్న డిప్రెషన్

ప్రస్తుతం 14 నుంచి 25 మధ్య వయస్సు వారు ఎక్కువగా డిప్రెషన్‌కు గురవుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న చిన్న కారణాలకే డిప్రెషన్‌కు లోనై ఆహారం సరిగా తీసుకోకపోవడం, దిగులుగా ఉండటం, చదువుపై దృష్టి పెట్టలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు పేర్కొంటున్నారు. శారీరక వ్యాయామం లేకపోవడం కూడా యువత ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందని, ముఖ్యంగా పరీక్షల విషయంలో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని వైద్యులు వివరిస్తున్నారు.

సోషల్ మీడియా కారణమే..



నేటి యువత ప్రతి చిన్న విషయానికీ డిప్రెషన్‌కు గురవుతోంది. దేనిని సీరియస్‌గా తీసుకోవాలి, లైట్‌గా దేనిని తీసుకోవాలో వారికి తెలియడం లేదు. ఇంటర్మీడియెట్, పాఠశాల స్థాయిలో కేవలం సిలబస్ పూర్తి చేయడం, మార్కులు, ర్యాంకులు, బట్టీ చదువులపైనే దృష్టి పెడుతున్నారు. విలువలు, జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించడం ఎలా అనే అంశాలను బోధించడంలేదు. సోషల్ మీడియా కూడా డిప్రెషన్‌కు కారణమే.

- డాక్టర్ డి.విజయలక్ష్మి, మానసిక వైద్య విభాగాధిపతి, విజయవాడ జీజీహెచ్

మనసును ఉల్లాసంగా ఉంచాలి



జీవితంలో ఏ సమస్య వచ్చినా టీనేజ్ వారు త్వరగా డిప్రెషన్‌కు గురవుతుంటారు. ఇటీవల డిప్రెషన్‌లో తమ వద్దకు నెలకు 15 నుంచి 20 మంది వరకూ యువతీయువకులు వస్తున్నారు. వారంతా చిన్న చిన్న కారణాలతో డిప్రెషన్‌కు గురయిన వారే. యువతపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉంటోంది. పలువురు పోర్న్ సైట్స్‌కు బానిసలుగా మారుతున్నారు. డిప్రెషన్‌కు గురవకుండా ఉండాలంటే మనస్సును ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంచుకోవాలి.

- డాక్టర్ గర్రే శంకరరావు, ఏపీ కౌన్సెలింగ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు

దుర్గమ్మకు స్వర్ణ కవచాలంకారం



లక్ష కుంకుమార్చనలో ఉభయదాతలు



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు గురువారం స్వర్ణకవచాన్ని అలంకరించారు. అమ్మవారిని స్వర్ణకవచంలో దర్శించుకోవడం చాలా అదృష్టంగా భక్తులు భావిస్తారు. దసరా ఉత్సవాల తొలి రోజున అమ్మవారిని స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా అలంకరిస్తారు. ఆ తర్వాత పౌర్ణమి రోజునే అమ్మవారు ఈ అలంకారంలో అనుగ్రహిస్తారు. స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

ఆర్జిత సేవలకు రద్దీ

అమ్మవారికి తెల్లవారుజామున నిర్వహించిన ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమం వంటి ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. పౌర్ణమి నేపథ్యంలో లక్ష కుంకుమార్చన, చండీ హోమాలకు రికార్డు స్థాయిలో భక్తులు విచ్చేశారు. ఈ సేవల్లో పాల్గొన్న ఉభయదాతలను ప్రత్యేక క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

ఎఫ్ఎఫ్ఎంఏ యాప్‌తో మత్స్యకారులకు ఉపయోగం


మచిలీపట్నంటౌన్: ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన ఫిషర్ ఫ్రెండ్ మొబైల్ అప్లికేషన్ (ఎఫ్ఎఫ్ఎంఏ) యాప్ మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. ఫౌండేషన్ రూపొందించిన ఈ యాప్ ద్వారా లభించే విశేషాలతో మత్స్యకారులు వేట సమయంలో అనేక మేలులు పొందొచ్చని సూచించారు. స్థానిక భాస్కరపురంలోని ఎంఎస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ కార్యాలయంలో గురువారం ఎఫ్ఎఫ్ఎంఏ యాప్ వినియోగం, ఉపయోగాలపై ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎఫ్ఎఫ్ఎంఏ యాప్‌ను ప్రతి మత్స్యకారుడూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులకు మేలు చేస్తుందన్నారు. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఫిష్ ఫర్ ఆల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వెల్విజీ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా కొన్నేళ్లుగా మత్స్యకారులు ఎంతో మేలు పొందుతున్నారని వివరించారు. సముద్రంలో ముందస్తు వాతావరణం, చేపలు లభించే సమాచారం, తుపాను హెచ్చరికలతో పాటు జీపీఎస్ అందుబాటులో ఉంటుందన్నారు. ఫిష్ ఫర్ ఆల్ సెంటర్ కార్యక్రమాలైన పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ గురించి, ఆర్టిఫిషియల్ రీఫ్స్ గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫిషరీస్ ఏడీలు సీహెచ్ వెంకటేశ్వరరావు, నాగబాబు, ఎఫ్‌డీఓలు సత్యనారాయణ, ఆనందరాజు, లక్ష్మీనాగఅంజని, మెరైన్ ఏఎస్ఐ టి.మురళీకృష్ణ, పోర్టు శాఖ అధి కారి వై.వెంకటేశ్వరరావు, నోబుల్ కాలేజీ ఎన్ఎస్ఎస్ సిబ్బంది కమలకుమారి, ఆనందరాజు, మత్స్యకారుల సంఘ నాయకుడు బి.వీరరాఘవయ్య, ఎస్.ఆంజనేయులు, కె.శ్రీధర్, చంద్రయ్య, ఎం.నెలబాలుడు, స్వామినాథన్ ఫౌండేషన్ ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, ఎన్.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు శివనాగసాయి

పెనమలూరు: కానూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమాన్‌జంక్షన్‌కు చెందిన విన్నకోట శివనాగసాయి (27) కానూరులో ఐఏఎస్ అకాడమీలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. అతను విజయవాడ కరెన్సీనగర్‌లో మేనమామ మందపాటి రవికిరణ్ ఇంట్లో ఉంటున్నాడు. అయితే అతను కానూరులోని అకాడమీలో బుధవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. కానూరు పంటకాలువ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అతనిని ఆర్టీసీ సిటీ బస్సు వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి చికిత్సకు తీసుకు వెళ్లారు. అక్కడ అతను మృతి చెందాడు. మృతుడి మేనమామ మందపాటి రవికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కొండ చిలువ హతం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): గొర్రెల కాపరి చేతిలో కొండ చిలువ హతమైన ఘటన గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుమలగిరి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ఆళ్ల తిరుపతిరావు గొర్రెలను మేపేందుకు సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కొండ చిలువ గొర్రెలపై దాడి చేసింది. ఓ గొర్రెను తినేందుకు ప్రయత్నించింది. గమనించిన కాపరి దానిని హతమార్చాడు. అయితే అప్పటికే గొర్రె మృతి చెందింది.

విద్యతోనే సమానత్వం సాధ్యం

ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం


పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న దాతలు, అజేయ కల్లం, ఎమ్మెల్యే వంశీ

ఉంగుటూరు(గన్నవరం): విద్యతోనే సమానత్వం సాధ్యమని, ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వం, దాతల సంయుక్త నిధులు రూ.5 కోట్లతో నిర్మించిన నూతన భవనాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అజేయ కల్లం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్, సాంకేతిక విద్యను అందించేందుకు దాతలు చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వ నిధులకు తోడు పాఠశాల పూర్వ విద్యార్థి బొబ్బా వెంకటాద్రి తనతో పాటు పలువురు దాతల ఆర్థిక తోడ్పాటుతో మూడు అంతస్తుల్లో 18 అదనపు గదులు, నాలుగు డిజిటల్ తరగతి గదులు, డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్, అధునాతన కిచెన్, డైనింగ్ హాల్, సోలార్ విద్యుత్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, టెలిమెడిసిన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం ప్రశంసనీయమన్నారు. ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే తొలి విడత మనబడి నాడు–నేడు ద్వారా అనేక పాఠశాలలను నూతన హంగులతో తీర్చిదిద్దారని గుర్తుచేశారు. రెండో విడత పనులు 66 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల నూతన భవనాల నిర్మాణానికి ఆర్థికంగా సహకరించిన విదేశీ, స్వదేశీ దాతలను ఎమ్మెల్యే వంశీ ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నరసాపురం మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు, సర్పంచ్ వర ప్రసాద్, ఎంపీపీ వడ్లమూడి సరోజని, ఏపీ ఎస్‌ఆర్‌టీఎస్ డైరెక్టర్ వెంకట్ మేడపాటి, కీటస్ చైర్మన్ శివసుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ చైర్మన్ నవీన్ దాసరి, డీఈఓ తాహెరా సుల్తానా, దాతలు బొబ్బా వెంకటాద్రి, అమెరికాకు చెందిన ప్రొఫెసర్ తోమస్ నజరీయో తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో సీఎంఆర్ షాపింగ్ మాల్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి,ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఎండీ గౌతంరెడ్డి


షాపింగ్ మాల్ ఎదుట గుమిగూడిన యువతకు అభివాదం చేస్తున్న సినీ హీరో రామ్

లబ్బీపేట(విజయవాడతూర్పు): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ షాపింగ్ మాల్ ఇప్పుడు విజయవాడలోనూ అందుబాటులోకి వచ్చింది. మహాత్మాగాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను సంస్థ ఫౌండర్ మావూరి వెంకటరమణ, మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీతో కలిసి రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. సినీ నటుడు రామ్ పోతినేని జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రారంభోత్సవంలో హీరోయిన్ మెహరీన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. వస్త్ర వ్యాపారంలో మంచి గుర్తింపు కలిగిన సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను విజయవాడలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సీఎంఆర్ ఫౌండర్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. తమ 21వ బ్రాంచ్‌ను విజయవాడలో ప్రారంభించామని తెలిపారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఎండీ పి.గౌతమ్‌రెడ్డి, పారిశ్రామికవేత్త మలినేని రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల సేవలను నమోదు చేయాలి

ఎన్టీఆర్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణులకు అందిస్తున్న సేవలను ఆర్సీహెచ్ వెబ్‌సైటులో నమోదు చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని సూచించారు. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలపై పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీలకు గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ.. వివిధ ఆరోగ్య సేవల క్రోడీకరణ, ప్రగతి సాధనకు నమోదు ప్రక్రియ ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుతం ఆరోగ్యశాఖలో అమలవుతున్న యాప్‌ల నిర్వహణ, ముఖ ఆధారిత హాజరు, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం అమలు, సాంక్రమిక, అసాంక్రమిక వ్యాధులు, టీబీ, లెప్రసీ, రీప్రొడక్టివ్ చైల్డ్‌హెల్త్ వెబ్ పోర్టల్ వంటి అంశాలపై అవగాహన కలిగించారు. ఆర్సీహెచ్ సాంకేతిక టీమ్ సభ్యులు షరీఫ్, వినయ్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జె.ఉషారాణి, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అమృత, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధిద్దాం

విజయవాడలోని తన కార్యాలయంలో విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమశాఖ సిబ్బందితో జరిగిన సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ జిల్లాలో సాధించదగిన లక్ష్యాలను చేరుకుందామన్నారు. లక్ష్యాలను ఏ విధంగా చేరుకోవాలో విశ్లేషణాత్మకంగా వివరించారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నళినీదేవి, స్టాటిస్టికల్ ఆఫీసర్ ఎస్.లక్ష్మీజీ తదితరులు పాల్గొన్నారు. ఏఆర్‌టీ సరోగసి యాక్ట్ అమలులో భాగంగా సూర్యారావుపేట కోవెలమూడి వీధిలోని మార్విఅస్ శ్రీరామ్ ఇంటర్నేషనల్ ఐవీఎఫ్ సెంటర్‌ను జిల్లా ఇన్‌స్పెక్షన్ టీమ్ గురువారం తనిఖీ చేసింది. ఐవీఎఫ్ కేంద్రాలు పరిపూర్ణమైన నిబంధనలు కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ స్పష్టంచేశారు.

ముమ్మరంగా గోడౌన్ల నిర్మాణం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో బహుళ ప్రయోజన కేంద్రాల (మల్టీపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు.ఏ కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు. గురువారం సచివాలయం నుంచి గోడౌన్లకు భూసేకరణ, నిర్మాణం, తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో బాబు. ఏ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్‌కు కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత మంజూరైన 58 గోడౌన్లలో 53 గోడౌన్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెండో విడతలో మంజూరైన 50 గోడౌన్లలో 37, మూడో విడతలో మంజూరైన 21 గోడౌన్లకు 19కు సంబంధించి ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేశామని, మిగిలిన వాటికి సంబంధించి భూసేకరణ త్వరితగతిన చేపడుతున్నామని వివరించారు. డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ సీహెచ్ శైలజ, మార్కెటింగ్ ఏడీ కిశోర్ పాల్గొన్నారు.

'మిస్టర్ ఆంధ్ర'కు జిల్లా జట్టు సిద్ధం


శిక్షణ పూర్తి చేసుకున్న ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీబిల్డింగ్ జట్టు

పెనమలూరు: మిస్టర్ ఆంధ్ర–2022 పోటీలకు ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు శిక్షణ పూర్తి చేసుకుని రాష్ట్ర పోటీలకు సిద్ధంగా ఉందని జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఈదా రాజేష్, అధ్యక్షుడు బత్తుల మనోహర్ తెలిపారు. కానూరులో గురువారం జరిగిన క్రీడాకారుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ నెల 10, 11 తేదీల్లో రాజమండ్రిలో మిస్టర్ ఆంధ్ర–2022 బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టును ఇటీవల ఎంపిక చేశామన్నారు. ఈ జట్టుకు కానూరు అశోక్ జిమ్‌లో పూర్తి స్థాయిలో శిక్షకులచే ప్రత్యేక శిక్షణ ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీలతో పాటు జాతీయ స్థాయిలో జరగనున్న మిస్టర్ ఇండియా సెలక్షన్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తాళ్లూరి అశోక్, టీమ్ మేనేజర్ మణిప్రకాష్, టీమ్ ఇన్‌చార్జి అల్లూరి రెడ్డి, కోచ్ పీజే, పలువురు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగ పోటీలకు జెడ్పీ పాఠశాల విద్యార్థి


అర్హత సాధించిన శశాంక్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సుధారాణి

ఉయ్యూరు(పెనమలూరు): మండలంలోని పెద ఓగిరాల జెడ్పీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి జె.శశాంక్ రాష్ట్రస్థాయిలో యోగకు అర్హత సాధించాడని హెచ్‌ఎం సుధారాణి తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాలో ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్–14 విభాగంలో యోగలో పాఠశాల విద్యార్థి జె.శశాంక్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. శశాంక్‌ను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయటం ఆనందంగా ఉందన్నారు. కోచ్ జ్యోతి, అర్హత సాధించిన విద్యార్థిని హెచ్‌ఎం అభినందించారు.

రీ-సర్వే పనులు వేగవంతం

చిలకలపూడి(మచిలీపట్నం): భూ హక్కు – భూ రక్ష పత్రాల పంపిణీ ప్రక్రియ, రీ–సర్వే పనులను వేగవంతం చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు. భూహక్కు పత్రం జారీ, జగనన్న శాశ్వత భూహక్కుకు సంబంధించిన రీ–సర్వే, వివాద స్థలాలపై చర్యలు, మ్యూటేషన్‌లపై జిల్లా కలెక్టర్లతో గురువారం రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి. సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో పరిస్థితిని వివరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ వారాల తరబడి వాయిదాలు వేయకుండా రీ–సర్వే పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరిలోపు పూర్తి చేయాలన్నారు. రీ–సర్వే చేసినప్పుడు ఉత్పన్నమైన సమస్యలను అత్యంత ప్రణాళికాబద్ధంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు.

అశ్రునయనాలతో తపస్వికి అంతిమ వీడ్కోలు

పమిడిముక్కల(పామర్రు): ఇటీవల గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, తక్కెళ్లపాడు దుర్ఘటనలో మృతి చెందిన వైద్యవిద్యార్థిని పిన్నమనేని తపస్వి భౌతిక కాయానికి ఆమె స్వగ్రామం కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం, కృష్ణాపురంలో గురువారం అంత్యక్రియలు జరిపారు. ఈ సందర్భంగా స్థానికులు తోటి వైద్యవిద్యార్థులు అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శి బి.వేణుకుమారి, వి.జ్యోతి, పలు పార్టీల నాయకులు మృతురాలి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షించాలని, మహిళారక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకుని యువతి ఆత్మహత్య

కంకిపాడు(పెనమలూరు): అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. ఎస్‌ఐ వై.దుర్గారావు కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు గ్రామానికి చెందిన కటికల ఏమీమా (19) బుధవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి ఆమెను వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. యువతి తండ్రి కటికల కృష్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి ఫుట్‌బాల్ టోర్నీ

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి స్మారక జేఎన్‌టీయూకే ఫుట్‌బాల్ ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ శుక్రవారం నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు గురువారం తెలిపారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో పోటీలు జరుగుతాయన్నారు. కళాశాల గౌరవ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి, చైర్మన్ ఎల్. ప్రసాదరెడ్డి, జి. శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కె. అప్పారావు, డాక్టర్ కె. హరినాథరెడ్డి పాల్గొంటారన్నారు.

సర్పంచి, ఈవోపై క్రిమినల్ కేసు నమోదు

గన్నవరం: గన్నవరం గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచి, ఈఓపై గురువారం పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం...గ్రామ పంచాయతీలో అవినీతి, అక్రమాలు జరుగుతున్నట్లు పాలకవర్గ సభ్యులు, ఎంపీటీసీలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఇటీవల విచారణకు ఆదేశించారు. గుడివాడ డీఎల్‌పీఓ సంపత్‌కుమారి నేతృత్వంలో బృందం విచారణ జరిపి సర్పంచి నిడమర్తి సౌజన్య, పంచాయతీ కార్యదర్శి నక్కా రాజేంద్రవరప్రసాద్ రూ.1.59 కోట్లు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించారు. దీనికి సర్పంచి, ఈఓను చేరి సమానంగా బాధ్యులను చేస్తూ కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా ఇప్పటికే ఈవో రాజేంద్ర వరప్రసాద్‌ను పంచాయతీరాజ్ కమిషనర్ సస్పెండ్ చేశారు. అంతేకాకుండా నిధులు దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచి, ఈవోపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డీపీవోను ఆదేశించారు. ఈ మేరకు ఎంపీడీవో ఫిర్యాదు మేరకు సర్పంచి, ఈవోపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం.. కాపాడిన ఎన్‌డీఆర్‌ఎఫ్


వ్యక్తిని ఒడ్డుకు తీసుకొస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం

రామవరప్పాడు(గన్నవరం): కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం కాపాడిన ఘటన ప్రకాశం బ్యారేజీ వద్ద గురువారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు కాల్వగట్టు ప్రాంతానికి చెందిన కె. గోపీ కుటుంబ సమస్యల కారణంగా ప్రకాశం బ్యారేజీ పిల్లర్ నంబర్ 61 వద్ద కృష్ణానదిలో దూకాడు. దీనిని దూరం నుంచి గమనించిన ఎన్‌డీఆర్‌ఎఫ్ అబ్జర్వర్ వెంటనే వైర్‌లెస్ వాకీటాకీ ద్వారా బృందానికి సమాచారం అందించారు. అక్కడకు దగ్గరలోనే పడవలో ఉన్న బృందం 30 సెకన్ల వ్యవధిలో అతని దగ్గరకు వెళ్లి ప్రాణాలు కాపాడారు. అనంతరం గోపీని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు ఆత్మహత్య యత్నానికి గల కారణాలను విచారిస్తున్నారు.

క్లుప్తంగా

వైభవంగా దత్త జయంతి



పటమట(విజయవాడతూర్పు): పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో దత్తత్రేయ జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు దత్తాత్రేయునికి పంచామృత అభిషేకాలు, తైలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా 11,116 మంది భక్తులు అనఘాష్టమి వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్న సంతర్పణ నిర్వహించారు.

చిన్నారులకు ఎమ్మెల్యే విష్ణు పరామర్శ



లబ్బీపేట(విజయవాడతూర్పు): గాంధీనగర్ సర్ విజ్జీ స్విమ్మింగ్ పూల్ ఘటనలో అస్వస్థతకు గురైన చిన్నారులను రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పరామర్శించారు. పాత ప్రభుత్వాస్పత్రిలోని పిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అందరి ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉందని, ఎలాంటి అపాయం లేదని వైద్యులు ఎమ్మెల్యే విష్ణుకు తెలిపారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కొందరు కొత్తాస్పత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి కాగా, వారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆర్ఎంఓ డాక్టర్ శోభను ఆరా తీశారు. అత్యవసరమైతే ఏ సమయంలోనైనా తనను సంప్రదించాలని పిల్లల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే విష్ణు భరోసానిచ్చారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ సమీపంలో శైలపు అరుణ తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. అరుణకు ఇద్దరు సంతానం కలరు. అరుణ కందుల వారి వీధిలోని ఓ ఫ్యాన్సీ షాపులో పని చేస్తుండగా, కుమారుడు సునీల్‌కుమార్ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటాడు. 7వ తేదీ షాపునకు వెళ్లిన అరుణ సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో షాపు యజమానికి ఫోన్ చేయగా, రాత్రి 9 గంటలకు షాపు మూసివేశామని, అప్పుడే అరుణ ఇంటికి వెళ్లిపోయిందని చెప్పారు. దీంతో అమ్మమ్మ వాళ్ల ఇంటికి ఫోన్ చేసినా ఆచూకీ లేకపోవడంతో, తల్లి ఫోన్‌కు ఫోన్ చేశాడు. దీంతో తల్లి కనిపించడం లేదంటూ కుమారుడు సునీల్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆలయంలో హుండీ చోరీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆలయ తాళాలు పగలగొట్టి హుండీ చోరీ చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో చోరీ జరిగిందన్నారు. బుధవారం రాత్రి ఆలయంలో పూజలు ముగిసిన తర్వాత అర్చకులు తాళాలు వేసి ఇంటికి వెళ్లారని చెప్పారు. గురువారం ఉదయం వచ్చి చూసే సరికి ఆలయ తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో లోపలకు వెళ్లి చూడగా హుండీ కనిపించలేదన్నారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గోడ్లశ్ల రాము ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రేమించి పెళ్లి చేసుకుని ఆపై వేధింపులకు గురి చేస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన వెనుముల ధనలక్ష్మి(28) అదే గ్రామానికి చెందిన శివనాగరాజు కొంత కాలంగా ప్రేమించుకుని ఈ ఏడాది ఆగస్టులో విజయవాడ ఇంద్రకీలాద్రిపై పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం దంపతులు సింగ్‌నగర్‌లో కాపురం ఉన్నారు. ఆ తర్వాత ఎవరికి వారు వెళ్లిపోయి, ఆ తర్వాత అప్పుడప్పుడు కలుసుకునే వారు. ఇటీవల నాగరాజు భార్యకు ఫోన్ చేసి నువ్వంటే ఇష్టం లేదని, మరో పెళ్లి చేసుకుంటానని అంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బాబా మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీభగవాన్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. తొలుత ఆలయ అర్చకులు బాబాకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి పర్యవేక్షించారు.

అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నినాదం

- 18వ డివిజన్‌లో రూ.2.09 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్



18వ డివిజన్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, దేవినేని అవినాష్, డెప్యూటీ మేయర్లు దుర్గ, శ్రీశైలజ, కార్పొరేటర్లు

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధే నినాదంగా రాబోయే ఎన్నికల్లో ప్రజల మద్దతుతో ఘన విజయం సాధిస్తామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. రాణిగారితోట, 18వ డివిజన్‌లో వారధి వెంబడి గురువారం స్థానిక కార్పొరేటర్, వీఎంసీ ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పార్క్‌ను మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి వారు ప్రారంభించారు. అనంతరం రూ.1 కోట్ల 73 లక్షల నిధులతో చేపట్టిన హైమాస్ట్ అండ్ సైడ్ లైటింగ్, భూగర్భ డ్రెయినేజీ, మంచినీటి పైప్‌లైన్, సిమెంట్ రోడ్లు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు.

కోట్లాది రూపాయలతో అభివృద్ధి

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో నగరపాలకసంస్థ కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామని చెప్పారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణ కల్పించేందుకు, చిన్న పిల్లలను ఆకర్షించే విధంగా పార్కును ఏర్పాటు చేశామన్నారు. పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

శరవేగంగా పనులు

దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. గత మూడు సంవత్సరాలుగా తూర్పు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కాలనీలు, డివిజన్లు అని తేడా లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ఆ పార్టీ కార్పొరేటర్లు గెలిచిన ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి చేశారని, వైఎస్సార్ సీపీ బలంగా ఉన్న కృష్ణలంక, గుణదల ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కానీ నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గెలుపోటములతో సంబంధం లేకుండా రాష్ట్రమంతా అభివృద్ధి చేయాలని సంకల్పంతో పనిచేస్తున్నారన్నారు. టీడీపీ లాగా శంకుస్థాపనలు చేసి వదిలేయకుండా వీలైనంత త్వరగా పనుల మొదలుపెట్టి ఎలాంటి నాణ్యతా లోపం లేకుండా పూర్తి చేస్తామని చెప్పారు.



వైఎస్సార్ పార్క్‌ను ప్రారంభించి క్రికెట్ ఆడుతున్న అవినాష్

పార్క్‌తో ఆహ్లాదకర వాతావరణం

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనులతో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంగా పార్క్‌ను ప్రారంభించామన్నారు. నగరపాలకసంస్థ సాధారణ నిధులు రూ.2.09 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. ప్రజలు కూడా నగరపాలకసంస్థకు సహకరించి పార్క్‌లో ఏర్పాటు చేసి మొక్కలు, పూలకుండీలు, ఇతర వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. డివిజన్‌లో ఎటువంటి ఇంబ్బందులు గానీ, సమస్యలు గానీ ఉంటే నగర పాలక సంస్థకు తెలియజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం గృహకల్ప, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశంలోని నగరాల్లో జీవన ప్రమాణాలు, సుస్థిరమైన వసతులు, ఆర్థిక వనరులపై సిటిజన్ పర్సెప్షన్ సర్వే నిర్వహిస్తుందని, ఈ సర్వేలు నగర ప్రజలు పాల్గొని జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచేలా సహకరించాలని సూచించారు. అనంతరం ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్–2022 ఈఓఎల్–2022 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శైలజారెడ్డి, 17వ డివిజన కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, జోనల్ కమిషనర్ డాక్టర్ రవిచంద్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఉపాధ్యాయులు, కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ది మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ సొసైటీ పాలక వర్గానికి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. సొసైటీ అధ్యక్షుడు గుంజా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం సభ్యులు మేయర్ రాయన భాగ్యలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రోగ్రెసివ్ ఫ్రంట్ ప్యానల్ మ్యానిఫెస్టోను అమలు పర్చడంలో వీఎంసీ కౌన్సిల్ సహాయ సహకారాలు అందించాలని కోరారు. దీనిపై స్పందించిన మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వీఎంసీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు మంచి చేసేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు కార్యాలయంలో వీఎంసీ సిబ్బంది, కార్మికులకు సొసైటీ సభ్యులు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, కార్యదర్శి తిరుమారెడ్డి బ్రహ్మారెడ్డి, సహాయ కార్యదర్శి సింహాద్రి మస్తాన్ రావు, డైరెక్టర్లు వేజెండ్ల ప్రభావతి, భూపతి గోవిందరావు, గుంటక ప్రభాకరరెడ్డి, తోపుల శివశంకర్, బచ్చు రాజేష్, తాడిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.



మేయర్ భాగ్యలక్ష్మితో సొసైటీ కమిటీ సభ్యులు

హ్యామ్ రేడియోతో ఉపయోగాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో హ్యామ్ రేడియో వ్యవస్థ ద్వారా సమాచార మార్పిడి చేసుకోవచ్చునని హ్యామ్ రేడియో ట్రెనింగ్ కో ఆర్డినేటర్ ఏ రమేష్‌బాబు చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో హ్యామ్ రేడియో వల్ల ఉపయోగాలు అనే అంశంపై సదస్సు జరిగింది. రమేష్‌బాబు అతిథిగా హాజరై మాట్లాడారు. వరదలు, భూకంపాలు మొదలైన ప్రకృతి బీభత్సాలు జరిగినప్పుడు సిగ్నల్స్ వ్యవస్థ సరిగా ఉండదని అలాంటి సమయంలో ఈ హ్యామ్ రేడియో వల్ల అక్కడి పరిస్థితులను తెలుసుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టవచ్చునన్నారు. అంతరిక్షంలో కూడా హ్యామ్ రేడియో ద్వారా సంభాషణలు కొనసాగించవచ్చని చెప్పారు. ఇంటర్నెట్ అవసరం లేకుండా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఈ హ్యామ్ రేడియో ద్వారా సమాచారాన్ని చేరవేయవచ్చునన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు హ్యామ్ రేడియో కోర్సులో జాయిన్ కావచ్చునని చెప్పారు. ఈ కోర్సును పూర్తి చేసిన వారికి ప్రభుత్వం సర్టిఫికెట్ అందజేస్తుందని చెప్పారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కేఎస్‌వీ సాంబశివ రావు, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, శశాంక, ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు పాల్గొన్నారు. హ్యామ్ రేడియో పని చేసే విధానాన్ని ఆయన విద్యార్థులకు డిమానిస్ట్రేషన్ చేసి చూపించారు.



మాట్లాడుతున్న రమేష్‌బాబు

తిరుమల నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తిరుమల నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు 10 టన్నుల కూరగాయలు వితరణ చేశారు. ప్రకాశంరోడ్డులోని ఎస్‌వీఆర్ షోరూం నుంచి మండవ కుటుంబరావు ఆధ్వర్యంలో తిరుమలకు 10 టన్నుల కూరగాయలను గురువారం ఉదయం పంపించారు. కూరగాయల లారీకి నల్లమల్లి వెంకట రామాంజనేయులు, ఆంజనాదేవిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లమల్లి బాలు మాట్లాడుతూ.. నిత్యాన్నదానానికి సాయం చేయడం పూర్వజన్మ సుకృతమన్నారు. ప్రతి నెలా మండవ కుటుంబరావు ఆధ్వర్యంలో తిరుమల అన్నదానానికి కూరగాయలు పంపుతారని, ఈ సారి ఆ అవకాశం తమకు వచ్చిందని తెలిపారు. స్వామివారిసేవలో పాల్గొనడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో శ్రీవారి సేవా కార్యక్రమాలకు మరింత చేయూత నందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శిల్ప, శ్రీమహా, చింతా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల లారీకి జెండా ఊపుతున్న దాతలు

11న వ్యాసరచన పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్థాపించి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాచవరం ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో ఈనెల 11న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.అజంత కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ తేదీ ఉదయం మాచవరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో 'బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం – నా జీవితం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొనేందుకు ప్రస్తుత విద్యార్థులతో పాటు పూర్వవిద్యార్థులు అర్హులన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతి ప్రధానం చేస్తామని తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సిటీ కేబుల్ వ్యవస్థాపకుడు పొట్లూరి రామకృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల ఆవరణలోని మైదానంలో డిగ్రీ విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని సిటీ కేబుల్ మేనేజింగ్ డైరెక్టర్ పొట్లూరి సాయిబాబు చెప్పారు. ప్రజాశక్తి నగర్‌లోని సిటీ కేబుల్ కార్యాలయంలో గురువారం క్రికెట్ పోటీల్లో పాల్గొనే టీమ్ కెప్టెన్‌లతో కలిసి ఆయన జెర్సీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. నగర పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను 8 టీమ్‌లుగా విభజించి ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువుతో పాటుగా క్రీడలపైన దృషి సారించాలని చెప్పారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఈ పోటీలను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ప్రారంభిస్తారని, మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులు హాజరై వీక్షిస్తారన్నారు. పొట్లూరి రామకృష్ణ జయంతి రోజైన జనవరి 28 తేదీన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఇదే స్ఫూర్తిగా తీసుకుని తమ సంస్థ తరఫున భవిష్యత్‌లో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహిస్తామని సాయిబాబు తెలిపారు.



క్రికెట్ టోర్నమెంట్ జెర్సీలను ఆవిష్కరించిన సాయిబాబు, టీమ్ కెప్టెన్లు

సూపర్‌వైజర్ పోస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం(జువెనైల్ హోమ్)లో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్ట్‌కు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిశీలనా గృహం పర్యవేక్షణాధికారి పి.రామ్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్(అప్‌కాస్) ద్వారా భర్తీ చేసేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఎస్సీ సామాజికవర్గానికి చెందిన కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులైన, శారీరక దృఢత్వం (1.67 మీటర్ల ఎత్తు, 86.3 సెంటీ మీటర్ల ఛాతీ చుట్టుకొలత) కలిగిన పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీ లోపు పర్యవేక్షణాధికారి, ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం, డోర్ నంబర్.3–1–265/4ఎ, కబేళా రోడ్డు, రోటరీనగర్, విద్యాధరపురం, విజయవాడ–520012 చిరునామాకు పంపాలని కోరారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): అనారోగ్యంతో ఓ మహిళ బస్సులో మృతి చెందిన ఘటన ఎన్టీఆర్‌జిల్లా కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కందుకూరుకు చెందిన తుమ్మపూడి కల్పన(39) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తోంది. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. గురువారం విజయవాడలో ఒక ప్రవేట్ కంపెనీలో ఇంటర్వ్యూ ఉండడంతో బుధవారం రాత్రి 11 గంటలకు కందుకూరు నుంచి ఆమె బస్సులో బయలుదేరింది. గురువారం తెల్లవారుజామున 4 గంటల సమయానికి బస్సు విజయవాడ కనకదుర్గ వారధి వద్దకు చేరుకోగానే ఆమెకు ఫిట్స్ కనిపించి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. బస్సు బస్టాండ్‌కు చేరుకోగానే ప్రయాణికులు 108కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఆమెను పరీక్షించి చూసి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి సరోజనమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ఈనెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు తెల్లవారుజామున సుప్రభాత సేవ, నిత్యతిరువారాధన, తోమాలసేవ, తిరుప్పావైసేవ, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతాయన్నారు. జనవరి 2వ తేదీ వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. జనవరి 14వ తేదీ సాయంత్రం శ్రీగోదారంగనాథ స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ధనుర్మాసోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ఎక్సైజ్ టాడీ పాలసీలో మార్పులకు వినతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): కల్లుగీత కార్మికులకు మేలు చేసేలా ఎక్సైజ్ టాడీ పాలసీలో మార్పులు చేయాలని కల్లు గీతా కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్ర దేవుడు కోరారు. గవర్నర్‌పేటలోని ఎంబీవిజ్ఞాన కేంద్రంలో కల్లు గీతా కార్మిక సంఘం నాయకుడు జుత్తిగ నరసింహామూర్తి అధ్యక్షతన గురువారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎర్ర దేవుడు మాట్లాడుతూ.. వృత్తిలో ప్రమాదవశాత్తు చనిపోయిన గీత కార్మికులకు సంబంధించి రూ.10 లక్షలు, వైకల్యానికి గురైన వారికి రూ.లక్ష పరిహారం ప్రకటించాలని కోరారు. వృత్తి సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం.భాస్కరయ్య, కల్లు గీతా కార్మిక సంఘం నాయకులు రామచంద్రరావు, బి.శ్రీనివాసరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గణితంలో పట్టు సాధిస్తేనే విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు గణితంపై పట్టు సాధించినప్పుడే అద్భుతమైన అవకాశాలను అందుకుంటారని ప్రముఖ గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ప్రఖ్యా సత్యనారాయణ తెలిపారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల గణిత శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మ్యాథమెటిక్స్ మోడల్స్‌పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన ముగింపు సభలో సత్యనారాయణ మాట్లాడుతూ.. గణితంలోని వివిధ మోడల్స్‌ను తయారు చేయటం వలన వాటిపై మంచి అవగాహన పెరుగుతుందన్నారు. గణితం పట్ల భయాలు ఉండకూడదని, దానిపై సాధన చేస్తే చక్కని ఫలితాలను పొందవచ్చని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు గణితంలో పట్టు సాధించేందుకు వర్క్‌షాప్ నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ, విభాగాధిపతి ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ప్రఖ్యా సత్యనారాయణ

ఎస్ఆర్ఆర్‌లో యోగా చాంపియన్‌షిప్ పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో గురువారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల యోగా మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పలు కళాశాలలకు చెందిన అభ్యర్థులు పోటీలలో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 26వ తేదీ నుంచి కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ, భువనేశ్వర్‌లో జరిగే ఆల్ ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను కళాశాల వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు డాక్టర్ డి.యుగంధర్, ఎం.కోటేశ్వరరావు అభినందించారు.



యోగా పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులతో కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

• వాహనాలు ఇలా.. రాకపోకలు ఎలా..



కృష్ణలంక వ్యాప్తంగా రహదారులపై అనధికార పార్కింగ్‌తో రోడ్లు కుంచించుకుపోయి వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీధుల్లో ఇళ్ల ముందు కారులు, ఆటోలు ఇష్టారాజ్యంగా నిలిపి ఉంచడంతో కనీసం నడిచేందుకు కూడా వీలు లేని పరిస్థితి ఉంటుంది. అనధికార పార్కింగ్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– కృష్ణలంక(విజయవాడతూర్పు)

• నగరంలో క్రిస్మస్ సందడి షురూ !



నగరంలో క్రిస్మస్ పండుగ సందడి ప్రారంభమైంది. క్రైస్తవులు ఇళ్లపై చిన్న, పెద్ద స్టార్‌లు ఏర్పాటు చేస్తుండడంతో వాటి విక్రయాలు ఊపందుకున్నాయి. పలు షాపింగ్ మాల్స్‌లను భారీ క్రిస్మస్ ట్రీలతో అలంకరించారు. దీంతో ప్రజలు కుటుంబ సమేతంగా సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడుపుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



క్లుప్తంగా...

కొలీజియం.. మన దేశ చట్టం
అందరూ అనుసరించాల్సిందే: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఉన్నత న్యాయస్థానాల్లో జడ్జీల నియామకం కోసం ఉద్దేశించిన కొలీజియం వ్యవస్థ అనేది మన దేశ చట్టమని సుప్రీంకోర్టు ఉద్ఘాటించింది. తాము నిర్దేశించిన ఏ చట్టమైనా భాగస్వామ్యపక్షాలను కలిపి ఉంచుతుందని పేర్కొంది. కొలీజియం వ్యవస్థను కచ్చితంగా అందరూ అనుసరించాల్సిందేనని తేల్చిచెప్పింది. కొలీజియం సిఫార్సు చేసిన పేర్లను కేంద్ర ప్రభుత్వం త్వరగా ఆమోదించకుండా జాప్యం చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో పిటిషనల్ దాఖలైంది. దీనిపై జస్టిస్ ఎస్.కె.కౌల్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కొలీజియంపై కేంద్ర మంత్రులు, ప్రభుత్వ పెద్దలు చేస్తున్న వ్యాఖ్యలను తాము పట్టించుకోవడం లేదని స్పష్టం చేసింది.

గ్రీన్ కార్డుల్లో దేశాల కోటాకు స్వస్తి !

వాషింగ్టన్: అమెరికాలో ఉద్యోగాలు కోరుకునే భారతీయులకు మేలు చేకూర్చే ప్రక్రియ మరో అడుగు ముందుకు పడింది. ఈక్వల్ యాక్సెస్ టు గ్రీన్ కార్డ్ ఫర్ లీగల్ ఎంప్లాయ్‌మెంట్(ఈగిల్) యాక్ట్–2022ను అమెరికా అధ్యక్ష భవనం ఓకే చెప్పింది. బిల్లుపై ఈ వారంలోనే అక్కడి పార్లమెంట్ దిగువ సభలో ఓటింగ్ చేపట్టనున్నారు. ఇన్నాళ్లూ ప్రతి సంవత్సరంలో జారీచేసే గ్రీన్‌కార్డుల్లో ఒక్కో దేశానికి సంబంధించిన నిర్దిష్ట సంఖ్యలోనే కార్డులు ఇస్తారు. ఎవరికైనా అధిక వృత్తి నైపుణ్యాలు ఉన్నాసరే.. అప్పటికే ఆ దేశ కోటా పూర్తయితే వారికి గ్రీన్ కార్డు అమెరికా ఇవ్వలేకపోతోంది. ఈ పరిమితిని ఎత్తేస్తోంది. అంటే ఏ దేశంలో పుట్టాడనే అంశంతో సంబంధంలేకుండా అత్యున్నత వృత్తి నైపుణ్యం గల వ్యక్తులను ఒకే దేశం నుంచి ఎక్కువ సంఖ్యలో తీసుకునేందుకు ఈగల్ చట్టం అవకాశం కల్పిస్తుంది.

ఉద్ధవ్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు

ముంబై: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, శివసేన(ఉద్ధవ్ వర్గం) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఆయన కుటుంబసభ్యులు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న ఆరోపణలపై ముంబై పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ కేసులో ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించామని గురువారం బాంబే హైకోర్టుకు ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసులు తెలిపారు. మరోవైపు, ఉద్ధవ్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని, సీబీఐ, ఈడీతో విచారణ జరిపించాలంటూ బాంబే హైకోర్టులో మహిళా పబ్లిషర్ గౌరి బిధే వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)పై తీర్పును డివిజన్ బెంచ్ రిజర్వ్ చేసింది.

మెయిన్‌పురి సమాజ్‌వాదీ పార్టీదే

- ఐదు రాష్ట్రాల్లోని ఆరు అసెంబ్లీ స్థానాలకూ ఫలితాలు వెల్లడి
- బీజేపీ, కాంగ్రెస్ చెరో రెండు చోట్ల గెలుపు
- మిగతా స్థానాలు స్థానిక పార్టీల కైవసం


కార్యకర్తలకు అభివాదం చేస్తున్న డింపుల్

న్యూఢిల్లీ, లక్నో: సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)అగ్రనేత ములాయం సింగ్ యాదవ్ మరణంతో అనివార్యమైన మెయిన్‌పురి లోక్‌సభ స్థానం ఉప ఎన్నికల్లో ఆయన కోడలు డింపుల్ యాదవ్ ఘన విజయం సాధించారు. ఎస్పీ పార్టీకి కంచుకోటగా భావించే మెయిన్‌పురి స్థానంలో ములాయం కోడలు, ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ భార్య డింపుల్‌ను పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దింపిన విషయం విదితమే. గురువారం వెల్లడైన ఫలితాల్లో సమీప బీజేపీ అభ్యర్థి రఘురాజ్ సింగ్ శాక్యపై 2,88,461 కోట్ల ఆధిక్యతతో డింపుల్ గెలుపొందారు. మరోవైపు బిహార్‌లో జేడీ(యూ), ఆర్‌జేడీ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్ కూటమికి చేదు అనుభవం ఎదురైంది. రాష్ట్రంలోని కుర్హనీ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో జేడీ(యూ) అభ్యర్థి మనోజ్ సింగ్ కుష్వాహాపై బీజేపీ అభ్యర్థి కేదార్ ప్రసాద్ గుప్తా విజయం సాధించారు. ' ఆర్‌జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌నూ ఎన్నికల్లో సానుభూతిగా వాడినా ప్రయోజనం లేకుండా పోయింది' అంటూ బీజేపీ నేత సుశీల్ మోదీ ఎద్దేవాచేశారు. ఉత్తరప్రదేశ్‌లో ఖతౌలి అసెంబ్లీ నియోజకవర్గంలో గత గెలుపును బీజేపీ నిలబెట్టుకోలేకపోయింది. తాజా ఉప ఎన్నికల్లో బీజేపీ మహిళా అభ్యర్థి రాజ్‌కుమారి సైనీపై రాష్ట్రీయ లోక్‌దళ్ అభ్యర్థి మదన్ భయ్యా విజయం సాధించారు. కాగా, రాష్ట్రంలో మరో స్థానంలో బీజేపీ ఘన విజయం సాధించింది. రామ్‌పూర్ సదర్ ఎస్పీ ఎమ్మెల్యే అజంఖాన్ అనర్హతతో అనివార్యమైన ఉప ఎన్నికల్లో తొలిసారిగా అక్కడ బీజేపీ గెలిచింది. ఇక్కడి సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి ఆసిం రాజాపై బీజేపీ అభ్యర్థి ఆకాశ్ సక్సేనా విజయం సాధించారు. ఏకంగా 33వేలకుపైగా మెజారిటీతో సక్సేనా గెలిచారు. తమ పార్టీ అధికారంలో ఉన్న రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌లలోని ఒక్కో అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్ గెలిచింది. రాజస్తాన్‌లోని సదర్‌షహర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి అశోక్ కుమార్ పిన్చాపై కాంగ్రెస్ అభ్యర్థి అనిల్ శర్మ గెలుపొందారు. స్వాతంత్ర్యకాలం నుంచీ చూస్తే ఈ స్థానంలో కాంగ్రెస్ గెలవడం ఇది పదోసారి కావడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భానుప్రతాప్‌పూర్ అసెంబ్లీ స్థానంలో బీజేపీ అభ్యర్థి బ్రహ్మానంద్ నేతమ్ కంటే కాంగ్రెస్ మహిళా అభ్యర్థి సావిత్రి మండవి అధిక ఓట్లు సాధించి విజయబావుటా ఎగరేశారు. ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగాకి బరిలో దిగిన మాజీ ఐపీఎస్ అధికారి అక్బర్ రామ్ 23వేలకుపైగా ఓట్లు సాధించడం గమనార్హం. ఒడిశా అధికార బీజేడీ పార్టీ మరోసారి జయకేతనం ఎగరేసింది. ఒడిశాలోని పదమ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి ప్రదీప్ పురోహిత్‌పై బీజేడీ మహిళా అభ్యర్థి బర్ష సింగ్ బరిహా గెలిచారు.

అమెరికాలో స్వలింగ వివాహాలకు ఓకే

వాషింగ్టన్: అగ్రరాజ్యం అమెరికాలో స్వలింగ వివాహాలను చట్టబద్ధంగా గుర్తించే ప్రక్రియ ఆరంభమైంది. సంబంధిత బిల్లుకు అమెరికా కాంగ్రెస్(పార్లమెంట్)లోని ప్రతినిధుల సభ గురువారం తుది ఆమోదం తెలియజేసింది. బిల్లుకు మద్దతుగా 258 మంది ఎంపీలు, వ్యతిరేకంగా 169 మంది ఓటు వేశారు. మొత్తం డెమొక్రాట్లతోపాటు 39 మంది ప్రతిపక్ష రిపబ్లికన్లు కూడా మద్దతు తెలిపారు. మిగతా 169 మంది వ్యతిరేకించారు. 'రెస్పెక్ట్ ఫర్ మ్యారేజ్ యాక్ట్' అని పిలుస్తున్న ఈ బిల్లు గత నెలలోనే ఎగువ సభ అయిన సెనేట్‌లో ఆమోదం పొందింది. ఇప్పుడు దిగువ సభ సైతం ఆమోదించడంతో ఇక అధ్యక్షుడు జో బైడెన్ వద్దకు వెళ్లనుంది. ఆయన సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాలుస్తుంది. స్వలింగ వివాహాల బిల్లుకు ఆధ్యాత్మిక సంస్థలు మద్దతు తెలిపాయి.

పెరూలో అధ్యక్షుడి అభిశంసన, అరెస్టు


లీమా: రాజకీయ సంక్షోభానికి నెలవైన దక్షిణ అమెరికా దేశం పెరూ పాలనా పగ్గాలు హఠాత్తుగా చేతులు మారాయి. తన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు కుట్ర జరుగుతోందని, పార్లమెంట్‌ను రద్దుచేయబోతున్నట్లు, దేశవ్యాప్త కర్ఫ్యూ అమల్లోకి రాబోతోందని ప్రకటించిన ఆ దేశ అధ్యక్షుడు పెడ్రో క్యాస్టిల్లోను ఆ దేశ పార్లమెంట్ సభ్యులు వెనువెంటనే అభిశంసనతోపాటు అధ్యక్ష పీఠం నుంచి తప్పించారు. ఆయన అరెస్ట్, నిర్బంధం చకచకా జరిగిపోయాయి. ఆ తర్వాత రెండు గంటల వ్యవధిలోనే ఉపాధ్యక్షురాలు డినా బొలార్టే.. అధ్యక్షురాలిగా ప్రమాణం చేశారు.

బ్రిట్నీ గ్రినర్‌ను విడుదల చేసిన రష్యా

వాషింగ్టన్: అమెరికా, రష్యాలు ఖైదీల పరస్పర విడుదల ఒప్పందం కింద అమెరికా బాస్కెట్‌బాల్ స్టార్ బ్రిట్నీ గ్రినర్‌ను రష్యా విడుదల చేసింది. బదులుగా ఆయుధ వ్యాపారి విక్టర్ బౌట్‌ను అమెరికా– రష్యాకు అప్పగించింది. రెండుసార్లు ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ అయిన గ్రినర్‌ను రష్యా పర్యటనలో ఉండగా మాదకద్రవ్యాల కేసులో అరెస్టు చేశారు. శిక్షను ఖరారు చేసి జైలుకు పంపారు. ఆమెకున్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా బైడెన్ సర్కారు తీవ్ర ఒత్తిడికి లోనైంది. ఖైదీల పరస్పర విడుదలకు రష్యాతో బేరసారాలు కొనసాగించింది. ఎట్టకేలకు ఒప్పందం కుదిరింది. అబుదాబిలో గ్రినర్‌ను అప్పగించి, విక్టర్ బౌట్‌ను స్వదేశానికి తీసుకువచ్చినట్లు రష్యా విదేశాంగ శాఖ పేర్కొంది.

మున్సిపాలిటీ సభ్యుడిగా ప్రస్థానం

గుజరాత్ సీఎంగా వరుసగా రెండోసారి భూపేంద్ర పటేల్



అహ్మదాబాద్: పార్టీ పట్ల అంకితభావం, కష్టించే తత్వం భూపేంద్ర పటేల్‌ను మున్సిపాలిటీ స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి చేర్చాయి. గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించడంతో ఆయన మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. భూపేంద్ర పటేల్ ఈ నెల 12న సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సి.ఆర్.పాటిల్ ప్రకటించారు. గుజరాత్‌లో ఎన్నికలకు సరిగ్గా ఏడాది క్రితం ముఖ్యమంత్రిని మార్చాలని బీజేపీ అగ్రనాయకత్వం నిర్ణయించింది. విజయ్ రూపానీ స్థానంలో పటేల్ సామాజిక వర్గానికి చెందిన భూపేంద్ర వైపు మొగ్గుచూపింది. అధిష్టానం అంచనాలకు తగ్గట్టే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయపథం వైపు నడిపించారు.

2017లో రికార్డు స్థాయి మెజార్టీ

భూపేంద్రబాయ్ పటేల్ అలియాస్ భూపేంద్ర పటేల్ 1962 జూలై 15న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జన్మించారు. 1982 ఏప్రిల్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)లో చేరారు. తొలుత అహ్మదాబాద్ జిల్లాలోని మేమ్‌నగర్ మున్సిపాలిటీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ఆరంభించారు. రెండు సార్లు అదే మున్సిపాలిటీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2010 నుంచి 2015 దాకా అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(ఏఎంసీ) స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. 2015 నుంచి 2017 వరకు అహ్మదాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ(ఏయూడీఏ) చైర్మన్‌గా సేవలందించారు. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గాంధీనగర్ లోక్‌సభ స్థానం పరిధిలోని ఘట్లోడియా శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేశారు. ఏకంగా 1.17 లక్షల ఓట్ల తేడాతో కాంగ్రెస్ అభ్యర్థి శశికాంత్ పటేల్‌పై ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో ఇదే అత్యధిక మెజార్టీ కావడం విశేషం. 2021 సెప్టెంబర్ 13న గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా జరిగిన(2022) అసెంబ్లీ ఎన్నికల్లో ఘట్లోడియా స్థానం నుంచి 1.92 లక్షల మెజార్టీతో నెగ్గడం గమనార్హం.

● ఆమ్ ఆద్మీ పార్టీ ...

కొంచెం ఇష్టం.. ఎంతో కష్టం

హిమాచల్‌ప్రదేశ్‌లో ఖాతా తెరవలేకపోయింది. గుజరాత్‌లో సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలని ఆప్ కలలు కంది. కానీ ఆ కలలన్నీ కల్లలైపోయాయి. రెండు రాష్ట్రాల్లోనూ ఊడవలేకపోయిన చీపురు మూలకూర్చుండిపోయింది. గుజరాత్ ఫలితాలతో ఆమ్ ఆద్మీ పార్టీకి జాతీయ పార్టీ హోదా రావడంతో ఆ పార్టీకి కాస్త బలం వచ్చినట్టయింది.

- రెండు రాష్ట్రాల్లోనూ మూలకూర్చున్న చీపురు
- జాతీయ పార్టీ హోదా దక్కడంతో పార్టీలో హుషారు

ఈ ఏడాది మొదట్లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ విజయకేతనం ఎగరవేయడంతో గుజరాత్‌లో కూడా ఆ పార్టీ ప్రబల శక్తిగా ఎదుగుతుందని అందరూ భావించారు. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా తన ఉనికిని చాటుతుందని అనుకున్నారు. కానీ రెండు రాష్ట్రాల్లోనూ ఆప్ ఎలాంటి ప్రభావాన్ని చూపించలేదు. ఆప్‌కి జాతీయ పార్టీ హోదా దక్కడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. రెండేళ్ల ముందు నుంచి రాష్ట్రంపై ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ గుజరాత్‌పై దృష్టి పెట్టడం, సూరత్ మున్సిపల్ ఎన్నికల్లో ఆప్ సత్తా చాటడంతో తొలిసారిగా రాష్ట్రంలో ముక్కోణపు పోటీ జరిగింది. అయితే మొదట్నుంచి ఆప్ కాంగ్రెస్‌నే విమర్శిస్తూ ఆ పార్టీ ఓటు బ్యాంకునే లక్ష్యంగా చేసుకోవడంతో నామమాత్రంగానే మిగిలిపోవాల్సి వచ్చింది. హిమాచల్ ప్రదేశ్‌లో కూడా ఆమ్ మొదట్లో విస్తృతంగా తిరిగినప్పటికీ అవినీతి ఆరోపణల కేసులో సత్యేంద్ర జైన్ అరెస్ట్‌తో ఆప్ ఆశలు వదిలేసుకుంది. గుజరాత్‌లో వివిధ మీడియా సంస్థల పోల్స్ కూడా ఆప్‌కి 20 శాతం వరకు ఓట్లు వస్తాయని అంచనా వేశాయి. కానీ ప్రధాని నరేంద్ర మోదీకి సొంత గడ్డ మీదనున్న క్రేజ్ ముందు కేజ్రీవాల్ నిలబడలేకపోయారు.

జాతీయ పార్టీ హోదా

''గుజరాత్ ప్రజలు మాకు జాతీయ పార్టీ హోదా కట్టబెట్టారు. ఇప్పటివరకు దేశంలో కొన్ని పార్టీలకు మాత్రమే ఆ హోదా ఉంది. నిజంగా ఇది మాకో అద్భుతమైన విజయం''.. గుజరాత్ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత అరవింద్ కేజ్రీవాల్ పంపిన సందేశమిది. జాతీయ పార్టీకి హోదా రావడానికున్న షరతుల్లో ఒకటైన నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలో 6శాతం ఓట్లు, కనీసం రెండు సీట్లలో గెలిచి ఉండాలి. ఇప్పటికే ఢిల్లీ, పంజాబ్‌లలో అధికారంలో ఉన్న ఆప్ గోవాలో 6శాతం ఓట్లు, 2 సీట్లను సాధించింది. ఇప్పుడు గుజరాత్‌లో అయిదు సీట్లను గెలుచుకొని, 13శాతం ఓట్లతో జాతీయ పార్టీ హోదాని దక్కించుకుంది.

దేశంలో ఉన్న జాతీయ పార్టీలివే..

మన దేశంలో ఇప్పటివరకు ఎనిమిది మాత్రమే జాతీయ పార్టీలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, నేషనల్ కాంగ్రెస్ పార్టీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీకి మాత్రమే ఈ గుర్తింపు ఉంది. ఆప్‌ని కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తిస్తే తొమ్మిదో జాతీయ పార్టీగా అవతరిస్తుంది.

జాతీయ హోదాతో వచ్చే మార్పులేంటి ?

- పార్టీకి జాతీయ హోదా వస్తే అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే ఎన్నికల గుర్తు లభిస్తుంది
- సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆకాశవాణి, దూరదర్శన్‌లో బ్రాడ్‌కాస్ట్, టెలికాస్ట్ బాండ్స్ లభిస్తాయి
- 40 మంది స్టార్ క్యాంపైనర్లు ప్రచారంలో పాల్గొనచ్చు. వారికయ్యే ఖర్చులు అభ్యర్థులకుండే ఖర్చుల పరిమితి నుంచి మినహాయిస్తారు.
- పార్టీ కార్యాలయాలు నిర్మించుకోవడానికి రాష్ట్రాల్లో ప్రభుత్వ జాగాలు లభిస్తాయి.
- అభ్యర్థులు నామినేషన్ వేసినప్పుడు ఒకరే ప్రాపోజర్ ఉంటే సరిపోతుంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

టీఆర్‌ఎస్ ఇక బీఆర్‌ఎస్!

పేరు మార్పునకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం | తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి పేరును భారత్ రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)గా మార్చాలన్న విజ్ఞప్తిని కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించింది. ఈ మేరకు టీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుకు కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎన్ భర్ నుంచి గురువారం లేఖ అందింది. తెలంగాణ రాష్ట్ర సమితి నుంచి భారత్ రాష్ట్ర సమితిగా పేరు మారుస్తూ ఈ ఏడాది అక్టోబర్ 5న పార్టీలో తీర్మానించి, కేంద్ర ఎన్నికల సంఘానికి రాసిన లేఖకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ పేరు మార్పిడికి సంబంధించిన ప్రక్రియలో భాగంగా నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు. కాగా, టీఆర్‌ఎస్ పేరును బీఆర్‌ఎస్‌గా మార్చేందుకు ఈసీ అంగీకరించడంతో శుక్రవారం మధ్యాహ్నం 1.20 గంటలకు ఆవిర్భావ కార్యక్రమం నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి అందిన అధికారిక లేఖపై ఈ ముహూర్తంలోనే సంతకం చేసి పంపిస్తారు. దీనితోపాటు భారత్ రాష్ట్ర సమితి పార్టీ పేరిట అధికారిక కార్యక్రమాలను కూడా ప్రారంభిస్తారు. తెలంగాణ భవన్ ఆవరణలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తారు.

యువకుడిపై బ్లేడుతో యువతి దాడి

- పెళ్లి విషయమై ప్రేమికుల మధ్య ఘర్షణ
- వివాహం చేసుకోమన్నందుకు మినీ కట్టర్‌తో ఆగ్రహంతో దాడి
- ఏకంగా బాధితుడికి 50 కుట్లు.. నిందితురాలిపై హత్యాయత్నం కేసు, అరెస్టు

హైదరాబాద్: పెళ్లి చేసుకోమని అడిగిన యువకుడిపై పదునైన బ్లేడుతో ఓ యువతి దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన నాదెండ్ల అశోక్ కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ యత్నాలు చేస్తున్నాడు. రాజమండ్రికి చెందిన లక్ష్మీసౌమ్య కూడా అదే రోడ్డులోని ఓ మహిళా హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగ వేటలోనే ఉంది. వీరిద్దరికీ స్థానికంగా ఉన్న టీ స్టాల్ వద్ద మొదలైన పరిచయం స్నేహంగా మారింది. ఇక ఈమధ్యనే తాను ప్రేమిస్తున్నాను, వివాహం కూడా చేసుకుంటాను అని చెప్పిన అశోక్ ఆమె ఖర్చులు కూడా భరిస్తూ వస్తున్నాడు. కాగా ఈ నెల 5వ తేదీన టీస్టాల్ వద్ద ఇద్దరూ కలిసిన సమయంలో అశోక్ పెళ్లి ప్రస్తావన తేగా వాగ్వివాదం చోటు చేసుకుంది. ఆగ్రహంతో ఊగిపోయిన లక్ష్మీ సౌమ్య తన దగ్గర ఉన్న బేడు(మినీ కట్టర్)తో అతనిపై దాడికి పాల్పడింది. ఈ దాడిలో అశోక్ ఎడమ చెంప నుంచి చెవి వరకు తీవ్రగాయమైంది. పోలీసులు నిందితురాలిపై హత్యాయత్నం కేసు కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పదునైన బ్లేడ్(మినీ కట్టర్)తో బలంగా దాడి చేయడంతో అశోక్ చెంపపై భాగంలో లోతైన గాయమైంది. 50 కుట్లు పడ్డాయి. నరాలు తెగిపోవడం వల్ల దవడ భాగంలో కొంతమేరకు పెరాలసిస్ వచ్చిందని, అధికంగా రక్తస్రావం కావడంతో రెండు ప్యాకెట్ల రక్తం ఎక్కించాల్సి వచ్చిందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాగలిగితే స్వాగతిస్తాం

- రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా చివరి నిమిషం వరకు పోరాడింది వైఎస్సార్‌సీపీనే
- ఉండవల్లి వ్యాఖ్యలు అసంబద్ధమైనవి
- రెండు రాష్ట్రాలు మళ్లీ కలవాలని సుప్రీం కోర్టు ఆదేశిస్తే అంతకన్నా కావాల్సింది ఏముంది?
- విభజన హామీల అమలుకు ఎంతవరకైనా పోరాడేది మా ప్రభుత్వమే
- సుప్రీం కోర్టులో అవకాశం వస్తే రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తాం
- అన్యాయాన్ని వెనక్కు తిప్పగలిగే అవకాశం ఉంటే ఆ ప్రయత్నం చేస్తాం
- కాలచక్రాన్ని వెనక్కి తిప్పలేమనుకుంటే.. న్యాయం చేయాలని పట్టుబడతాం
- జైలుకు వెళ్లడానికి లోకేశ్, చంద్రబాబుకు అంత తొందరెందుకు?
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



సాక్షి, అమరావతి: రెండు తెలుగు రాష్ట్రాలు కలిసిపోయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాగలిగితే ముందుగా స్వాగతించేది వైఎస్సార్‌సీపీనే అని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సజ్జల స్పందించారు. పదేళ్లపాటు ఎంపీగా పని చేసిన ఉండవల్లిపై గౌరవం ఉందని, కానీ ఆయన సగటు రాజకీయ నాయకుడి తరహాలో సీఎం వైఎస్ జగన్‌పై పనిగట్టుకుని అసంబద్ధంగా విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు. సుప్రీం కోర్టులో రాష్ట్రం తరఫున వాదిస్తున్న న్యాయవాది సాంకేతికంగా అన్న మాటలను వక్రీకరించడం తగదన్నారు. 'రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ విభజించిన సమయంలో ఉండవల్లి ఆ పార్టీ ఎంపీగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ చేసిన విభజనకు బీజేపీ మద్దతు ఇస్తే, టీడీపీ సహకరించి రాష్ట్రానికి అన్యాయం చేశాయి. రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా చివరి నిమిషం వరకు పోరాడింది ఒక్క వైఎస్సార్‌సీపీనే. ఎప్పుడైనా అవకాశం వస్తే అందరం కలిసుండాలని, ఉమ్మడి రాష్ట్రంగా ఉండాలని కోరుకుంటాం. వాస్తవికంగా చూస్తే.. విభజన జరిగి ఎనిమిదేన్నరేళ్లు అయింది. ఇంత దూరం వచ్చాక మళ్లీ రెండు రాష్ట్రాలు కలవడం సాధ్యమయ్యే పనేనా? తమిళనాడుతో విడిపోయిన మనం ఇప్పుడు తిరిగి చెన్నై కావాలంటే ఇస్తారా? ఇవ్వరన్నది ఉండవల్లికి కూడా తెలుసు. అసెంబ్లీ తీర్మానం, రాజ్యాంగంలో ఆర్టికల్–3 ప్రకారం విభజన జరగలేదని, రెండు రాష్ట్రాలు మళ్లీ కలవాలని సుప్రీం కోర్టు ఆదేశిస్తే అంతకంటే కావాల్సింది ఏముంది? దానిని తమ పార్టీనే మొదటగా స్వాగతిస్తుంది' అని చెప్పారు.

విభజన హామీల పరిష్కారం కోసం పోరాటం


విభజన హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తూనే ఉందని సజ్జల గుర్తు చేశారు. 'రాష్ట్రాన్ని అన్యాయంగా విభజన చేశారు. దీనిపై రాష్ట్ర ప్రజలతోపాటు మాకూ బాధగా ఉంది. మాకంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ బాధ ఎక్కువగా ఉంది. విభజన హామీలనైనా మరింత మెరుగ్గా ఇవ్వాల్సిన బాధ్యత నాటి కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఇప్పుడు వారు ప్రతిపక్షంలో ఉన్నారు కాబట్టి నేటి బీజేపీ ప్రభుత్వంపై ఆ బాధ్యత ఉంది. విభజన హామీల అమలుకు ఎంతవరకైనా పోరాడేది మా ప్రభుత్వమే. దానికి సుప్రీం కోర్టులో కేసు కూడా ఒక వేదికగా ఉపయోగపడితే.. రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని వివరిస్తాం. అన్యాయాన్ని వెనక్కు తిప్పగలిగే అవకాశం ఉంటే ఆ ప్రయత్నం చేస్తాం. కాలచక్రాన్ని వెనక్కి తిప్పలేము అనుకుంటే.. అన్యాయాన్ని సరిదిద్ది న్యాయం చేయాలని గట్టిగా పట్టుబడతాం. దాంట్లో దాపరికాలు, మొహమాటాలు లేవు. ముందు నుంచీ మేం ఓపెన్‌గా ఉన్నాం. అలా ఉండటం వల్లే నాడు తెలంగాణాలోనూ నష్టపోయాం. ఉమ్మడి రాష్ట్రం ఉంటే అక్కడ కూడా అధికారంలోకి వచ్చేవాళ్లం.' అని వివరించారు.

జైలుకెళ్లడానికి అంత తొందరెందుకు?

వైఎస్సార్‌సీపీ తరఫున ఎన్నికైన 85 వేల మంది బీసీ ప్రజాప్రతినిధులు బుధవారం ఒక చోట చేరి సీఎం వైఎస్ జగన్‌ను గౌరవించుకున్న తీరును చూసి టీడీపీ వణికిపోతోందని సజ్జల అన్నారు. తమ సాధికారతను బీసీలు ఉత్సవంలా నిర్వహించుకుంటే ఓర్వలేని టీడీపీ, పచ్చపత్రికలు విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. జయహో బీసీ మహాసభ తరహాలోనే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మహాసభలు కూడా నిర్వహిస్తామన్నారు. 2014–19 మధ్య చంద్రబాబు బీసీలకు చేసిందేమీ లేదని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ సమున్నత ప్రాధాన్యం ఇచ్చారు కాబట్టే వైఎస్సార్‌సీపీకి వారు వెన్నెముకగా నిలుస్తున్నారన్నారు. హైకోర్టులో కేసులు వేయించి స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లకు అడ్డుపడిందే చంద్రబాబు అని గుర్తు చేశారు. తమపై చేసిన ఆరోపణలను 24 గంటల్లోగా నిరూపించాలన్న లోకేశ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. లోకేశ్, చంద్రబాబుకు జైల్లో కూర్చోవాలని తొందరగా ఉంటే తామేమీ చేయలేమంటూ దెప్పిపొడిచారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో కేంద్ర దర్యాప్తు సంస్థ అన్ని ఆధారాలనూ సేకరించిందని, ఆ కుంభకోణంలో చంద్రబాబు, లోకేశ్ పాత్ర ఉన్నట్లు తేలిందని చెప్పారు.

బీసీలకు వెన్నుపోటే చంద్రబాబు డీఎన్‌ఏ

- బలహీన వర్గాల పంటలను దగ్ధం చేసిన డీఎన్‌ఏ చంద్రబాబులో ఉంది
- బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీనీ సీఎం జగన్ అమలు చేశారు
- చట్టం తెచ్చి మరీ నామినేటెడ్ పదవుల్లో 50% బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే ఇచ్చారు
- బీసీలను గౌరవించిన జగన్‌కు కృతజ్ఞతలు తెలపడానికే జయహో బీసీ సభ
- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు డీఎన్‌ఏలో ఉన్నది బీసీలు కాదని, బీసీలకు వెన్నుపోటు పొడవడమే ఉందని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి భూసమీకరణను వ్యతిరేకించిన బడుగు, బలహీన, వెనుకబడిన వర్గాల రైతుల భూముల్లో పచ్చని పంటలను దగ్ధం చేసిన డీఎన్‌ఏ చంద్రబాబులో ఉందంటూ దెప్పిపొడిచారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని ఎస్సీలను, తోకలు కత్తిరిస్తా, అంతు చూస్తానంటూ బీసీలను బెదిరించిన చంద్రబాబుకు 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన శాస్తి చేశారన్నారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని, కేబినెట్‌లో 11 మంది బీసీలకు స్థానం కల్పించారని గుర్తు చేశారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకే ఇచ్చేలా దేశంలో మొదటిసారిగా చట్టం తెచ్చి మరీ పదవులు ఇచ్చారని గుర్తు చేశారు. ఈ చారిత్రక చట్టాన్ని మార్చగలరా అంటూ సవాల్ విసిరారు. తమకు సమున్నత గౌరవాన్ని ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలపడం కోసం వైఎస్సార్‌సీపీ నుంచి ఎన్నికైన 85 వేల మంది బీసీలు ఈ ప్రభుత్వం మాది.. మనది అని నినదిస్తూ, జయహో బీసీ అంటూ బుధవారం విజయవాడలో మహాసభ నిర్వహిస్తే.. ఓర్వలేక టీడీపీ నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. బీసీలకు సీఎం వైఎస్ జగన్ రూ.1.63 లక్షల కోట్ల ప్రయోజనం చేకూర్చారన్నారు. అమ్మ ఒడి, విద్యా దీవెన వంటి పథకాల ద్వారా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నారని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఉన్నత ఉద్యోగాలు పొందేలా చేస్తున్నారని కొనియాడారు. అందుకే బీసీలు వైఎస్సార్‌సీపీకి వెన్నెముకలా నిలుస్తున్నారని చెప్పారు. ఇస్త్రీ పెట్టెలు వంటివి ఇచ్చి బీసీలు కులవృత్తుల్లోనే మగ్గిపోవాలనే బూర్జువా మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. చంద్రబాబుకు భజన చేయడం కోసం టీడీపీలోని బీసీ నేతలు తమను విమర్శిస్తే.. సోదరుడినే కించపరుచుకున్నట్లు అవుతుందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు బీసీ మంత్రులు ఆయన భుజంపై చేయి వేసుకొని మాట్లాడేవారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో టీడీపీ బీసీ మంత్రులు ఏం చేయగలిగారో.. మూడున్నరేళ్లలో నేను ఏం చేయలేదో చెప్పాలని నిలదీశారు. ఐదేళ్లలో బీసీలకు మీరేం చేశారో, మూడున్నరేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఏం చేశారో చర్చకు సిద్ధమా అని చంద్రబాబుకు సవాల్ విసిరారు. రెండు రాష్ట్రాలు కలిసే ప్రతిపాదన వస్తే స్వాగతిస్తామని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి బొత్స చెప్పారు. విభజన హామీల సాధనకు పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు.

సజ్జల వ్యాఖ్యల వెనుక మోదీ కుట్ర!
తెలంగాణ

అవకాశం వచ్చినప్పుడల్లా తెలంగాణపై మోదీ విషం: పల్లా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ సహా అవకాశం చిక్కిన ప్రతీ సందర్భంలోనూ అనేకమంది రాష్ట్రంపై విషం చిమ్ముతున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఆంధ్రప్రదేశ్ పునర్విభజనపై విషం చిమ్మేలా మాట్లాడారని, ఆయన వ్యాఖ్యల వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆరోపించారు. ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశంతో కలసి గురువారం టీఆర్‌ఎస్ఎల్పీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తల్లిని చంపి బిడ్డను వేరు చేశారని మాట్లాడిన మోదీ దన్నుతోనే గతంలో చంద్రబాబు, ప్రస్తుతం సజ్జల మాట్లాడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌ను ఎదుర్కొనేందుకు బీజేపీ కేఏపాల్‌తో సహా అనేక బాణాలను వదులుతోందన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఓర్వలేని వారు ప్రజల నడుమ చిచ్చుపెట్టేందుకు చూస్తున్నారని విమర్శించారు. ఏపీలో తెలంగాణను విలీనం చేస్తారనే మాటలు మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు ఏ విషయంపైనా అవగాహన లేదని, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలకు బీజేపీతో పాటు గవర్నర్ కూడా శిక్షణ ఇస్తున్నారని పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీతో కలిసి కేసీఆర్ కుట్ర

- బండి సంజయ్ ఆగ్రహం

మల్లాపూర్ (కోరుట్ల): కవిత లిక్కర్ స్కామ్ పక్కకు పోయేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సీఎం కేసీఆర్ కుట్ర చేస్తున్నాడని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. జగిత్యాల జిల్లాలో ప్రజా సంగ్రామ యాత్ర చేస్తున్న సంజయ్..ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. ఇది ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి ఆడుతున్న డ్రామా అని విమర్శించారు. కమీషన్ల ఒప్పందంతో స్కామ్‌లను పక్కకు తప్పించేందుకే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ సెంటిమెంట్ రగిల్చేందుకు కుట్ర

లిక్కర్ స్కాంలో కవితకు ఈడీ నోటీసులు ఇస్తే, తెలంగాణ సెంటిమెంట్‌ను రగిల్చేందుకు కేసీఆర్, టీఆర్‌ఎస్ నేతలు కుట్ర చేస్తున్నారని సంజయ్ ఆరోపించారు. రూ.లక్ష కోట్లు దోచుకుని లిక్కర్ దందా చేసి అడ్డంగా దొరికిన కేసీఆర్ బిడ్డ కోసం తెలంగాణ ప్రజలు ఎందుకు ఉద్యమించాలని ప్రశ్నించారు. లిక్కర్, డ్రగ్స్, క్యాసినో, అవినీతి కేసుల్లో కేసీఆర్ కుటుంబం కూరుకుపోయిందన్నారు. అవినీతిపరుల అంతుచూసేందుకు మోదీ సర్కారు చర్యలు ప్రారంభించిందని.. కేసీఆర్‌ను, ఆయన కొడుకు, బిడ్డను త్వరలోనే జైలుకు పంపుతామని వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

విజయవాడ రైల్వే డివిజన్‌కు నాలుగు అవార్డులు

సాక్షి, అమరావతి/రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ, కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ ప్రకటించిన నేషనల్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డులలో దక్షిణ మధ్య రైల్వే పలు విభాగాల్లో 7 అవార్డులు సాధించగా, అందులో 4 అవార్డులు విజయవాడ డివిజన్‌కు దక్కాయి. అత్యుత్తమ ఇంధన పొదుపు చర్యలు చేపట్టినందుకుగానూ కేంద్ర ఇంధన శాఖ ఈ అవార్డులను గురువారం ప్రకటించింది. 2022 సంవత్సరానికి గానూ విజయవాడ డివిజన్‌లోని విజయవాడ, తెనాలి, రాజమండ్రి స్టేషన్‌లతో పాటు విజయవాడ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రెనింగ్ సెంటర్)లు అవార్డులకు ఎంపికయ్యాయి. జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవం అయిన డిసెంబర్ 14న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డులను సాధించినందుకుగానూ విజయవాడ డివిజన్ ఇంధన విభాగం అధికారులు, సిబ్బందిని డీఆర్ఎం శివేంద్ర ద్వివేది ప్రత్యేకంగా అభినందించారు.

గుంటూరు డీఐజీని అభినందించిన డీజీపీ



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మను అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో జాతీయ పోలీసు అకాడమీ నిర్వహించిన ట్రై అథ్లాన్ పోటీల్లో గుంటూరు రేంజ్ డీఐజీ త్రివిక్రమ వర్మ విజేతగా నిలిచారు. ఆయన ఒక కిలోమీటర్ స్విమ్మింగ్, 40 కిలోమీటర్ల సైక్లింగ్, 10 కిలోమీటర్ల రన్నింగ్ ఈవెంట్లను నిర్దేశిత సమయం కంటే ముందుగా పూర్తి చేసి గెలుపొందారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో రాజేంద్రనాథ్‌రెడ్డిని త్రివిక్రమవర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. డీఐజీ త్రివిక్రమవర్మకు పతకాన్ని అందించి డీజీపీ అభినందించారు.

సామాజిక బాధ్యతతోనే జర్నలిజంలో ఒత్తిళ్లు

- ప్రభుత్వ సలహాదారు జీవీడీ కృష్ణమోహన్



జీవీడీ కృష్ణమోహన్‌ను సత్కరిస్తున్న కొమ్మినేని, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జర్నలిజంలో ఒత్తిళ్లు వ్యక్తిగతమైనవి కావని, సామాజిక బాధ్యతతో కూడుకున్నవని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్) జీవీడీ కృష్ణమోహన్ పేర్కొన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో 'జర్నలిస్టులు మానసిక ఒత్తిడులు-పరిష్కార మార్గాలు' అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీవీడీ కృష్ణమోహన్ మాట్లాడుతూ బాధ్యతతో ఒత్తిళ్లు స్వీకరిస్తున్న వారిలో జర్నలిస్టులదే అగ్రస్థానమని అన్నారు. ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియా రాకతో జర్నలిస్టుల్లో ఒత్తిడి మరింత పెరిగిందన్నారు. ఒత్తిళ్లు ఎలా ఎదుర్కోవాలో తెలియజేసేందుకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 'ఈ స్థితి శాశ్వతం కాదన్న' గీతాచార్యుడు చెప్పిన ఒక్క వాక్యాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. జీవీడీ కృష్ణమోహన్‌ను యూనియన్ ప్రతినిధులు సత్కరించారు. ఐజేయూ ఉపాధ్యక్షుడు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు కె.జయరాజు, చావా రవి, ఎస్‌కే బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపెట్ డైరెక్టర్ శేఖర్‌కు డాక్టరేట్



సాక్షి, అమరావతి: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) విజయవాడ డైరెక్టర్ సీహెచ్ శేఖర్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. సీపెట్‌లో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన 25 సంవత్సరాల సర్వీసులో వివిధ బాధ్యతలను నిర్వర్తించారు. విధులను నిర్వహిస్తూనే ఎంటెక్, అనంతరం పీహెచ్‌డీని పూర్తిచేసి డాక్టరేట్ సాధించారు. ఈ సందర్భంగా గురువారం సంస్థలోని ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లకు రుణాలా!?

- అలాంటి ప్రతిపాదనేదీ ప్రభుత్వానికి ఇవ్వలేదు
- రూ.1,850 కోట్లు రుణం తీసుకుంటున్నామనడం అవాస్తవం
- కొత్త టెక్నాలజీతో డిస్కంలకు, వినియోగదారులకు ప్రయోజనం
- కరెంటు బిల్లు కట్టలేదని సరఫరా నిలిపివేసే పరిస్థితి రాదు
- మీటర్ల ఏర్పాటు నిర్ణయంపై ఎలాంటి విమర్శలు రాలేదు.. పారదర్శకంగా టెండర్లు నిర్వహించి నాణ్యమైన మీటర్లిస్తాం
- విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన విద్యుత్‌ను అందించాలనే లక్ష్యంతో రాష్ట్రంలో తలపెట్టిన స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ఎటువంటి రుణాలు తీసుకోవడంలేదని ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు 'సాక్షి'కి స్పష్టం చేశాయి. రూ.1,850 కోట్లు రుణం తీసుకునేందుకు అనుమతించాలని ప్రభుత్వాన్ని డిస్కంలు కోరాయనడంలో ఎలాంటి నిజంలేదని అవి తేల్చిచెప్పాయి. 'స్మార్ట్‌గా భారం' శీర్షికన 'ఈనాడు' గురువారం ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవమని ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె. సంతోషరావు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె. పద్మజనార్దనరెడ్డి గురువారం ఖండించారు. పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) కింద అన్ని రాష్ట్రాల్లోనూ మీటర్లను అమర్చుతున్నారని.. అందులో భాగంగా రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు 23 శాతం మీటర్లకు మాత్రమే ప్రీపెయిడ్ మీటర్లు (స్మార్ట్ మీటర్లు) అమర్చేందుకు ప్రాజెక్టు ప్రతిపాదనలు తయారుచేశాయని వారు వివరించారు. దీనిలో భాగంగా ప్రాజెక్టు అమలుకోసం కొత్తగా ఎలాంటి రుణాలు చేయడం లేదని.. అదే విధంగా గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఇంతవరకూ ఎటువంటి విమర్శలు విద్యుత్ సంస్థల వరకూ రాలేదని వారు తెలిపారు. మీటర్ల నాణ్యతలో రాజీపడకుండా అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని సీఎండీలు వెల్లడించారు.

పారదర్శకంగా టెండర్లు

ఇక రాష్ట్రంలో మొత్తం 1.92 కోట్ల మంది విద్యుత్ వినియోగదారులకు దశల వారీగా స్మార్ట్‌మీటర్లను అమర్చనున్నట్లు సీఎండీలు తెలిపారు. తొలిదశకు సంబంధించి టెండర్ల ప్రక్రియ మొదలైందని.. ఈ టెండర్ల ప్రక్రియలో కేంద్ర ఇంధన శాఖ రూపొందించిన నిబంధనలను పాటిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ సంస్థలన్నీ అవే నిబంధనల్ని అనుసరిస్తున్నాయని.. దీని ప్రకారం టెండర్లలో పాల్గొనే సంస్థలు కేంద్ర ఇంధన శాఖ ఆమోదం పొందాలన్నారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో నమోదు ప్రక్రియను పూర్తిచేసి ఆమోదం పొందిన 29 సంస్థల వివరాలను రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఈసీ) వెబ్‌సైట్‌లో ఉంచారని వారు చెప్పారు. టెండరు నిబంధనలను ఇష్టానుసారం మార్చేందుకు వీల్లేదని వివరించారు.

నెలనెలా చెల్లింపులు..

మరోవైపు.. మీటర్ ధర, దాని నిర్వహణకయ్యే ఖర్చును ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరంలేదని వారన్నారు. టెండర్ దక్కించుకున్న సంస్థకు ఆ మొత్తాన్నీ పదేళ్లపాటు ప్రతినెలా డిస్కంలు చెల్లిస్తాయన్నారు. తొలి విడత మీటర్ల ఏర్పాటుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.1,658 కోట్లకు, పశ్చిమ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.947 కోట్లు, మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రూ.1,508 కోట్లు వ్యయ అంచనాలను రూపొందించి సాంకేతిక, పరిపాలన, డీఆర్సీ, మంత్రిమండలి అనుమతి పొందాయని వివరించారు. అలాగే, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన పత్రాలను న్యాయ సమీక్షకు పంపగా జ్యూడీషియల్ అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. దీంతో టెండర్ ప్రక్రియను ప్రారంభించాయని.. ఈ మొత్తం వ్యయంలో ఎటువంటి భారం వినియోగదారులపై పడదని వారు స్పష్టంచేశారు.

కేంద్ర నిబంధనల మేరకే..

పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్‌డీఎస్ఎస్) గతేడాది జూలై 20న ప్రారంభమైంది. నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్ పంపిణీ, వాణిజ్య నష్టాలు 12–15 శాతం తగ్గించడం ఈ పథకం ముఖ్యోద్దేశం. ఇందులో భాగంగా ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లను ఏర్పాటుచేయడం.. విద్యుత్ పంపిణీ ఫీడర్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు స్మార్ట్‌మీటర్లు అమర్చాలనే నిబంధనలు విధించారు. కేంద్రం జారీచేసిన మార్గదర్శకాలను అనుసరించి దేశవ్యాప్తంగా అన్ని విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ పనులు చేపట్టాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలోని మూడు డిస్కంలు ప్రీ పెయిడ్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు ప్రణాళికలను పంపి కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆమోదం పొందాయి. ఈ పథకం కింద డిసెంబర్ 2023లోగా ఏర్పాటుచేసిన ఒక్కో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్‌కు రూ.900లు గ్రాంట్ రూపంలోనూ, అదనంగా రూ.450లు ఇన్సెంటివ్ రూపంలోనూ కేంద్రం నుంచి ప్రోత్సాహకాలు లభిస్తాయి.. అని సీఎండీలు వివరించారు.

డిస్కంలకు, వినియోగదారులకు మేలు

నిజానికి.. కొత్త టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా డిస్కంలకు, వినియోగదారులకు పలు ప్రయోజనాలున్నాయి.

- ముఖ్యంగా ఈ మీటర్ల ద్వారా వినియోగదారుని బిల్లును ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- బిల్లు మొత్తాన్ని ఒకేసారి కాకుండా అవసరాన్ని బట్టి బిల్లును చెల్లించుకునే వెసులుబాటు ఉంది.
- విద్యుత్ ఏ సమయాల్లో సరఫరా అవుతోంది.. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోందా లేదా.. అనే సమాచారాన్ని కచ్చితంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.
- ఇక విద్యుత్ బిల్లు కట్టలేదని లైన్‌మెన్ కరెంట్ స్తంభం ఎక్కి కరెంట్‌ను నిలిపివేయాల్సిన అవసరం ఉండదు.
- డిస్కంల పరిధిలో విద్యుత్ చౌర్యాన్ని అడ్డుకునేందుకు ఆస్కారం దొరుకుతుంది.

బాబు అండ్‌కో అమరావతి భూ మాఫియా

- 802వ రోజు రిలే నిరాహార దీక్షలో బహుజన నేతలు



దీక్షలో పాల్గొన్న బహుజన జేఏసీ నాయకులు

తాడికొండ: అమరావతి చుట్టుపక్కల భూములు కొనుగోలు చేసింది చంద్రబాబు, ఆయన బినామీలు, కులవాదులేనని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రద్దు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 802వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా దీక్షలో పలువురు నాయకులు మాట్లాడుతూ తక్కువ ధరలకు భూములు కొనుగోలు చేసి అప్పనంగా దోచేసేందుకు వేసిన ఎత్తుగడలు బెడిసికొట్టడంతో దొంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టారని మండిపడ్డారు. 'కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగడు' అన్న చందంగా.. బాబును ముఖ్యమంత్రిని చేసేందుకు పవన్ కళ్యాణ్ యాత్రల పేరుతో బయలుదేరడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో బాబు, ఆయనకు వత్తాసు పలుకుతున్న తోక పార్టీలకు తగిన శాస్తి తప్పదని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాము పాల్గొన్నారు.

సీపీఐ కార్యక్రమాలకు అనుమతివ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- శాంతియుతంగా నిర్వహించాలని సీపీఐకి స్పష్టీకరణ

సాక్షి, అమరావతి: కడప ఉక్కు పరిశ్రమ సాధన కోసం ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు సీపీఐ నిర్వహించే పాదయాత్ర, బహిరంగ సభకు అనుమతి నివ్వాలని హైకోర్టు గురువారం పోలీసులను ఆదేశించింది. రోడ్లపై ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకూడదని, కార్యక్రమాలను శాంతియుతంగా నిర్వహించాలని నిర్వాహకులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. తాము చేపట్టిన కార్యక్రమాలకు అనుమతి కోరుతూ పోలీసులకు వినతిపత్రం సమర్పించినా, ఎలాంటి నిర్ణయం తెలపలేదంటూ సీపీఐ వైఎస్సార్ జిల్లా కార్యదర్శి గాలి చంద్రం గురువారం లంచ్‌మోషన్ రూపంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరిపారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి వాదనలు వినిపిస్తూ, శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పూర్తి వివరాలను సమర్పించామని చెప్పారు. కేవలం 100 మందితోనే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ న్యాయవాది (హోం) టీఎంకే చైతన్య స్పందిస్తూ.. పిటిషనర్ వినతిని పరిశీలిస్తున్నామని, నిర్ణయానికి ఇంకా సమయం ఉందని చెప్పారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ.. పబ్లిక్ ఆర్డర్‌కు విఘాతం కలుగుతుందన్న అనుమానం, ఆధారాలు ఉంటే అనుమతిని నిరాకరించవచ్చునని, అలాంటి పరిస్థితులు లేనప్పుడు ఏవో కారణాలతో అనుమతిని నిరాకరించడం సరికాదని చెప్పారు.

కళలు, సంస్కృతి పేరుతో వైషమ్యాలను రెచ్చగొట్టకూడదు

- నాటకం పేరుతో ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకోవడం మంచిది కాదు
- హక్కుల పేరుతో ఎలా పడితే అలా వ్యవహరిస్తామంటే కుదరదు
- చింతామణి నాటకంపై తేల్చి చెప్పిన హైకోర్టు..
- తుది విచారణ 29కి వాయిదా

సాక్షి, అమరావతి: కళలు, సంస్కృతి పేరుతో వర్గ వైషమ్యాలను రెచ్చగొడుతుంటే చూస్తూ ఊరుకోబోమని హైకోర్టు స్పష్టం చేసింది. నాటకంలో పాత్ర పేరుతో ఓ వర్గం వారికి చెడును ఆపాదిస్తూ, ఫలానా రకమైన వ్యసనపరులుగా ముద్ర వేయడం సరికాదని చెప్పింది. దీనివల్ల మంచికి బదులు చెడు జరిగే ప్రమాదం ఉందంది. అలా ముద్ర వేయడం వల్ల ఆ వర్గం వారు ఎంత ఇబ్బంది పడతారో గమనించాలని తెలిపింది. హక్కుల పేరుతో ఎలా పడితే అలా వ్యవహరిస్తామంటే కుదరదని స్పష్టంచేసింది. ఎవరి హక్కులు ఏమిటో, చింతామణి నాటకం ప్రదర్శన నిషేధం సరైనదో కాదో తేలుస్తామంది. తుది విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర ద్వారా ఆర్యవైశ్యులను వేశ్యాలోలురుగా చూపుతున్నారని, ఈ నాటకాన్ని నిషేధించాలన్న ఆర్య వైశ్య సంఘాల వినతి మేరకు ప్రభుత్వం ఆ నాటక ప్రదర్శనపై నిషేధం విధించింది. దీనిని సవాలు చేస్తూ నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు, కళాకారుడు త్రినాథ్ హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై సీజే ధర్మాసనం గురువారం మరోసారి విచారణ జరిపింది. రఘురామకృష్ణరాజు తరఫు న్యాయవాది పీవీజీ ఉమేశ్‌చంద్ర వాదనలు వినిపిస్తూ, నాటక ప్రదర్శనపై నిషేధం వల్ల కళాకారుల ప్రాథమిక హక్కులకు విఘాతం కలుగుతోందన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. ప్రాథమిక హక్కులు కళాకారులకే కాదని, నాటకం వల్ల ప్రభావితమవుతున్న వ్యక్తులకు కూడా ఉంటాయని గుర్తు చేసింది. ఈ సమయంలో ప్రభుత్వ న్యాయవాది పోతిరెడ్డి సుభాష్ స్పందిస్తూ.. నాటకం ద్వారా ఆర్యవైశ్యులను కించపరుస్తున్నారనేందుకు ఆధారాలున్నాయని, ఆర్యవైశ్యుల మనోభావాలను పరిగణనలోకి తీసుకునే ప్రభుత్వం నిషేధం విధించిందని చెప్పారు. ఆర్యవైశుల తరఫు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ స్పందిస్తూ.. 1923లో అప్పటి సాంఘిక దురాచారాల ఆధారంగా చింతామణి నాటకాన్ని రాశారని తెలిపారు. వ్యక్తులు వేశ్యాలోలురుగా మారడం వల్ల కలిగే అనర్థాలను నాటకంలో వివరించారని, సుబ్బిశెట్టి పాత్ర ద్వారా సందేశం ఇచ్చారని తెలిపారు. అయితే 1923 నాటి పరిస్థితులు 2022లో లేవన్నారు. అయినా సుబ్బిశెట్టి పాత్ర ద్వారా ఆర్యవైశ్యులను చెడుగా చిత్రీకరిస్తున్నారని తెలిపారు.

16న బెంగళూరులో శ్రీనివాస కల్యాణం



గరుడ వాహనంపై మలయప్ప స్వామి

తిరుపతి అలిపిరి/తిరుమల: బెంగళూరు మహానగరంలోని రామనగర స్టేడియంలో ఈ నెల 16వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు టీటీడీ జేఈవో సదాభార్గవి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఆమె అధికారులతో కలసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.

వైభవంగా పౌర్ణమి గరుడ సేవ

తిరుమల శ్రీవారి ఆలయంలో గురువారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి గరుడునిపై ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు నాలుగు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 51,376 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో భక్తులు రూ.4.60 కోట్లు సమర్పించారు. దర్శన టోకెన్లు లేని భక్తులకు 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

సరైన దిశలోనే సుబ్రహ్మణ్యం హత్య కేసు దర్యాప్తు

- దర్యాప్తును ప్రభావితం చేశారనేందుకు ఆధారాలు సమర్పించలేదు
- సీబీఐకి అప్పగించాల్సిన పరిస్థితులు ఈ కేసులో లేవు
- హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వ న్యాయవాది మహేశ్వరరెడ్డి
- విచారణ 12కి వాయిదా

సాక్షి, అమరావతి: డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో దర్యాప్తు సరైన దిశలోనే సాగుతోందని హోంశాఖ తరఫు ప్రభుత్వ న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి హైకోర్టుకు నివేదించారు. దర్యాప్తును ఎవరూ ప్రభావితం చేయడంలేదని, ఈ విషయంలో పిటిషనర్లు ఎలాంటి ఆధారాలను కోర్టు ముందుంచలేదని చెప్పారు. అసాధారణ, ప్రత్యేక పరిస్థితుల్లోను, దర్యాప్తు సక్రమంగా సాగనప్పుడు, నిందితులే హత్య చేశారనేందుకు ప్రాథమిక ఆధారాలున్నా కూడా పోలీసులు పట్టించుకోనప్పుడు మాత్రమే దర్యాప్తును న్యాయస్థానం సీబీఐకి అప్పగించాల్సి ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని పలు తీర్పుల్లో సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని తెలిపారు. ఈ కేసులో అలాంటి పరిస్థితులేవీ లేవన్నారు. సీసీ టీవీ ఫుటేజీపై ఫోరెన్సిక్ నివేదిక రాగానే ఆ వీడియోలో ఉన్న వారిని సైతం నిందితులుగా చేరుస్తామని చెప్పారు. పోలీసు వ్యవస్థ మొత్తాన్ని కించపరిచేలా, పోలీసుల మనోస్థైర్యం దెబ్బతినేలా పిటిషనర్లు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రమాదం వల్ల చనిపోయాడని ఎమ్మెల్సీ చెప్పడంతో ఆ దిశగా మొదట దర్యాప్తు సాగిందని, దీంతో కస్టడీ పిటిషన్ వేయడంలో కొంత జాప్యం జరిగిందన్నారు. ఆ తరువాత దర్యాప్తు సరైన కోణంలోనే వెళుతోందన్నారు. ఇది సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సినంత అసాధారణ కేసు కాదని అన్నారు. ప్రాథమికంగా అందిన సమాచారం ఆధారంగా మొదట సీఆర్‌పీసీ సెక్షన్ 174 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని, ఆ తరువాత ఇంక్వెస్ట్ నివేదిక ఆధారంగా అదే ఎఫ్ఐఆర్‌ను సవరించి ఐపీసీ సెక్షన్లను జత చేసి కేసు రీ రిజిస్టర్ చేశామన్నారు. ఏ ఆధారాలతో అదే ఎఫ్ఐఆర్ నెంబర్‌తో కేసు రీ రిజిస్టర్ చేశారో తమ ముందుంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 12కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సుబ్రహ్మణ్యం హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరుతూ మృతుని తల్లిదండ్రులు నూకరత్నం, సత్యనారాయణ దాఖలు చేసిన వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ రఘునందన్‌రావు గురువారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, ఎమ్మెల్సీ అనంతబాబు, ఆయన భార్య, ఇతరుల సమక్షంలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య జరిగిందని, సీసీ టీవీలో వారు స్పష్టంగా కనిపిస్తున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావడంతో పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడంలేదన్నారు. ఈ వాదనలను మహేశ్వరరెడ్డి తోసిపుచ్చారు. ఈ వ్యాజ్యంలో తనను ప్రతివాదిగా చేర్చాలంటూ అనంతఉదయభాస్కర్ భార్య లక్ష్మీదుర్గ చేసిన అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. అనంతబాబు ఇంప్లీడ్ దాఖలు చేయడానికి అర్హుడని తేల్చి చెప్పారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఆక్వా రైతులను ఆదుకోండి

కేంద్రానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విజ్ఞప్తి



సాక్షి, న్యూఢిల్లీ: వ్యవసాయరంగం మాదిరిగానే ఆక్వా ఉత్పాదనలకు కనీస మద్దతుధర, ఇన్‌పుట్ సబ్సిడీ కల్పించి ఆక్వా రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆక్వా ఉత్పాదన నిల్వలు వృథాకాకుండా స్టోరేజి సౌకర్యాలను మరింతగా మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన గురువారం రాజ్యసభలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా దేశంలో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులను వివరించారు. విపరీతంగా పెరిగిన ఇన్‌పుట్ సరుకుల ధరలు, ఎగుమతుల్లో భారీగా క్షీణించిన ధరలు, ఆక్వా ఉత్పాదనలను పెద్దఎత్తున దిగుమతి చేసుకునే యూరప్, అమెరికాల్లో దిగుమతి సుంకాల పెంపు, ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగా అస్తవ్యస్తంగా మారిన సరఫరా వ్యవస్థ వంటి కారణాలతో భారత ఆక్వారంగం దాదాపు రూ.25 వేల కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని చెప్పారు. ఈ నేపథ్యంలో అమ్ముడుపోకుండా మిగిలిన ఆక్వా ఉత్పాదనల నిల్వలు గణనీయంగా పెరిగిపోయాయని తెలిపారు. నిల్వచేసేందుకు తగినన్ని కోల్డ్‌స్టోరేజి సౌకర్యాలు లేక చేతికొచ్చిన ఆక్వా పంట కుళ్లిపోయి రైతులకు భారీనష్టాలను కలిగించిందని వివరించారు. ఆక్వా రంగం ఇలాంటి సంక్షోభాల బారిన పడకుండా పటిష్టం చేయడంపైనే భారత నీలివిప్లవం భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. ఎగుమతుల ద్వారా బిలియన్ల డాలర్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జిస్తూ లక్షలాది కుటుంబాలకు జీవనోపాధిని కల్పిస్తున్న ఆక్వా రంగం భవిష్యత్తు ఇప్పుడు ప్రమాదంలో పడిందన్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణమే ఆక్వా రైతుల్ని ఆదుకుని వారికి ఊరట కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు. ఆక్వా ఉత్పాదనలను అధికంగా దిగుమతి చేసుకునే దేశాలతో సంప్రదింపులు జరిపి దిగుమతి సుంకాలను తగ్గించేలా, ఆక్వా దిగుమతులపై ఆంక్షలను సరళతరం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

జీ–20 వేదికపై మన సంస్కృతిని చాటుతాం

భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని ప్రచారం చేసేందుకు జీ–20 వేదికను వినియోగిస్తామని కేంద్ర సాంస్కృతికశాఖ సహాయమంత్రి మీనాక్షి లేఖి చెప్పారు. రాజ్యసభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నలకు మంత్రి జవాబిచ్చారు. జీ–20 వేదికపై భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబింపజేసే దిశగా ప్రభుత్వం భాగస్వామ్య దేశాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.

ఖేలో ఇండియాతో క్రీడల అభివృద్ధి



ఖేలో ఇండియా పథకంలో భాగంగా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ ఏటా నిర్వహిస్తూ ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో క్రీడలు, వాటికి సంబంధించిన మౌలిక సదుపాయాల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్ర క్రీడాశాఖ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ జవాబిచ్చారు.

ఏపీ క్యాట్ హైదరాబాద్‌లోనే

ఏపీ, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు హైదరాబాద్‌లోని క్యాట్ సేవలందిస్తోందని కేంద్ర సిబ్బంది శిక్షణ వ్యవహారాల శాఖ సహాయమంత్రి జితేంద్రసింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు జవాబిచ్చారు.

ఎన్‌సీఏపీ ద్వారా మెరుగైన గాలి నాణ్యత

నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం ద్వారా చేపట్టిన చర్యలతో ఆంధ్రప్రదేశ్‌లోని 11 పట్టణాల్లో గాలి నాణ్యత మెరుగైందని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి అశ్వినీకుమార్ చౌబే.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.


లోక్‌సభ

రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయమే ప్రధానం

నదుల అనుసంధానంపై కేంద్ర మంత్రి షెకావత్

సాక్షి, న్యూఢిల్లీ: నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే క్రమంలో రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయసాధనే ప్రధానమని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ చెప్పారు. ఈ ప్రక్రియ పూర్తిలో రాష్ట్రాలే ప్రధాన భూమిక పోషించాలన్నారు. అనుసంధానంపై రాష్ట్రాలతో కేంద్రం విస్తృత సంప్రదింపులు జరుపుతోందని వెల్లడించారు. లోక్‌సభలో గురువారం వైఎస్సార్‌సీపీ ఎంపీలు గోరంట్ల మాధవ్, తలారి రంగయ్య, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఎంపీలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. మహానది, బ్రహ్మపుత్ర బేసిన్‌లోని మిగులు జలాలను గోదావరికి తరలించి, అటు నుంచి గోదావరి నీటిని కృష్ణా, పెన్నా, కావేరిలకు తరలించాలని ప్రభుత్వ ప్రతిపాదనగా ఉందని చెప్పారు. అయితే మహానది–గోదావరి, గోదావరి–కృష్ణా అనుసంధాన ప్రక్రియపై ఏకాభిప్రాయం కుదరనందున ఈ అంశం పెండింగ్‌లో ఉందని తెలిపారు. గోదావరిలో ఉన్న మిగులు జలాలను, ఇంద్రావతిలో వినియోగించలేని జలాలను మళ్లిస్తూ గోదావరి (ఇచ్చంపల్లి)–కావేరి (గ్రాండ్ ఆనకట్ట) అనుసంధానించే ప్రత్యామ్నాయ అధ్యాయాన్ని జాతీయ జలవనరుల సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) పూర్తిచేసిందని వివరించారు. గోదావరి–కావేరి అనుసంధానంతో మొత్తంగా బేసిన్‌లోని 9.44 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరందించవచ్చని, ఇందులో తెలంగాణ, ఏపీ, తమిళనాడుల్లోని 6.23 లక్షల హెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు అందడంతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లోని 1.88 కోట్ల ప్రజల పారిశ్రామిక, గృహ అవసరాలు తీరతాయని చెప్పారు.

ఏపీలో 497 ఎంఎస్ఎంఈ అప్లికేషన్లు పెండింగ్



ఆంధ్రప్రదేశ్‌లో ఆలస్యమైన చెల్లింపులకు సంబంధించి రూ.481.89 కోట్ల విలువైన 497 అప్లికేషన్లు మైక్రో స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ సహాయమంత్రి భానుప్రతాప్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు చింతా అనూరాధ, వంగా గీతావిశ్వనాథ్, మిథున్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

పోలవరం నిధుల కోసం పలు వినతులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చాలని ఏపీ ప్రభుత్వం నుంచి పలు వినతులు వచ్చాయని కేంద్ర జలశక్తి శాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్‌తుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కోటగిరి శ్రీధర్ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. పోలవరం ప్రాజెక్టును మార్చి 2024 నాటికి, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌ను జూన్, 2024 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ 2020, 2022లో వచ్చిన వరదల కారణంగా కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెప్పారు. 2–18–18 ధరల ప్రకారం అంచనా వ్యయం రూ.47,725.74 కోట్లు అని, అనంతరం కేంద్రంస్థాయిలో ప్రాజెక్టు నిమిత్తం అంచనా వ్యయం లేదని పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ.13,226.04 కోట్లు రీయింబర్స్ చేశామని, ఏపీ ప్రభుత్వం రూ.483 కోట్లు రీయింబర్స్ చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీని కోరిందని చెప్పారు.

బంధుప్రీతి, రాజకీయాలతో క్రీడలు నాశనం

క్రీడల్లో బంధుప్రీతి, రాజకీయాల వల్లే ఆ రంగం నాశనమైందని వైఎస్సార్‌సీపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అభిప్రాయపడ్డారు. లోక్‌సభలో గురువారం క్రీడాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రపంచస్థాయి వసతులు, ఒలింపిక్స్ స్థాయి శిక్షకులు ఉన్నారా అని కేంద్రాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడల్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

మహిళలకు ప్రత్యేక స్లీపర్‌క్లాస్ ట్రైన్ ఏర్పాటు చేయాలి

మహిళల భద్రత, సురక్షిత ప్రయాణం నిమిత్తం ప్రత్యేక స్లీపర్ క్లాస్ ట్రైను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ చింతా అనూరాధ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. గురువారం లోక్‌సభలో ఎంపీ అనూరాధ ఈ అంశాన్ని ప్రస్తావించారు.

● కొత్త దారి

మీ భవిష్యత్ కోసం

'జీవిత బీమా వలన ఉపయోగాలు ఏమిటి?' అనే ప్రశ్నకు జవాబు చెప్పినవాళ్లు ఉన్నారు. 'మాకు తెలియదు' అని అమాయకంగా అన్నవాళ్లూ ఉన్నారు. ప్రయోజనాల గురించి తెలియని వాళ్ల సంగతి పక్కనపెడితే 'ఇదిగో ఈ ప్రయోజనాలు ఉన్నాయి' అని బాగా చెప్పిన వాళ్లలో ఒక్కరికి కూడా జీవిత బీమా పాలసీ లేకపోవడం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన మేహా పరేఖ్‌ను ఆశ్చర్యపరిచింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'ఇన్‌సర్వైవ్' స్టార్టప్ స్టార్ట్ చేసింది మేహా.


మేహా పరేఖ్

కర్మ ఫౌండేషన్, యోగాంజలి, అఖండజ్యోతి లాంటి స్వచ్ఛంద సంస్థలతో కలిసి పని చేస్తుంది ఇన్‌సర్వైవ్.

'స్కూల్ ప్రాజెక్ట్ కోసం పనిచేస్తున్నప్పుడు ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను. చాలామంది మహిళలకు బ్యాంక్ ఎకౌంట్లు ఉన్నాయి. అయితే చాలా తక్కువ మందికి మాత్రమే జీవిత బీమా పాలసీ ఉంది. మహిళలే ప్రధాన లబ్ధిదారులు అయినప్పటికీ దూరంగా ఎందుకు ఉంటున్నారనేది అర్థం కాలేదు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇన్‌సర్వైవ్ మొదలుపెట్టాను' అంటున్న మేహా పరేఖ్ అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలకు జీవిత బీమా ప్రాముఖ్యత గురించి తెలియజేస్తుంది.

అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఎఐఎస్) స్టూడెంట్ అయిన మేహా పరేఖ్ నిర్వహించే అవగాహన తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. ఎల్‌ఐసీ ఉన్నతాధికారులు ఈ తరగతులలో జీవిత బీమా ప్రాముఖ్యత గురించి ఉపన్యసిస్తున్నారు.

ఉయ్ వాంట్ ఆల్ ది స్మోక్


హిప్-హప్ పాటల నుంచి పుట్టిన మాట... ఉయ్ వాంట్ ఆల్ ది స్మోక్. ఏదైనా సవాలు ఎదుర్కొనే సందర్భంలో, సాహసానికి రెడీ అయ్యే సందర్భంలో 'మేము సైతం' 'నేను కూడా' అని చెప్పడానికి ఉపయోగిస్తారు. సాధారణంగా గన్‌బ్యాటిల్స్‌లో దీన్ని ఉపయోగిస్తారు. ప్రస్తుతం ఫ్రెండ్లియర్ ఛాలెంజ్‌లో వాడుతున్నారు.



గోయింగ్ డచ్: ఒక హోటల్‌కు వెళ్లినప్పుడో, ఇంకెక్కడికైనా వెళ్లినప్పుడో ఎవరి బిల్లు వారు చెల్లించాలి అనుకునే సందర్భంలో ఉపయోగించే మాట.

ఉదా: డూ యూ వాంట్ మీ టు పిక్ అప్ ది బిల్ ఆర్ డూ యూ వాంట్ టు గో డచ్?

తనుబుద్ధి సాయి భరద్వాజ రెడ్డి 21 ఏళ్ల కుర్రాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల ఒకటవ తేదీన ఒడిశా రాష్ట్రం, పూరి పట్టణంలో జరిగిన మిస్టర్ ఇండియా పోటీల్లో విజేత. వచ్చే ఏడాది మార్చి 12 నుంచి 21 వరకు ఇండోనేషియా, 'బాలి' దీవిలో జరిగే 'మిస్టర్ యూనివర్స్ టూరిజమ్ -2023' పోటీల్లో మనదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా భరద్వాజ తన విజయరహస్యాన్ని సాక్షితో పంచుకున్నాడు.



సాయి భరద్వాజ రెడ్డి

మిస్టర్ యూనివర్స్ రేసులో మిస్టర్ ఇండియా



''మాది ప్రకాశం జిల్లా మార్కాపురం. నాన్న వ్యాపార రీత్యా విజయవాడలో పెరిగాను. నాకు ఫ్యాషన్ ప్రపంచం మీద చిన్నప్పటి నుంచి ప్యాషన్ ఉంది. ఫొటోజెనిక్‌గా కనిపించాలనే కోరిక ఉండేది. మంచి దుస్తులు ధరించడం, ఫొటోలు తీసుకోవడం ఇష్టం. బిడియపడకుండా కెమెరాను ఫేస్ చేయడం నన్ను విజేతగా నిలవడానికి కలిసి వచ్చిన ఒక అంశం. ఈ విజయం వెనుక ఐదేళ్ల కఠోరశ్రమ ఉంది.

నాకు నేనే అన్నీ!

పోటీదారులు ఎప్పుడూ మరొకరిలాగా కనిపించాలని అనుకరించకూడదు. నేను నాలాగే ఉన్నాను కాబట్టి విజేతనయ్యాను. మరో విషయం... నిపుణులైన కోచ్ శిక్షణ, డైటీషియన్ సలహాలు ఏవీ లేవు. ఉద్యోగం చేసుకుంటూనే ప్రాక్టీస్ చేశాను. ఉదయం ఐదింటికి లేచి జిమ్ చేసేవాడిని. ఓట్స్, ఎగ్స్ ప్రధానంగా సొంతవంట. డ్యూటీ నుంచి వచ్చిన తర్వాత మళ్లీ ఎక్సర్‌సైజ్. మొత్తానికి నేను అనుకున్నది సాధించాను. 'మిస్టర్ ఇంటర్నేషనల్' టైటిల్‌ని మనదేశానికి తీసుకురావాలనేది ప్రస్తుత లక్ష్యం.

– టి. సాయిభరద్వాజ రెడ్డి, మిస్టర్ ఇండియా 2022

బీటెక్‌లో తొలి ప్రయత్నం

మిస్ ఇండియా పోటీలలాగానే మిస్టర్ ఇండియా పోటీలు కూడా ఉంటాయని ఇంటర్‌లో ఉండగా తెలిసింది. బీటెక్‌లో యూనివర్సిటీ వేడుకల సందర్భంగా ఫ్యాషన్ కాంపిటీషన్ పాల్గొనడం, గెలవకపోవడం జరిగిపోయాయి. అప్పటి వరకు పోటీలను లైట్‌గా తీసుకున్నాను. పోటీని తేలిగ్గా తీసుకోరాదని అవగాహన వచ్చిన సందర్భం అది. డిప్రెషన్‌కి లోనయ్యాను కూడా. ఓటమిని జీర్ణించుకోలేని మానసిక స్థితిలో ఉన్నాననే సంగతిని నేను గ్రహించిన సందర్భం కూడా అదే. ఆ ఓటమి నాకు చాలా మంచి చేసిందనే చెప్పాలి. అప్పటి నుంచి బాడీ లాంగ్వేజ్‌ని కూడా ఈ పోటీలకు అనుగుణంగా మార్చుకున్నాను. నడవడం, నిలబడడం అన్నింటికీ ఓ లాంగ్వేజ్ ఉంటుంది. ప్రాక్టీస్ చేసేకొద్దీ నాలో ఆత్మవిశ్వాసం మెరుగవడం కూడా నాకే స్పష్టంగా తెలిసింది. ఈ పోటీలకు బాడీ బిల్డింగ్ అవసరం లేదు, ఫిట్‌గా ఉండడమే ప్రధానం. బాడీ, మైండ్, స్కిన్ ఆరోగ్యంగా ఉండాలి.

ప్రకటన లేని రెండో ప్రయత్నం

సెకండ్ అటెంప్ట్‌కి చాలా పక్కాగా సిద్ధమయ్యాను. గెలిచాను కూడా. అయితే కోవిడ్ కారణంగా అకస్మాత్తుగా ఫలితాల ప్రకటన లేకుండా ఆ పోటీలు అర్ధంతరంగా ముగిసిపోయాయి. ఇక మూడవ ప్రయత్నంలో 'మిస్టర్ క్లూ'గా ఎంపికయ్యాను. అయితే అది ఆన్‌లైన్ పోటీ. నాలుగవ ప్రయత్నంలో ఫైనల్స్‌కి ఎంపికయ్యాను, కానీ ఆర్థికపరమైన అడ్డంకి కారణంగా ఫైనల్స్‌లో పాల్గొనలేకపోయాను. నా ఫ్యాషన్ పోటీల్లో ఐదవ ప్రయత్నం ఈ 'మిస్టర్ ఇండియా' పోటీలు'' అని వివరించాడు భరద్వాజ.

విజేత బాధ్యత ఇది

ఈ పోటీలను గ్లోబల్ మోడల్ ఇండియా ఆర్గనైజేషన్ నిర్వహించింది. ఇప్పటి వరకు మిస్టర్ ఇండియా టైటిల్ గెలుచుకున్న విజేతల్లో చిన్నవాడు భరద్వాజ. వచ్చే ఏడాది బాలిలో మిస్టర్ యూనివర్స్ టైటిల్ కోసం పోటీ పడుతున్న అనేక దేశాల 'మిస్టర్'లలో కూడా చిన్నవాడు. మిస్టర్ ఇండియా టూరిజమ్ టైటిల్ విజేతగా... అనేక ప్రాంతాల్లో పర్యటిస్తూ భారతీయ సంస్కృతి, పర్యాటకం పట్ల అవగాహన కల్పించడం అతడి బాధ్యత. ఈ సందర్భంగా దక్షిణాది పట్ల ఉత్తరాది వారికి ఉన్న చిన్నచూపును రూపుమాపడానికి కృషి చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశాడు.

– వాకా మంజులారెడ్డి

● టెక్..టాక్



గూగుల్ ప్లే బెస్ట్ ఆఫ్ 2022 విన్నర్స్

యూజర్స్ ఛాయిస్: యాప్ ఆఫ్ 2022–షాపీ (షాపింగ్ యాప్) యూజర్స్ ఛాయిస్: ● గేమ్ ఆఫ్ 2022–ఆంగ్రీ బర్డ్స్ ● బెస్ట్ ఫర్ ట్యాబ్స్: పోక్-సేవ్, రీడ్, గ్రో (ఆల్ యువర్ కంటెంట్ ఇన్ వన్ ప్లేస్) ● బెస్ట్ ఫర్ వేర్: టూడూయిస్ట్ (టు–డూ లిస్ట్ ప్లానర్) ● బెస్ట్ యాప్ ఫర్ గుడ్: ఖయాల్ (సీనియర్ సిటిజన్ యాప్) ● బెస్ట్ ఫర్ పర్సనల్ గ్రోత్: ఫిలో: ఇన్‌స్టంట్ 1–టు–1 ట్యూటోరింగ్


పెబుల్ ఫ్రోస్ట్ వాచ్



● డిస్‌ప్లే: 1.87 అంగుళాలు ● ఐపీఎస్ టచ్ స్క్రీన్ ● బ్లూటూత్ కనెక్టివిటీ ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● ఫిట్‌నెస్ అండ్ హెల్త్ ట్రాకింగ్ ఫీచర్స్ ● కలర్స్: బ్లాక్, బ్లూ, గ్రే, ఆరెంజ్ ● స్లీప్ ట్రాకింగ్ ● క్యాలెండర్ ● కెమెరా కంట్రోల్ ● మ్యూజిక్ కంట్రోల్ ● ధర: 1,999

వాట్సాప్ న్యూ అవతార్ ఫీచర్

మనలోని భావాలు, ఫిలింగ్స్‌ను అవతార్స్ రూపంలో పంపడం వెరైటీగా ఉంటుంది. సందర్భానికి తగినట్లు మన ఫొటో కాకుండా మన అవతార్‌ను పంపడం బహు బాగుంటుంది. పాపులర్ ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ కొత్త అవతార్ ఫీచర్‌ని ప్రకటించింది. దీంతో ఔట్‌ఫిట్స్, హేర్ స్టైల్స్, ఫేసియల్ ఫీచర్స్ క్రియేట్ చేయవచ్చు. వాట్సాప్‌లో మన అవతార్‌ను సృష్టించడానికి...



1. వాట్సాప్ ఓపెన్ చేసిన తరువాత టాప్‌రైట్ కార్నర్‌లోని త్రీ–డాట్ మెనూ నొక్కాలి. **2.** సెట్టింగ్స్–క్లిక్ **3.** క్రియేట్ యువర్ అవతార్–క్లిక్ **4.** గెట్ స్టార్టెడ్–క్లిక్

● గేమింగ్

భూతం రైలు వస్తుంది... దూరం దూరం జరగండీ



సర్వైవల్ హారర్ గేమ్ 'చూ–చూ చార్లెస్' నేడు విడుదల అవుతుంది. స్టీఫెన్ కింగ్ నవల 'చార్లీ ది చూ–చూ'ను స్ఫూర్తిగా తీసుకొని రూపొందించిన గేమ్ ఇది. గేమ్‌లో అసలు సమస్యంతా చార్లెస్‌తోనే. ఎవరీ చార్లెస్? మనిషి కాదండీ. ట్రైన్! దీనికి 'డెత్ మెషిన్ ఆన్ వీల్స్' అని కూడా పేరు. 'చార్లెస్! ఐ డోన్ట్ వాంట్ టు డై' అని ధైర్యంగా నిలిచే వాళ్ల కోసం ఒక ఎల్లో ట్రైన్, అందులో మ్యాప్, మౌంటెడ్ మెషిన్ గన్‌లు ఉంటాయి. మరి ఆ రక్తపిపాస స్పైడర్ ట్రైన్ పనిపట్టే దమ్ము మీలో ఉంటే ఈ గేమ్‌లోకి అడుగుపెట్టండి. సత్తా చాటండి.

జానర్స్: ఇండిగేమ్, అడ్వెంచర్‌గేమ్, షూటర్ వీడియోగేమ్

ప్లాట్‌ఫామ్: ప్లేస్టేషన్ 4, ఎక్స్‌బాక్స్ వన్, మైక్రోసాఫ్ట్ విండోస్

సినిమా

యాక్షన్‌తో ఆరంభం

బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా గురువారం ప్రారంభమైంది. ముహూర్తం సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, అల్లు అరవింద్ క్లాప్ ఇచ్చారు. దర్శకుడు కె. రాఘవేంద్రరావు గౌరవ దర్శకత్వం వహించగా, నిర్మాతలు నవీన్ ఎర్నేని, కిలారు సతీష్, శిరీష్ స్క్రిప్ట్‌ను చిత్రయూనిట్‌కు అందించారు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ''బాలకృష్ణగారి ఇమేజ్‌ను దృష్టిలో ఉంచుకుని అనిల్ రావిపూడి ఓ పవర్‌ఫుల్ కథను రెడీ చేశాడు. బాలకృష్ణగారిని కొత్త అవతారంలో చూస్తారు. గురువారమే షూటింగ్ ఆరంభించాం. ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ ఆధ్వర్యంలో వేసిన సెట్‌లో వెంకట్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నాం. హీరోయిన్ శ్రీలీల ఈ సినిమాలో కీ రోల్ చేస్తున్నారు. తమన్ ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్'' అని చిత్రయూనిట్ పేర్కొంది.


● హరీష్ పెద్ది, బాలకృష్ణ, అనిల్ రావిపూడి, సాహు గారపాటి

ఊర మాస్

రవితేజ, శ్రీలీల ఊర మాస్ స్టెప్స్ వేశారు. 'దండ కడియాల్..' అంటూ సాగే ఈ ఊర మాస్ ఫోక్ సాంగ్ 'ధమాకా' చిత్రంలోనిది. ఈ పాటకు చిత్రసంగీతదర్శకుడు భీమ్స్ స్వరాలందించి, రాసి, పాడారు. భీమ్స్‌తో పాటు సాహితీ చాగంటి, మంగ్లీ పాడిన ఈ పాటకు జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేశారు. సినిమాలోని ఈ ఐదో పాటను గురువారం విడుదల చేశారు. రవితేజ, శ్రీలీల జంటగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ నెల 23న ఈ చిత్రం విడుదల కానుంది.


● శ్రీలీల, రవితేజ

వీరయ్య యాత్ర

యూరప్‌కు మకాం మార్చారు వాల్తేరు వీరయ్య. చిరంజీవి టైటిల్ రోల్‌లో, రవితేజ ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్రంలోని రెండు పాటల చిత్రీకరణ కోసం యూరప్ వెళ్లింది చిత్రయూనిట్. అక్కడి అందమైన లొకేషన్స్‌లో చిరంజీవి, శ్రుతీహాసన్‌లపై పాటలను చిత్రీకరిస్తారు. ''ఫ్యామిలీ (సతీమణి సురేఖ, మనవరాళ్లను ఉద్దేశించి)తో అటు విహారయాత్ర.. హీరోయిన్‌తో ఇటు వీరయ్య యాత్ర'' అంటూ ఫ్యామిలీ, శ్రుతీహాసన్‌తో ఉన్న ఫొటోలను షేర్ చేశారు చిరంజీవి. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న 'వాల్తేరు వీరయ్య' చిత్రం జనవరి 13న రిలీజ్ కానుంది. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, సహనిర్మాతలు: జీకే ప్రవీణ్, ఎం. మోహన్.


● చిరంజీవి, శ్రుతీహాసన్

నన్నెవ్వరూ బ్యాన్ చేయలేదు


● రష్మిక

''కన్నడ పరిశ్రమ నుంచి కొందరు నిర్మాతలు నన్ను బ్యాన్ చేశారని ప్రచారమవుతున్న వార్తలు అవాస్తవం. ఇప్పటివరకు నా వద్దకు అలాంటి విషయాలేవీ రాలేదు'' అని రష్మికా మందన్నా అన్నారు. గురువారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న రష్మిక మాట్లాడుతూ – ''కన్నడ సినిమాలపైన ఎప్పటికీ నాకు ప్రేమ ఉంటుంది. వాస్తవాలు తెలియకుండా దుష్ప్రచారం చేస్తున్నారు. 'కాంతారా' రిలీజైన రెండు రోజులకే ఆ సినిమా గురించి అడగడంతో చూడలేదు కాబట్టి సరిగ్గా స్పందించలేదు (ఈ విషయంపై రష్మికను ట్రోల్స్ చేశారు). ఆ తర్వాత చూసి, ఆ చిత్రబృందానికి మెసేజ్ చేశాను. వారు థ్యాంక్యూ అని రిప్లై ఇచ్చారు. నా వ్యక్తిగత విషయాలను కెమెరా పెట్టి ప్రపంచానికి చూపించలేను. అయినా నా వ్యక్తిగత విషయాలు ప్రపంచానికి అనవసరం. వృత్తిపరంగా నా సినిమాల గురించి చెప్పడం నా బాధ్యత. నా పై కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. వారి విజ్ఞతకే వదిలేస్తున్నాను'' అన్నారు.

అదే అట్టర్ ఫ్లాప్ షో

– సి. కల్యాణ్

''ఈ మధ్య 30రోజులు షూటింగ్ ఆపడమనేది అట్టర్ ఫ్లాప్ షో. చిన్న చిత్రాల నిర్మాతలు రిలీజ్ రోజున సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీటికి పరిష్కారం దొరుకుతుందని సమ్మెకి సమ్మతించా. అయితే సమ్మె వల్ల ఏం జరగదని నాలుగు మీటింగ్స్‌లోనే అర్థమైంది. కొన్ని సమస్యలు, లోపాలు గుర్తించినా వాటి పరిష్కారం జరగలేదు. సినిమా పరిశ్రమ బతికుందంటే కొత్తగా వచ్చే నిర్మాతల వల్లే'' అని తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు, నిర్మాత సి. కల్యాణ్ అన్నారు. నేడు (శుక్రవారం) తన పుట్టినరోజుని పురస్కరించుకుని సి. కల్యాణ్ మాట్లాడుతూ–''చెన్నైలో సహాయ దర్శకుడిగా నా కెరీర్ ప్రారంభమైంది. ఇప్పుడు అక్కడ దాదాపు 200 కోట్లతో 'కల్యాణ్ అమ్యూజ్‌మెంట్ పార్క్' ప్రాజెక్ట్ చేయడం తమిళనాడు ప్రభుత్వం, దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నాను. సదరన్ ఇండస్ట్రీకి పెద్దపీట వేస్తూ గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌కు మించి అవార్డ్స్‌ని అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఇటీవల సంక్రాంతి సినిమాల విడుదల విషయంలో ప్రొడ్యూసర్స్ కౌనిల్ వ్యాఖ్యలు సరికాదు. చిరంజీవి గారి సినిమా నిర్మాతలుగానీ, బాలకృష్ణగారి మూవీ నిర్మాతలుగానీ కౌన్సిల్‌కి ఫిర్యాదు చేయలేదు.. అలాంటప్పుడు రిలీజ్ విషయంలో కౌన్సిల్ మాట్లాడటం వంద శాతం తప్పు. థియేటర్లు రెంటల్ వ్యవస్థ నుండి పర్సంటేజ్‌లోకి మారిస్తే బాగుంటుంది. కానీ, కొందరు పెద్దవాళ్లు మారనివ్వరు. రెండు తెలుగు రాష్ట్రాల్లో స్లాబ్ సిస్టం తెస్తే కానీ ఇది మారదు. సినిమా పరిశ్రమకి ఆంధ్రప్రదేశ్ రెండో ఊరు అయిపోయింది. ఏదైనా సమస్య వస్తే అక్కడికి నలుగురు మాత్రమే వెళుతున్నారు.. ఆ రకంగా ఒక దూరం వచ్చేసింది. పదేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్ వాళ్లు ఇక్కడి సినిమా ఇండస్ట్రీలో పెద్దగా ఉండరని భావిస్తాను. గతంలో కృష్ణా నుండే పది మంది పరిశ్రమలోకి వచ్చి అందులో ఎవరో ఒకరు సక్సెస్ అయ్యేవారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. అయితే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిగారికి మాత్రం ఏపీలో చిత్ర పరిశ్రమని అభివృద్ధి చేయాలని ఉంది. ప్రస్తుతం ఎస్వీ కృష్ణారెడ్డిగారి దర్శకత్వంలో నేను నిర్మించిన 'ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు' సినిమా పూర్తయింది. అలాగే బాలకృష్ణగారితో 'రామానుజాచార్య' సినిమాని అంతర్జాతీయ స్థాయిలో నిర్మించడానికి పనులు జరుగుతున్నాయి'' అన్నారు.



లేడీ సింగమ్

బాలీవుడ్‌లో పోలీస్ బ్యాక్‌డ్రాప్ చిత్రాలకు రోహిత్ శెట్టి పెట్టింది పేరు. ఇప్పటికే ఆయన దర్శకత్వంలో అజయ్ దేవగన్ హీరోగా 'సింగమ్' (2001), 'సింగమ్ రిటర్న్స్' (2014)), 'సింబ' (2018),'సూర్యవన్షీ'(2021) వంటి పోలీస్ బ్యాక్‌డ్రాప్ చిత్రాలు వచ్చాయి. ఇక అజయ్ దేవగన్‌తోనే రోహిత్ శెట్టి 'సింగమ్ ఎగైన్' అనే సినిమా చేయడానికి రెడీ అవుతున్నారు. ఇందులో లేడీ పోలీసాఫీసర్ పాత్రకు దీపికా పదుకోన్‌ను తీసుకున్నట్లు గురువారం ప్రకటించారు రోహిత్. ''సింగమ్ ఎగైన్'లో దీపిక లేడీ సింగమ్'' అని 'సర్కస్' సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో పేర్కొన్నారు రోహిత్ శెట్టి. రణ్‌వీర్ సింగ్ హీరోగా రోహిత్ శెట్టి దర్శకత్వంలో రూపొందిన 'సర్కస్' ఈ నెల 23న రిలీజ్ కానుంది. ఇందులో ప్రత్యేక పాటకు భర్త రణ్‌వీర్‌తో కలిసి స్టెప్స్ వేశారు దీపిక. ఈ పాట విడుదల వేదికపై సింగమ్ సిరీస్‌లో అజయ్ దేవగన్ ఎలా నడిచేవారో అనుకరిస్తూ దీపికా నడిచి, అలరించారు.


● దీపికా పదుకోన్

అందుకే హోమ్‌వర్క్ చేశా!



''గుర్తుందా శీతాకాలం' మంచి సినిమా. ఇందులో కాలేజీ సీన్స్ ఉన్నాయి. ఈ వయసులో చేయకపోతే తర్వాత చేయలేం కాబట్టి చేశాను. మా సినిమా రిలీజ్‌కు ఈ సీతాకాలం సరైన సమయం అని ఇప్పుడు రిలీజ్ చేస్తున్నాం''

– సత్యదేవ్

అని సత్యదేవ్ అన్నారు. నాగశేఖర్ దర్శకత్వంలో సత్యదేవ్ హీరోగా, తమన్నా, మేఘా ఆకాష్, కావ్య శెట్టి హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గుర్తుందా శీతాకాలం'. చినబాబు, ఎంఎస్ రెడ్డి సమర్పణలో చింతపల్లి రామారావు, భావన రవి, నాగశేఖర్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ – ''స్కూల్, కాలేజ్, ఆ తర్వాత మిడిల్ ఏజ్.. ఇలా మూడు షేడ్స్ ఉన్న పాత్రలో నటించే అవకాశం రావడం చాలా అరుదు. కాబట్టి ప్రేక్షకులను ఒప్పించడానికి 'గుర్తుందా శీతాకాలం'లోని పాత్ర కోసం చాలా హోమ్ వర్క్ చేశాను. ఇంతకుముందు ఇదే జోనర్‌లో 'ప్రేమమ్, నా ఆటోగ్రాఫ్ స్వీట్ మెమొరీస్' వచ్చినా మా సినిమాలో కొత్తదనం కనిపిస్తుంది కాబట్టి ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ మధ్య థియేటర్స్‌కు జనాలు రావడం లేదంటున్నారు. కానీ మంచి కంటెంట్ ఉన్న సినిమాలు వస్తే ఆదరిస్తారు. 'సీతారామం, కాంతార, లవ్ టుడే' చిత్రాలు బాగుండటంతో మౌత్ టాక్ ద్వారా సూపర్ హిట్ అయ్యాయి. ప్రస్తుతం 'కృష్ణమ్మ, ఫుల్ బాటిల్'తో పాటు తమిళ్–కన్నడ భాషల్లో రూపొందుతున్న ఓ చిత్రంలో నటిస్తున్నాను'' అన్నారు.

వాళ్లకు క్లూ ఇవ్వాలనుకుంటా!


● మంచు లక్ష్మి

''నాపై వచ్చే ట్రోల్స్‌ను, మీమ్స్‌ని ఎంజాయ్ చేస్తుంటా. అలాంటి వాళ్లు ఇంకా ఏదైనా కొత్తగా క్రియేట్ చేసేందుకు క్లూ ఇవ్వాలని చూస్తుంటాను'' అని నటి మంచు లక్ష్మి అన్నారు. మోహన్ లాల్ హీరోగా వైసక్ దర్శకత్వంలో తెరకెక్కిన మలయాళ చిత్రం 'మాన్‌స్టర్'లో మంచు లక్ష్మి కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా మంచు లక్ష్మి మాట్లాడుతూ–''మాన్‌స్టర్'లో మంజు దుర్గ అనే పాత్ర చేశాను. ఇది చాలా మంచి క్యారెక్టర్. లక్కీగా నా క్యారెక్టర్ వరకు ఎలాంటి సీన్స్ తీసేయలేదు. మలయాళంలో నటిస్తున్నప్పుడు భాష పరంగా ఇబ్బంది పడ్డాను. పైగా నేను ఎనర్జిటిక్‌గా సెట్స్‌కు వెళ్తే, మీ పాత్ర డల్‌గా ఉండాలనేవారు. ఆ పాత్ర మూడ్‌ను, భాషను అర్థం చేసుకునేందుకు కొంత టైమ్ పట్టింది. మోహన్ లాల్‌గారు బహుముఖ ప్రజ్ఞాశాలి. కెరీర్ పరంగా ఆయన ఉన్న దశకి 'మాన్‌స్టర్' లాంటి వివాదాస్పద సబ్జెక్ట్ నాకెందుకు అనుకోవచ్చు.. కానీ ఆయన సవాళ్లు స్వీకరిస్తారు. ఇక సినిమాల్లో కంటే టీవీ కార్యక్రమాల్లో నన్ను నేనుగా ప్రేక్షకులకు చూపించుకోగలుగుతాను. ప్రస్తుతం 'గ్యాంబ్లర్, లేచింది మహిళా లోకం, అగ్నినక్షత్రం' వంటి చిత్రాల్లో నటిస్తున్నాను'' అన్నారు.

కేరాఫ్ మహాదేవపురం

విజయ్, శ్రావ్య జంటగా రాజారెడ్డి పానుగంటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉత్తమ విలన్' (కేరాఫ్ మహాదేవపురం). వి. సాయి లక్ష్మీనారాయణ గౌడ్, పి. శ్రవణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో అతిథిగా పాల్గొన్న దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ట్రైలర్‌ను విడుదల చేశారు. ''కమలహాసన్‌గారి 'ఉత్తమ విలన్' రేంజ్‌లో ఈ సినిమా పెద్ద హిట్ కావాలి'' అని డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కాశీ విశ్వనాథ్ అన్నారు. ''చక్కటి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా చిత్రం అందర్నీ అలరిస్తుంది'' అన్నారు సాయి లక్ష్మీనారాయణ గౌడ్, శ్రవణ్ కుమార్. ''ఉత్తమ విలన్' సినిమా బాగా వచ్చింది'' అన్నారు రాజారెడ్డి పానుగంటి. మాజీ ఎమ్మెల్యే ఎ. నగేష్, ఏసీపీ లక్ష్మణ్ రావు, దర్శక–నిర్మాత సత్యారెడ్డి, నటుడు హరీష్ పాల్గొన్నారు.


● శ్రావ్య, విజయ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
160	49
62,571	18,609

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	11,056	▲	98
డోజోన్స్	33,768	▲	170
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,472	▼	17
డాక్స్	14,265	▲	3
షాంఘై	3,197	▼	2
నికాయ్	27,574	▼	112

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
53,780	▲	197
బంగారం (99.5 స్వచ్ఛత)		
53,565	▲	197
వెండి (కిలో)		
65,358	▲	640

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకం	81.06	83.27
€	యూరో	ఎకం	85.06	88.12
£	బ్రిటన్ పౌండ్	ఎకం	98.89	102.02
¥	జపాన్ ఎన్ (100)	ఎకం	59.33	61.24
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకం	54.26	56.64
S$	సింగపూర్ డాలర్	ఎకం	59.79	61.72
SAR	సౌదీ రియాల్	[illegible]	20.66	22.98
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.54	23.34
¥	చైనా యువాన్	[illegible]	10.07	12.72

సేలంలో రామ్‌కో సిమెంట్స్ డ్రై మిక్స్ ప్లాంట్



రామ్‌కో సిమెంట్స్ తమిళనాడులోని సేలంలో నూతనంగా డ్రై మిక్స్ ప్లాంట్ ప్రారంభించింది. అత్యాధునిక టెక్నాలజీ కలిగిన ఇంజనీర్డ్ పాలీమర్ ఉత్పత్తులు తయారు చేస్తున్నట్లు కంపెనీ తెలిపింది. ఈ ప్లాంట్‌లో బిల్డింగ్ ఉత్పత్తులు (రామ్‌కో సూపర్ ఫైన్ పుట్టి, సూపర్ ప్లాస్టర్ రెడీ మిక్స్‌డ్ సాండ్ తదితర) తయారు చేయనున్నట్లు పేర్కొంది. పర్యావరణ నిబంధనలకు అనుగుణంగా కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించింది.

అశోక్ లేలాండ్ ఎండీగా శేణు అగర్వాల్



చెన్నై: అశోక్ లేలాండ్ నూతన ఎండీ, సీఈవోగా శేణు అగర్వాల్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆయన ఎస్కార్ట్స్ కుబోటా ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా టాప్–10 వాణిజ్య వాహన కంపెనీల్లో ఒకటిగా నిలవాలన్న లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా సాంకేతికత అభివృద్ధి, వృద్ధి, భవిష్యత్తు వ్యూహాన్ని అగర్వాల్ ముందుండి నడిపిస్తారని అశోక్ లేలాండ్ తెలిపింది. నాయకుడిగా నిరూపితమైన ట్రాక్ రికార్డ్‌ను ఆయన కలిగి ఉన్నారని, అనేక విభాగాలలో, విభిన్న సామర్థ్యాలలో ఆయనకు పని చేసిన అనుభవం ఉందని వివరించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

9-12-2022	
విశాఖ	545–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	544–00
విజయవాడ	544–00
రిటైల్ ధర (డజను)	78.00
8-12-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	526–00
వరంగల్	528–00
రిటైల్ ధర	6.00

బ్యాంకింగ్, ఆటో షేర్ల జోరు

- నాలుగు రోజుల నష్టాలకు చెక్
- సెన్సెక్స్ లాభం 160 పాయింట్లు
- 18,600పైకి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు నాలుగు రోజుల వరుస నష్టాల నుంచి గట్టెక్కాయి. గుజరాత్ ఎన్నికల్లో అధికార పార్టీ బీజేపీ విజయాన్ని మార్కెట్ వర్గాలు స్వాగతించాయి. బ్యాంకింగ్, ఆటో షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 160 పాయింట్లు బలపడి 62,571 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 49 పాయింట్లు లాభపడి 18,609 వద్ద నిలిచింది. ఉదయం నష్టాల ప్రారంభం తర్వాత కొంత తడబడిన సూచీలు మిడ్ సెషన్ తర్వాత పూర్తిగా లాభాల దిశగా కదిలాయి. ఫెడ్ రేట్ల పెంపు ఆందోళనలు ఉన్నప్పటికీ..., ప్రభుత్వరంగ బ్యాంకు షేర్లకు డిమాండ్ లభించింది. ఆర్థిక మందగమనం భయాలతో ఐటీ, ఫార్మా షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1132 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 772 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ రేట్లు పెంచవచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి. ''సూచీలు గరిష్ట స్థాయిల వద్ద ట్రేడవుతున్నందున ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరిస్తున్నారు. వచ్చే వారం ఫెడ్ రిజర్వ్ ద్రవ్య విధాన వైఖరి వెలువడేంత వరకు ఈక్విటీ మార్కెట్లలో ఒడిదుడుకులు తప్పవు'' అని స్టాక్ నిపుణులు తెలిపారు.

- ధర్మజ్ కార్ప్ లిస్టింగ్ విజయవంతమైంది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.237)తో పోలిస్తే 12శాతం లాభంతో రూ.266 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 18 శాతం ర్యాలీ చేసి రూ.279 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో లిస్టింగ్ ధర వద్దే రూ.266 స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 9.47 లక్షల చేతులు మారాయి. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ విలువ రూ.657 కోట్లుగా నమోదైంది.



13 నుంచి 'ల్యాండ్‌మార్క్' ఆఫర్

ఆటోమొబైల్ డీలర్‌షిప్ చైన్ ల్యాండ్‌మార్క్ కార్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 481–506 ధరల శ్రేణిని ప్రకటించింది. ఈ నెల 13న ప్రారంభంకానున్న ఇష్యూ 15న ముగియనుంది. ఈ ఐపీఓ ద్వారా సంస్థ రూ.552 కోట్లు సమీకరించనుంది.

సంపద సృష్టిలో పోటాపోటీ

- అగ్రపథాన రిలయన్స్ ఇండస్ట్రీస్
- అదానీ గ్రూప్ కంపెనీల హవా
- ఐదేళ్లలో రూ. 92 లక్షల కోట్ల జమ
- 2022లో గౌతమ్ అదానీ జోరు

ముంబై: సంపద సృష్టిలో దేశీ కార్పొరేట్ దిగ్గజాలు పోటీ పడుతున్నాయి. వార్షికంగా చూస్తే 2022లో అదానీ గ్రూప్ కంపెనీలు అగ్రభాగానికి చేరగా.. ముకేశ్ అంబానీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) గత ఐదేళ్లలో అన్ని రికార్డులనూ అధిగమిస్తూ లీడర్‌గా నిలిచింది. సంపద సృష్టిపై బ్రోకింగ్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ రూపొందించిన 27వ వార్షిక నివేదిక ప్రకారం గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీలు అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్ ఈ ఏడాది దుమ్మురేపాయి. ఇతర వివరాలు చూద్దాం..

టాప్–100 ఇలా..: గత ఐదేళ్లలో టాప్–100 కంపెనీలు మొత్తం రూ. 92.2 లక్షల కోట్ల సంపదను జమ చేసుకున్నాయి. ఇది సరికొత్త రికార్డుకాగా.. ఆర్‌ఐఎల్ అతిపెద్ద వెల్త్ క్రియేటర్‌గా నిలిచింది. అయితే 2022లో అదానీ గ్రూప్ కంపెనీలు వివిధ ఆస్తుల కొనుగోలు, కొత్త రంగాలలోకి ప్రవేశించడం వంటి అంశాలతో వెలుగులో నిలిచాయి. వెరసి 2022లో గౌతమ్ అదానీ 155.7 బిలియన్ డాలర్ల సంపదతో ప్రపంచంలోనే రెండో ధనవంతుడిగా రికార్డు సాధించారు. సెప్టెంబర్ 16కల్లా ఫోర్బ్స్ రూపొందించిన రియల్ టైమ్ జాబితా ఇది. ప్రధానంగా ఈ రెండు కంపెనీలలో 75 శాతం చొప్పున వాటా కలిగిన గౌతమ్ అదానీ 2022లో సెప్టెంబర్‌కల్లా ఏకంగా 70 బిలియన్ డాలర్ల సంపదను జమ చేసుకున్నారు. గ్రూప్ కంపెనీలు అదానీ టోటల్ గ్యాస్(37 శాతం), గ్రీన్ ఎనర్జీ(61 %) పోర్ట్స్(65 %)లోనూ వాటాలు కలిగి ఉండటం ఇందుకు సహకరించింది. ఇదే సమయంలో ముకేశ్ 92.3 బిలియన్ డాలర్ల సంపదతో జాబితాలో 8వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. 253.5 బిలియన్ డాలర్ల సంపదతో ఎలక్ట్రిక్ కార్ల(టెస్లా) దిగ్గజం ఎలన్ మస్క్ ప్రపంచ కుబేరుడిగా ఆవిర్భవించారు.

ఐదేళ్ల కాలంలో..: 2017–22 కాలంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ ట్రాన్స్‌మిషన్, ఎంటర్‌ప్రైజెస్ అత్యంత వేగంగా నిలకడగా ఎదిగిన భారీ కంపెనీలుగా నిలిచాయి. రంగాలవారీగా చూస్తే ఈ కాలంలో టెక్నాలజీ, ఫైనాన్షియల్స్ తొలి రెండు ర్యాంకులను సాధించాయి. సంపద సృష్టిలో టాప్–100 కంపెనీలను, మార్కెట్ విలువల్లో మార్పులను నివేదిక పరిగణించింది. దీనిలో భాగంగా విలీనాలు, విడదీతలు, ఈక్విటీ జారీ, బైబ్యాక్ తదితర కార్పొరేట్ అంశాలను సైతం లెక్కలోకి తీసుకుంది. ఈ ఐదేళ్లలో నాలుగేళ్లపాటు ఆర్‌ఐఎల్ అత్యధిక సంపదను సృష్టించిన దిగ్గజంగా ఆవిర్భవించింది. వెరసి ఐదేళ్లకుగాను టాప్ ర్యాంకును కైవసం చేసుకుంది. ఇక టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఈ జాబితాలో టాప్–5లో నిలిచాయి. కాగా.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ గత ఐదేళ్లలో నిలకడైన సంపద సృష్టికి నిదర్శనంగా నిలిచింది.



ఫైనాన్షియల్స్‌కు ఎఫ్‌పీఐల ఓటు

నవంబర్‌లో రూ. 14,205 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల రంగంపట్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) ఆసక్తి చూపుతున్నారు. గత నెలలో నికరంగా రూ. 14,205 కోట్ల(2.1 బిలియన్ డాలర్లు)ను ఇన్వెస్ట్ చేశారు. రుణ వృద్ధి, మొండిబకాయి(ఎన్‌పీఏ)ల పోర్ట్‌ఫోలియో దిగిరావడం వంటి సానుకూల అంశాలు ఇందుకు దోహదం చేసినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. అయితే అక్టోబర్‌లో ఇదే రంగానికి చెందిన రూ. 4,686 కోట్ల విలువైన షేర్లు విక్రయించారు. ప్రధానంగా లాభాల స్వీకరణ ప్రభావం చూపినట్లు నిపుణులు తెలియజేశారు. కాగా.. ఎన్‌ఎస్‌డీఎల్ గణాంకాల ప్రకారం నవంబర్‌లో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 36,238 కోట్లను దేశీ ఈక్విటీలలో ఇన్వెస్ట్ చేశారు. వీటిలో ఫైనాన్షియల్ రంగానికే 39 శాతాన్ని(రూ. 14,205 కోట్లు) కేటాయించడం గమనార్హం! గత నెల తొలి రెండు వారాల్లోనే అత్యధిక పెట్టుబడులను వెచ్చించారు. ఇటీవల ఆర్థిక వ్యవస్థ బలపడటం, పెట్టుబడి వ్యయాలు పుంజుకోవడం వంటి సానుకూల అంశాలు రుణ వృద్ధికి దోహదం చేస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ఇది ఇకపై ఫైనాన్షియల్ రంగ పనితీరు మరింత మెరుగుపడేందుకు సహకరించనున్నట్లు తెలియజేశారు. ఫలితంగా ఎఫ్‌పీఐలు ఫైనాన్షియల్ సర్వీసుల రంగంపట్ల ఆసక్తి చూపుతున్నట్లు వివరించారు.

ఎఫ్‌ఎంసీజీపై తగ్గుతున్న ధరల ఒత్తిడి

- గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ అప్
- ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి వెల్లడి



న్యూఢిల్లీ: ఎఫ్‌ఎంసీజీ రంగంపై ద్రవ్యోల్బణంపరమైన ఒత్తిడి కొద్దిగా తగ్గుతోందని ఐటీసీ సీఎండీ సంజీవ్ పురి తెలిపారు. ప్రస్తుతం భారీ ద్రవ్యోల్బణం కారణంగా గ్రామీణ మార్కెట్లలో అమ్మకాలు ఒక మోస్తరుగా ఉన్నప్పటికీ రాబోయే రోజుల్లో మరింత మెరుగుపడనున్నాయని ఆయన చెప్పారు. పరిశ్రమల సమాఖ్య సీఐఐ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పురి ఈ విషయాలు వివరించారు. ద్రవ్యోల్బణం అధికంగా ఉన్న ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మెరుగైన స్థానంలోనే ఉందని పురి చెప్పారు. గతంలో దాదాపు అయిదేళ్లలో పెరిగేంత స్థాయిలో ప్రస్తుతం చాలా మటుకు ఉత్పత్తుల ధరలు పెరిగిపోయాయని, వినియోగ ధోరణులపై ఇవి ప్రభావం చూపిస్తున్నాయని ఆయన తెలిపారు. అయితే, వర్షపాత ధోరణులను బట్టి గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్ మెరుగ్గానే ఉండబోతోందని చెప్పారు. మరోవైపు, పెట్టుబడులకు ప్రస్తుతం స్థూల ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని పురి తెలిపారు. నిధుల లభ్యత, కార్పొరేట్ల ఆదాయాలు మొదలైనవన్నీ బాగున్నాయన్నారు. సామర్థ్యాల వినియోగం కూడా పుంజుకుంటోందని చెప్పారు. అయితే, అంతర్జాతీయ అనిశ్చితి నెలకొనడమనేది ఎగుమతులపరంగా ప్రతికూలాంశంగా ఉంటోందని పురి తెలిపారు. ప్రధానంగా దేశీ మార్కెట్‌పైనే ఎక్కువగా దృష్టి పెట్టే తమ కంపెనీల్లాంటివి ప్రైవేట్ పెట్టుబడులను యథాప్రకారం కొనసాగిస్తున్నాయన్నారు. తయారీ రంగం కీలకమైనదే అయినప్పటికీ మిగతా రంగాల్లోనూ భారత్ పుంజుకోవాలని పురి చెప్పారు. ఆదాయాల స్థాయిలను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

సాక్షి స్పోర్ట్స్

నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా మహిళల టి20 సిరీస్

మహిళల టి20 ప్రపంచకప్ సన్నాహాల్లో భాగంగా భారత జట్టు పటిష్టమైన ఆస్ట్రేలియాను ఢీకొంటోంది. ఇరు జట్ల మధ్య ఐదు టి20ల సిరీస్‌లో శుక్రవారం ముంబైలో తొలి మ్యాచ్ జరగనుంది. ఓపెనింగ్‌లో స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన, షఫాలీ వర్మ ఫామ్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సహా చాలెంజర్ ట్రోఫీలో సత్తా చాటుకున్న హర్లీన్ డియోల్, యస్తిక భాటియాలతో భారత బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగా ఉంది. అయితే ఆస్ట్రేలియాతో భారత అమ్మాయిలకు చేదు ఫలితాలే ఉన్నాయి. కీలకమైన పోటీల్లో ఒత్తిడిలో చిత్తయిన సందర్భాలున్నాయి. రెగ్యులర్ కెప్టెన్ మెగ్ లానింగ్ గైర్హాజరీ కావడంతో ఆసీస్ జట్టును అలీసా హీలీ నడిపించనుంది. రాత్రి 7 గంటల నుంచి ప్రారంభమయ్యే మ్యాచ్ 'స్టార్ స్పోర్ట్స్' చానెల్‌లో ప్రసారం కానుంది.



ఆటతో అదరగొట్టారు



17 రోజులలో 56 మ్యాచ్‌లు...ఎన్నో ఉత్కంఠ మలుపులు, ఎన్నో ఉద్వేగభరిత క్షణాలు... 32తో మొదలైన సమరం ఇప్పుడు 8 జట్లకు చేరింది. లెక్కకు మిక్కిలి ఖర్చుతో ఆతిథ్యం ఇచ్చినా ఒక్క మ్యాచ్ గెలవలేని ఖతర్ నిరాశపర్చగా... అర్జెంటీనాకు షాక్ ఇచ్చినా ముందంజ వేయలేని సౌదీ అరేబియా, నాలుగు సార్లు చాంపియన్ జర్మనీ నిష్క్రమణ తొలి రౌండ్‌లో హైలైట్‌గా నిలిచాయి. నాకౌట్ పోరులో రెండు మ్యాచ్‌లలో పెనాల్టీల ద్వారా ఫలితం తేలగా... క్రొయేషియా గోల్ కీపర్ ఆట, మొరాకో సంచలన ప్రదర్శన అభిమానులు మరచిపోలేరు. క్వార్టర్స్ సమరానికి వెళ్లే ముందు ఇప్పటి వరకు సాగిన ఆటను చూస్తే...

ఎన్నో ఏళ్లుగా అర్జెంటీనా తరఫున లయోనల్ మెస్సీ అద్భుతాలు చేసి ఉండవచ్చు. కానీ ఈ వరల్డ్ కప్‌తో ఆ జట్టులో కూడా కొత్త హీరోలు పుట్టుకొచ్చారు. అలెక్సిస్ మ్యాక్, ఎన్జో ఫెర్నాండెజ్, జూలియాన్ అల్వారెజ్ కీలక సమయాల్లో మెరుపు ప్రదర్శనతో జట్టును క్వార్టర్స్‌కు చేర్చారు. కొరియాతో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ జోరు ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. ముఖ్యంగా మొదటి అర్ధ భాగంలో ఆటను చూస్తే 1982 తర్వాత ఈ తరహా దూకుడు చూడలేదని కొందరు మాజీ బ్రెజిల్ ఆటగాళ్లే చెప్పారంటే అతిశయోక్తి లేదు. ఎందుకంటే ఆ నాలుగు గోల్స్ అద్భుతంగా, ఒకదానిని మించి మరొకటి ఉన్నాయి. రిచర్లిసన్ రూపంలో మరో స్టార్ ఉదయించాడు. టీమ్ తరఫున మూడు గోల్స్ చేసిన రిచర్లిసన్... రొనాల్డో రిటైర్మెంట్ తర్వాత తమకు '9వ నంబర్ జెర్సీ' రూపంలో లభించిన వరమని బ్రెజిల్ అభిమానులు చెబుతున్నారు.

యువ ఆటగాళ్ల జోరు...

గత వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలిచిన క్రొయేషియా ఈ సారి యువ ఆటగాళ్ల ప్రదర్శనతో చెలరేగింది. 2018 టోర్నీలో ల్యూకా మోడ్రిక్ ఒంటి చేత్తో జట్టును ఫైనల్ చేర్చగా...ఈ సారి అతనికి తోడు మరికొందరు జూనియర్లు జత కలిశారు. అటాకింగ్‌లో మార్కో లివాజా ఆకట్టుకోగా, జోస్కో గ్వార్డియల్‌కు 'ప్రపంచంలోనే అత్యుత్తమ సెంట్రల్ డిఫెండర్' అంటూ ప్రశంసలు కురుస్తున్నాయి. అతని కోసం యూరోపియన్ క్లబ్‌లు భారీ మొత్తం చెల్లించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. గోల్ కీపర్ డొమినిక్ లివకోవిక్ కూడా పెనాల్టీ సేవింగ్ స్పెషలిస్ట్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. జపాన్‌తో మ్యాచ్‌లో ఇది కనిపించింది. కైల్ ఎంబాపె ఈ వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్‌ను ముందుండి నడిపిస్తున్నాడు. 5 గోల్స్ సాధించిన అతను 2 గోల్స్‌లో సహకారం అందించాడు. అతని ప్రదర్శన ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడిగా నిలిపేలా కనిపిస్తోంది. 1986 ప్రపంచకప్‌లో మారడోనా తరహాలో జట్టులోని ఒకే ఆటగాడు ప్రభావం చూపించిన తీరుతో విశ్లేషకులు ఇప్పుడు ఎంబాపె ఆటను పోలుస్తున్నారు. ఉస్మాన్ ఎంబెలె ఈ టోర్నీలో సత్తా చాటిన మరో ఫ్రాన్స్ ఆటగాడు.

మొరాకో మెరుపులు...

ప్రపంచకప్ మొత్తానికి హైలైట్‌గా నిలిచే ప్రదర్శన మొరాకోదే. అనూహ్యమైన ఆటతో దూసుకొచ్చి తొలిసారి ఈ మెగా టోర్నీలో ఆ జట్టు క్వార్టర్స్ చేరింది. దుర్భేద్యమైన డిఫెన్స్‌తోనే టీమ్ ముందంజ వేయగలిగింది. ఆడిన నాలుగు మ్యాచ్‌లలో కలిపి ఆ జట్టు ఒకే ఒక గోల్ ఇచ్చింది. అదీ సెల్ఫ్ గోల్ మాత్రమే! 2018లో అత్యధిక గోల్స్ చేసిన బెల్జియం, రన్నరప్ క్రొయేషియాతో పాటు ప్రిక్వార్టర్స్‌లో 2010 చాంపియన్ స్పెయిన్‌ను చిత్తు చేసిన తీరు అసమానం. ఇంగ్లండ్ జట్టులో సమష్టితత్వం బాగా కనిపించింది. జట్టు ఇప్పటి వరకు మొత్తం 12 గోల్స్ స్కోర్ చేయగా, వాటిని ఏడుగురు వేర్వేరు ఆటగాళ్లు సాధించారు. గత వరల్డ్ కప్‌లో ఒక్క హ్యారీ కేన్ మాత్రమే 6 గోల్స్ చేయగా, ఈ సారి అతను ఒకే ఒక గోల్ చేసినా... జట్టు మాత్రం దూసుకుపోతోంది.

పోర్చుగల్ జట్టు ప్రిక్వార్టర్ ఫైనల్లో చూపిన ప్రదర్శనతో 'వన్ మ్యాన్ షో'కు తెర పడినట్లయింది. స్విట్జర్లాండ్‌పై 6–1తో విజయం వరల్డ్‌కప్ చరిత్రలోనే ఆ జట్టు అత్యుత్తమ ప్రదర్శన. తమ స్టార్ క్రిస్టియానో రొనాల్డోను పక్కన పెట్టి టీమ్ చూపిన తెగువ మంచి ఫలితాన్ని ఇచ్చింది. గొన్సాలో రామోస్ రూపంలో కొత్త స్టార్ ఉద్భవించాడు. ప్రిక్వార్టర్ మ్యాచ్‌లో చేసిన హ్యాట్రిక్‌తో అతను క్లబ్ ఫుట్‌బాల్‌లో ఒక్కసారిగా హాట్ స్టార్‌గా మారిపోయాడు. జొవా ఫెలిక్స్, బెర్నార్డో సిల్వ కూడా సత్తా చాటి పోర్చుగల్ టైటిల్ ఆశలు పెంచారు.

–సాక్షి క్రీడా విభాగం

నేడు క్వార్టర్ ఫైనల్ సమరాలు

బ్రెజిల్ x క్రొయేషియా
రాత్రి గం. 8:30 నుంచి

అర్జెంటీనా x నెదర్లాండ్స్
అర్ధరాత్రి గం.12.30నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ఐదు సార్లు విజేత అయిన బ్రెజిల్ ఈ సారి కూడా ఫేవరెట్‌గానే ఉంది. క్వార్టర్స్ పోరులో ఆ జట్టు గత టోర్నీ రన్నరప్ క్రొయేషియాను ఎదుర్కొంటుంది. ఇరు జట్లు వరల్డ్‌కప్‌లో మూడో సారి తలపడనుండగా, నాకౌట్ దశలో తలపడటం ఇదే తొలిసారి. గత రెండు మ్యాచ్‌లలో కూడా బ్రెజిల్ (1–0తో 2006లో, 3–1తో 2014లో) విజేతగా నిలిచింది. కోచ్ టిటె నాయకత్వంలో అటాకింగ్‌నే నమ్ముకొని బ్రెజిల్ ఫలితాలు సాధించింది. ఇప్పటి వరకు సత్తా చాటిన ఆటగాళ్లతో పాటు స్టార్ ప్లేయర్ నెమార్, అలెక్సాండ్రో కూడా రాణిస్తే బ్రెజిల్‌కు తిరుగుండదు. క్రొయేషియా రికార్డును బట్టి చూస్తే ఫామ్‌లో ఉన్న బ్రెజిల్‌ను నిలువరించడం అంత సులువు కాదు. అయితే ఈ వరల్డ్‌కప్‌లో సంచలనాలకు లోటేమీ లేదు. మోడ్రిక్, కొవాసిక్‌తో పాటు బ్రొజోవిక్ ప్రదర్శనపై జట్టు ఆధారపడుతోంది.



మరో మూడు మ్యాచ్‌లలో విజయం సాధిస్తే ఆల్‌టైమ్ గ్రేట్‌లలో ఒకడైన మెస్సీ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఫుట్‌బాల్ ప్రపంచంలో అన్నీ సాధించిన మెస్సీకి వరల్డ్ కప్ మాత్రం ఇంకా కలే. తన ఐదో ప్రయత్నంలోనైనా దీనిని సాధించాలని అతను పట్టుదలగా ఉన్నాడు. అయితే ఈ సారి అంతే స్థాయిలో రాణిస్తున్న అల్వారెజ్‌పై కూడా జట్టు బాగా ఆధారపడుతోంది. వ్యూహం ప్రకారం చూస్తే నెదర్లాండ్స్ ఒక్క మెస్సీని నిలువరిస్తే సరిపోదు. మరో వైపునుంచి అల్వారెజ్ దూసుకుపోగలడు. మూడు సార్లు రన్నరప్‌గా నిలిచిన నెదర్లాండ్స్ కోచ్ వాన్ గాల్ నేతృత్వంలో ఒక్కసారిగా పటిష్టంగా మారింది. అతని కోచింగ్‌లో డచ్ బృందం 19 మ్యాచ్‌లలో ఒక్కటి ఓడిపోలేదు. ఫ్రెంకీ డి జోంగ్, డెన్జెల్ డంఫ్రైస్ కీలక ఆటగాళ్లు. ఇరు జట్ల మధ్య వరల్డ్‌కప్‌లో 5 మ్యాచ్‌లు జరగ్గా...అర్జెంటీనా 3, నెదర్లాండ్స్ 1 గెలిచాయి. మరో మ్యాచ్ డ్రా అయింది.

9 వన్డేలు, 4 టెస్టులు, 6 టి20లు

- 79 రోజుల వ్యవధిలో భారత్ మ్యాచ్‌లు
- హైదరాబాద్, వైజాగ్‌లలో వన్డేలు

ముంబై: కొత్త ఏడాదిలో భారత క్రికెట్ జట్టు సొంత గడ్డపై బిజీ షెడ్యూల్‌తో తీరిక లేకుండా మ్యాచ్‌లు ఆడనుంది. దీనికి సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) గురువారం 'హోమ్ సీజన్' షెడ్యూల్‌ను విడుదల చేసింది. వరుసగా శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్లు భారత పర్యటనకు రానున్నాయి. ఈ మ్యాచ్‌లు తేదీలు, వేదికలను బోర్డు ఖరారు చేసింది. శ్రీలంకతో 3 టి20లు, 3 వన్డేల్లో భారత్ తలపడనుంది. ఆ తర్వాత న్యూజిలాండ్‌తోనూ 3 వన్డేలు, 3 టి20ల్లో టీమిండియా ఆడుతుంది. అనంతరం ఆస్ట్రేలియాతో ప్రతిష్టాత్మక బోర్డర్–గావస్కర్ ట్రోఫీ ప్రారంభమవుతుంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే ఈ నాలుగు టెస్టుల ద్వారా భారత్ సాధ్యమైనన్ని ఎక్కువ పాయింట్లు సాధించాల్సి ఉంటుంది. టెస్టు పోరు ముగిసిన తర్వాత ఆసీస్‌తోనే 3 వన్డేలు జరుగుతాయి. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లలో భారత్‌లోనే వన్డే వరల్డ్ కప్ ఉన్న నేపథ్యంలో వన్డే మ్యాచ్‌లకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ఈ 19 అంతర్జాతీయ మ్యాచ్‌లన్నీ 79 రోజుల వ్యవధిలో జరగనుండగా...17 వేర్వేరు వేదికలు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుండటం విశేషం. భారత్, న్యూజిలాండ్ వన్డే హైదరాబాద్‌లో, భారత్, ఆస్ట్రేలియా వన్డే విశాఖపట్నంలో జరుగుతుంది.

శ్రీలంకతో: టి20లు: జనవరి 3 (ముంబై) 5 (పుణే), 7 (రాజ్‌కోట్); వన్డేలు: 10 (గువాహటి), 12 (కోల్‌కతా), 15 (తిరువనంతపురం).

న్యూజిలాండ్‌తో: వన్డేలు: జనవరి 18 (హైదరాబాద్), 21 (రాయ్‌పూర్), 24 (ఇండోర్); టి20లు: 27 (రాంచీ), 29 (లక్నో), ఫిబ్రవరి 1 (అహ్మదాబాద్).

ఆస్ట్రేలియాతో: టెస్టులు: ఫిబ్రవరి 9–13 (నాగపూర్), 17–21 (ఢిల్లీ), మార్చి 1–5 (ధర్మశాల), 9–13 (అహ్మదాబాద్); వన్డేలు: మార్చి 17 (ముంబై), మార్చి 19 (విశాఖపట్నం), 22 (చెన్నై).

హెడ్, లబుషేన్ సెంచరీలు



అడిలైడ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 89 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 330 పరుగులు చేసింది. మార్నస్ లబుషేన్ (120 నాటౌట్; 11 ఫోర్లు), ట్రవిస్ హెడ్ (114 నాటౌట్; 12 ఫోర్లు) అజేయ సెంచరీలతో కదం తొక్కారు. అబేధ్యమైన నాలుగో వికెట్‌కు వీరిద్దరు 199 పరుగులు జత చేశారు. తొలి టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ సాధించిన లబుషేన్‌కు ఇది మూడు ఇన్నింగ్స్‌లలో వరుసగా మూడో సెంచరీ కావడం విశేషం. ఉస్మాన్ ఖాజా (62; 9 ఫోర్లు) కూడా రాణించగా, వార్నర్ (21), స్టీవ్ స్మిత్ (0) విఫలమయ్యారు. ఏడుగురు కరీబియన్ బౌలర్లు రోజంతా కష్టపడగా... జోసెఫ్, హోల్డర్, థామస్‌లు చెరో వికెట్ పడగొట్టారు.

మళ్లీ ఓడిన ప్రణయ్

బ్యాంకాక్: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో హెచ్.ఎస్. ప్రణయ్ ఆటకు గ్రూప్ దశలోనే తెరపడింది. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిపోవడంతో 30 ఏళ్ల భారత స్టార్‌కు సెమీస్ చేరే అవకాశం చేజారింది. ఇక గ్రూప్ 'ఎ'లో ఆఖరి మ్యాచ్ ఆడి రావడమే మిగిలింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో ప్రణయ్ 21–23, 21–17, 19–21తో చైనాకు చెందిన లు గ్వాంగ్ జు చేతిలో పరాజయం పాలయ్యాడు. 84 నిమిషాల పాటు జరిగిన సమరంలో భారత ఆటగాడు చైనీస్ ప్రత్యర్థితో హోరాహోరీగా తలపడ్డాడు. గ్రూపులో మిగిలిపోయిన నామమాత్రమైన ఆఖరి మ్యాచ్‌లో ప్రపంచ 12వ ర్యాంకర్ ప్రణయ్... ఒలింపిక్ చాంపియన్, నంబర్‌వన్ విక్టర్ అక్సెల్సన్ (డెన్మార్క్)తో తలపడతాడు. శుక్రవారం ఈ మ్యాచ్ జరుగుతుంది.

భారత్ 'ఎ'కు భారీ ఆధిక్యం


సిల్హెట్: బంగ్లాదేశ్ 'ఎ'తో జరుగుతున్న రెండో అనధికారిక టెస్టులో భారత్ 'ఎ' 310 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సంపాదించింది. జయంత్ యాదవ్ (83; 10 ఫోర్లు)తో పాటు సౌరభ్ కుమార్ (55; 7 ఫోర్లు, 2 సిక్సర్లు), నవదీప్ సైనీ (50 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. దీంతో భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 562 పరుగుల భారీస్కోరు వద్ద డిక్లేర్ చేసింది. జయంత్, సౌరభ్ ఏడో వికెట్‌కు 86 పరుగులు జోడించగా, సైనీ, ముకేశ్ కుమార్ (23 నాటౌట్; 3 ఫోర్లు) అజేయమైన ఆఖరి వికెట్‌కు 68 పరుగులు జత చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్ మొదలుపెట్టిన బంగ్లా 'ఎ' ఆటనిలిచే సమయానికి 49/2 స్కోరు చేసింది. షాద్‌మన్ ఇస్లామ్ (22 బ్యాటింగ్), మోమినుల్ (4 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



ఏకలవ్య జాతీయ క్రీడలకు ఏపీ ఆతిథ్యం

17 నుంచి 22 వరకు విజయవాడ, ఏఎన్‌యూలో నిర్వహణ

సాక్షి, అమరావతి: మరో క్రీడా సంబరానికి ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ మెగా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇచ్చే అవకాశం రాష్ట్రానికి దక్కింది. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయ క్రీడలు డిసెంబర్ 17 నుంచి 22 వరకు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ గురువారం మీడియాకు విడుదల చేసింది. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ జాతీయ క్రీడలను విజయవాడలోని ఆంధ్ర లయోలా కాలేజీ, గుంటూరు సమీపంలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో 24 రాష్ట్రాల నుంచి దాదాపు 4,500 మంది విద్యార్థులు, 450 మంది పర్యవేక్షకులు పాల్గొంటారు. ఈ క్రీడలు చివరిసారిగా 2019లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగాయి. కరోనా కారణంగా 2020, 2021లో పోటీలు రద్దయ్యాయి. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించనున్నారు. గతంలో కంటే ఘనంగా ఈ పోటీలను నిర్వహించేందుకు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఈ క్రీడల నిర్వహణ కోసం ఎగ్జిక్యూటివ్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ బోర్డుకు చైర్మన్‌గా ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, వైస్ చైర్మన్‌గా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఆర్గనైజింగ్ సెక్రటరీగా గిరిజన సంక్షేమ గురుకులాల సంస్థ జాయింట్ సెక్రటరీ పి.హేమలత రాణి, సభ్యులుగా గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు జాహ్నవి మేడిద, గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్, ట్రైకార్ ఎండీ ఇ.రవీంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎస్.శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు.



22మంది ఏఆర్ ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 22 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) ఇన్‌స్పెక్టర్లకు డీఎస్పీలుగా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. 22మంది అధికారులకు ఏఆర్ డీఎస్పీలుగా పోస్టింగులు ఇస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ముగ్గురు డీఎస్పీల బదిలీ

రాష్ట్రంలో ముగ్గురు డీఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా ఉన్న కె.కేశప్పను అన్నమయ్య జిల్లా మదనపల్లి డీఎస్పీగా, విజయవాడ నగరంలో సీసీఎస్ ఏసీపీగా ఉన్న కె.ఆదినారాయణను పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా బదిలీ చేశారు. సత్తెనపల్లి డీఎస్పీగా ఉన్న ఆర్.విజయ్‌భాస్కర రెడ్డిని మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

చేనేత, జౌళిశాఖలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా పరిధిలో ఉపాధి కల్పన కార్యక్రమంలో తాత్కాలిక ప్రాతిపదికన ఆరు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ కె.శ్రీకాంత్ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు టెక్స్‌టైల్ డిజైనర్, మూడు క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు హ్యాండ్లూమ్ టెక్నాలజీలో డిప్లొమా పూర్తిచేయడంతోపాటు రెండేళ్ల అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలని తెలిపారు. టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టుకు టెక్స్‌టైల్ డిజైన్ కోర్సు ఉత్తీర్ణులవడంతోపాటు చేనేత విభాగంలో రెండేళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. అర్హత, అనుభవం, వయసు, స్థానిక నివాసం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామని వివరించారు. మూడేళ్లపాటు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీలోపు కమిషనర్, చేనేత, జౌళి శాఖ, 4వ అంతస్తు, ఐహెచ్‌సీ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా, పిన్ కోడ్-522503 అనే చిరునామాకు పంపించాలని సూచించారు. పూర్తి వివరాలకు www. aphandtex. gov. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.